సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం   వెల: ₹ 7.00   సంపుటి: 15   సంచిక: 343

SUNDAY Special   ఆదివారం 5-3-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'



మహిళల ప్రీమియర్ లీగ్ షురూ

తొలిసారి నిర్వహిస్తున్న మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) శనివారం ముంబైలో ఘనంగా ప్రారంభమైంది. ఐదు జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీ తొలి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ 143 పరుగుల భారీ తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై ఘన విజయం సాధించింది. మ్యాచ్‌కు ముందు జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమం ఆకట్టుకుంది. -IIలో



వెర్‌స్టాపెన్‌కు పోల్ పొజిషన్

ఫార్ములావన్ 2023 సీజన్‌ను డిఫెండింగ్ చాంపియన్, రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ ఘనంగా ప్రారంభించాడు. సీజన్ తొలి రేస్ బహ్రెయిన్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ పోల్ పొజిషన్ దక్కించుకున్నాడు. ఈ డచ్ డ్రైవర్ 0.139 సెకన్ తేడాతో ప్రత్యర్థిని వెనక్కి తోశాడు. శనివారం సఖిర్ సర్క్యూట్‌లో లైట్ల వెలుగులో హోరాహోరీగా జరిగిన క్వాలిఫయింగ్ రేసును వెర్‌స్టాపెన్ 1 నిమిషం 29.708 సెకన్లలో ముగించి అగ్రస్థానంలో నిలిచాడు. సహచర రెడ్‌బుల్ డ్రైవర్ సెర్గియో పెరెజ్ (1 నిమిషం 29.846 సెకన్లు)కు రెండో స్థానం దక్కింది. ఫెరారీ డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్ 1 నిమిషం 30 సెకన్లతో మూడో స్థానంతో ముగించాడు. తాను పూర్తిగా లయ అందుకోలేదని, సామర్థ్యం మేరకు రేసింగ్ చేయకపోయినా పోల్ పొజిషన్ దక్కడం సంతోషంగా ఉందన్న వెర్‌స్టాపెన్ అసలు పోరులో సత్తా చాటేందుకు సిద్ధమన్నాడు. నేడు రాత్రి 8.30 గంటలనుంచి ప్రధాన రేసు జరుగుతుంది.

ముంబై మెరుపులు

అప్పుడెలాగో... ఇప్పుడు అలాగే.... పురుషుల ఆటలోని మెరుపులు అమ్మాయిల లీగ్‌లోనూ కనిపించాయి. 2008లో పురుషుల లీగ్ ధనాధన్‌గా ప్రారంభమైన రీతిలో మహిళల లీగ్ డబ్ల్యూపీఎల్‌కు కూడా తెర లేచింది. కోల్‌కతాలాగే ముంబై చెలరేగగా... భారీ లక్ష్య ఛేదనలో నాడు బెంగళూరు కుదేలైనట్లే... తాజాగా గుజరాత్ కూడా విలవిల్లాడింది. మొత్తానికి ఈ రెండు లీగ్‌ల్లోనూ తొలుత బ్యాటింగ్ చేసిన జట్లు (కోల్‌కతా, ముంబై) 200 పైచిలుకు స్కోరుతో తొలి సీజన్‌కు అదిరిపోయే ఆరంభం ఇచ్చాయి. అంతకు ముందు తారాలోకంతో కూడిన 'గానాబజానా' వేడుకలు అందర్నీ ఆకట్టుకున్నాయి.

- చెలరేగిన హర్మన్, హేలీ, కెర్
- 143 పరుగులతో ముంబై భారీ విజయం
- చిత్తుగా ఓడిన గుజరాత్
- డబ్ల్యూపీఎల్


హర్మన్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ చరిత్ర ముంబై ఇండియన్స్ బోణీతో మొదలైంది. శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో ముంబై 143 పరుగుల తేడాతో బెత్ మూనీ సారథ్యంలోని గుజరాత్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. మొదట ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 207 పరుగులు చేసింది. హర్మన్‌ప్రీత్ కౌర్ (30 బంతుల్లో 65; 14 ఫోర్లు) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడింది. హేలీ మాథ్యూస్ (31 బంతుల్లో 47; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), అమెలియా కెర్ (24 బంతుల్లో 45 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) కూడా మెరిపించారు. అనంతరం గుజరాత్ జెయింట్స్ 15.1 ఓవర్లలో 64 పరుగులకే ఆలౌటైంది. హేమలత (29 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్ కాగా, సయిక ఇష్వాక్ 4 వికెట్లు తీసింది.

చెలరేగిన హేలీ, హర్మన్

హేలీ మాథ్యూస్‌తో ముంబై ఇన్నింగ్స్ ఆరంభించిన యస్తిక భాటియా (1) నిరాశ పరిచింది. అయితే నట్ సీవర్ బ్రంట్ (18 బంతుల్లో 23; 5 ఫోర్లు), హేలీ ధాటిగా ఆడటంతో వేగం పెరిగింది. హేలీ అయితే భారీ సిక్సర్లతో అలరించింది. 7.2 ఓవర్లలో జట్టు స్కోరు 50కి చేరగా... కాసేపటికి వరుస ఓవర్లలో బ్రంట్, హేలీ నిష్క్రమించారు. 10 ఓవర్లలో ముంబై స్కోరు 77/3. తర్వాత సగం ఓవర్ల ఆట రూటు మారింది. అమెలియా కెర్ అండతో కెప్టెన్ హర్మన్ ఒక్కసారిగా బౌండరీలతో విరుచుకుపడింది. కాసేపు ఇద్దరి ఆట పురుషుల లీగ్‌ను గుర్తుకుతెచ్చింది. మోనిక పటేల్ 15వ ఓవర్లో తొలి రెండు బంతులాడిన అమెలియా ఒక ఫోర్ కొడితే... తర్వాతి నాలుగు బంతుల్ని హర్మన్ బౌండరీలకు తరలించింది. ఆ ఓవర్లో 21 పరుగులు వచ్చాయి. 16వ ఓవర్లోనూ 'హ్యాట్రిక్' ఫోర్లు కొట్టిన హర్మన్‌ప్రీత్ 22 బంతుల్లో (11 ఫోర్లు) అర్ధ సెంచరీ పూర్తి చేసుకుంది. హర్మన్-కెర్ జోడీ నాలుగో వికెట్‌కు కేవలం 7 ఓవర్లలోనే 89 పరుగులు జోడించారు. హర్మన్ నిష్క్రమించాక... అమెలియా, పూజ (8 బంతుల్లో 15; 3 ఫోర్లు) ధాటిని కొనసాగించడంతో జట్టు స్కోరు 200 దాటింది. గుజరాత్ ఆట పేలవంగా మొదలై... చివరకు చిత్తుగా ఓడింది. టాపార్డర్‌లో మూనీ (0 రిటైర్డ్‌హర్ట్) గాయంతో వెనుదిరగ్గా... హర్లీన్ (0), సహా గార్డ్‌నర్ (0), తనూజ (0) ఖాతానే తెరువలేదు. ఏకంగా 9 మంది సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. హేమలతతో పాటు మోనిక (10) రెండంకెల స్కోర్లు చేశారు.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: యస్తిక (సి) జార్జియా (బి) తనూజ 1; హేలీ (బి) గార్డ్‌నెర్ 47; సీవర్ (సి) స్నేహ్ రాణా (బి) జార్జియా 23; హర్మన్‌ప్రీత్ (సి) హేమలత (బి) స్నేహ్ రాణా 65; అమెలియా నాటౌట్ 45; పూజ (సి) మోనిక (బి) స్నేహ్ రాణా 15; ఇసి వాంగ్ నాటౌట్ 6; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 207. వికెట్ల పతనం:** 1-15, 2-69, 3-77, 4-166, 5-201. **బౌలింగ్:** ఆష్లే గార్డ్‌నెర్ 4-0-38-1, మాన్సి 2-0-17-0, తనూజ 2-0-12-1, మోనిక 2-0-34-0, జార్జియా 3-0-30-1, అనాబెల్ 3-0-32-0, స్నేహ్ రాణా 4-0-43-2,

గుజరాత్ జెయింట్స్ ఇన్నింగ్స్: మేఘన (బి) సీవర్ 2; బెత్ మూనీ రిటైర్డ్ హర్ట్ 0; హర్లీన్ (సి) వాంగ్ (బి) నట్ సీవర్ 0; ఆష్లే గార్డ్‌నెర్ (సి) హేలీ (బి) వాంగ్ 0; అనాబెల్ (బి) ఇష్వాక్ 6; హేమలత నాటౌట్ 29; జార్జియా (బి) ఇష్వాక్ 8; స్నేహ్ రాణా (ఎల్బీ) (బి) అమెలియా 1; తనూజ (సి) నట్ సీవర్ (బి) అమెలియా 0; మాన్సి జోషి (ఎల్బీ) (బి) ఇష్వాక్ 6; మోనిక (బి) ఇష్వాక్ 10; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (15.1 ఓవర్లలో ఆలౌట్) 64. వికెట్ల పతనం:** 1-1, 2-3, 3-5, 4-12, 5-22, 6-23, 7-23, 8-49, 9-64. **బౌలింగ్:** నట్ సీవర్ 2-0-5-2, ఇసి వాంగ్ 3-0-7-1, సయిక ఇష్వాక్ 3.1-1-11-4, అమెలియా కెర్ 2-1-12-2, పూజ 2-0-9-0, కలిత 2-0-12-0, హేలీ 1-0-8-0.


ప్రారంభోత్సవంలో కియారా

డాటిన్ వివాదం

డబ్ల్యూపీఎల్ తొలి మ్యాచ్‌కు ముందే ఒక అనూహ్య పరిణామం వివాదాన్ని రేపింది. గుజరాత్ జెయింట్స్ జట్టు తమ ప్రధాన ప్లేయర్ డియాంద్రా డాటిన్ (వెస్టిండీస్) గాయపడిందని ప్రకటించింది. ఆమె స్థానంలో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కిమ్ గార్త్‌ను తీసుకుంటున్నట్లుగా కూడా ప్రకటించింది. అయితే డాటిన్‌నుంచి భిన్నమైన స్పందన వచ్చింది. తాను అసలు గాయంతోనే లేదని ఆమె ప్రకటించడం విశేషం. 'నేను కోలుకుంటున్నానని చెబుతున్నాను. అసలు ఏదైనా అయితే కదా నేను కోలుకునేది. దేనినుంచి కోలుకుంటున్నానో నాకే తెలీదు. నిజాలు చెబితే బాగుంటుంది' అని ట్వీట్ చేసింది. దీనిపై గుజరాత్ యాజమాన్యం ఎలాంటి స్పష్టతనివ్వలేదు. వేలంలో డాటిన్‌ను గుజరాత్ రూ. 60 లక్షలకు తీసుకుంది. మహిళల టి20ల్లో అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరిగా గుర్తింపు ఉన్న డాటిన్ విండీస్ తరఫున 127 టి20లు ఆడింది. మహిళల టి20ల్లో సెంచరీ చేసిన తొలి ప్లేయర్‌గా గుర్తింపు పొందింది.

డబ్ల్యూపీఎల్‌లో నేడు

బెంగళూరు X ఢిల్లీ
మ.గం. 3.30 నుంచి

యూపీ X గుజరాత్
రా.గం. 7.30 నుంచి

స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

సొంతగడ్డపై సానియా ఆట

నేడు ఎల్బీ స్టేడియంలో ఎగ్జిబిషన్ మ్యాచ్



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్‌నుంచి రిటైర్ అయిన భారత టెన్నిస్ స్టార్ సానియా మీర్జా మరో సారి కోర్టు బరిలోకి దిగనుంది. అయితే ఈసారి అధికారిక మ్యాచ్‌లో కాదు! తాను ఆటలో తొలి అడుగులు వేసిన స్వస్థలం హైదరాబాద్‌లో అభిమానుల కోసం ఆమె టెన్నిస్ రాకెట్ పడుతోంది. ఎల్బీ స్టేడియంలో నేడు ఈ ఎగ్జిబిషన్ మ్యాచ్ జరుగుతోంది. ఇందులో భాగంగా సానియాతో గతంలో కలిసి ఆడిన ఐదుగురు ఆటగాళ్లు మైదానంలోకి వస్తున్నారు. రోహన్ బోపన్న, ఇవాన్ డోడిగ్, బెథానీ మాటెక్, కారా బ్లాక్, మారియాన్ బర్టోలిలతో కలిసి సానియా ఈ ఎగ్జిబిషన్ మ్యాచ్ ఆడుతుంది. ఇందులో సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ కూడా ఉంటాయి. తన టెన్నిస్ ప్రస్థానం మొదలైన చోట చివరిసారి ప్రేక్షకుల మధ్య ఆడబోవడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా సానియా వ్యాఖ్యానించింది. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ మ్యాచ్ కోసం పేటీఎమ్ ఇన్‌సైడర్‌లో రూ. 499 విలువైన టికెట్లను అందుబాటులో ఉంచారు.

సెమీఫైనల్లో మోహన్‌బగాన్



కోల్‌కతా: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో ఏటీకే మోహన్ బగాన్ జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. సొంత ప్రేక్షకుల మధ్య శనివారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో మోహన్‌బగాన్ 2-0 గోల్స్ తేడాతో ఒడిషా ఎఫ్‌సీపై ఘన విజయం సాధించింది. మోహన్‌బగాన్ తరఫున బోమస్ (36వ నిమిషం), డి.పెట్రాటోస్ (58వ నిమిషం) గోల్స్ సాధించారు. తాజా విజయంతో 20 మ్యాచ్‌ల ద్వారా మొత్తం 34 పాయింట్లు సాధించిన మోహన్‌బగాన్ నాలుగో జట్టుగా ఐఎస్ఎల్ సెమీస్‌కు అర్హత సాధించింది. ఈ సీజన్‌లో 10 విజయాలు సాధించిన టీమ్ 6 ఓడి మరో 4 మ్యాచ్‌లు డ్రా చేసుకుంది. ఈ ఫలితంతో సెమీస్‌లో హైదరాబాద్ ఎఫ్‌సీతో మోహన్‌బగాన్ ప్రత్యర్థిగా తలపడటం ఖాయమైంది. సెమీఫైనల్ మ్యాచ్ రెండు అంచెలుగా జరుగుతుంది. ఇరు జట్ల మధ్య తొలి పోరు ఈ నెల 9న హైదరాబాద్, రెండో పోరు ఈ నెల 13న రెండో పోరు కోల్‌కతాలో జరుగుతుంది. మరో సెమీస్ మ్యాచ్‌లో బెంగళూరు ఎఫ్‌సీ, ముంబై సిటీ ఎఫ్‌సీ తలపడనున్నాయి.

మధ్యప్రదేశ్ విజయలక్ష్యం 437


యశస్వి జైస్వాల్

గ్వాలియర్: రెస్టాఫ్ ఇండియాతో జరుగుతున్న ఇరానీ కప్ మ్యాచ్‌లో రంజీ విజేత మధ్యప్రదేశ్ ముందు 437 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది. దీనిని ఛేదించే క్రమంలో మ్యాచ్ నాలుగో రోజు శనివారం ఆట ముగిసే సమయానికి మధ్యప్రదేశ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు కోల్పోయి 81 పరుగులు సాధించింది. హిమాన్షు మంత్రి (51 బ్యాటింగ్) అర్ధ సెంచరీ నమోదు చేశాడు. చివరి రోజు ఆదివారం విజయం కోసం మధ్యప్రదేశ్ మరో 356 పరుగులు చేయాల్సి ఉంది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 85/1తో ఆట కొనసాగించిన రెస్టాఫ్ ఇండియా తమ రెండో ఇన్నింగ్స్‌లో 246 పరుగులకు ఆలౌటైంది. యశస్వి జైస్వాల్ (157 బంతుల్లో 144; 16 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ పూర్తి చేసుకోగా, మిగతావారంతా విఫలమయ్యారు. రెస్టాఫ్ ఇండియా జట్టులో 'ఆరుగురు' బ్యాటర్లు డకౌట్ కావడం విశేషం! శుభమ్ శర్మ, అంకిత్ కుష్వా, కుమార్ కార్తికేయ, అవేశ్ ఖాన్ తలా 2 వికెట్లతో ప్రత్యర్థిని పడగొట్టారు.

సినిమా

ఒక స్టార్ సినిమాలో మరో స్టార్ కనిపిస్తే.. ఇద్దరు స్టార్స్ ఫ్యాన్స్‌కి పండగే పండగ. అలా కాకుండా ఓ మామూలు బడ్జెట్ సినిమాలో ఒక స్టార్ గెస్ట్‌గా కనిపించినా ఆ స్టార్ ఫ్యాన్స్ ఖుషీ అవుతారు. ఇలా ఫ్యాన్స్ పండగ చేసుకునే 'గెస్ట్' రోల్స్‌లో కొందరు స్టార్స్ కనిపించనున్నారు. ఈ 'స్టార్ గెస్ట్'ల గురించి తెలుసుకుందాం.

స్టార్ గెస్ట్


● రజనీకాంత్ ● మోహన్‌లాల్ ● రామ్‌చరణ్ ● సూర్య ● శివ రాజ్‌కుమార్

గ్రౌండ్‌లో తలైవర్

క్రికెట్ గ్రౌండ్‌లో అతిథిగా 'లాల్ సలామ్' అంటున్నారు తలైవర్ (నాయకుడు) రజనీకాంత్. తమిళ హీరోలు విష్ణు విశాల్, విక్రాంత్ ముఖ్య తారలుగా రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య దర్శకత్వంలో రూపొందనున్న చిత్రం 'లాల్ సలామ్'. క్రికెట్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ చిత్రంలో రజనీకాంత్ గెస్ట్ రోల్ చేయనున్నారు. అలాగే ఈ చిత్రంలో రజనీకాంత్‌కు చెల్లెలి పాత్రలో నటి, దర్శకురాలు జీవితా రాజశేఖర్ నటించనున్నారు. త్వరలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది.

అతిథిగా ఖైదీ

'జైలర్' కోసం రజనీకాంత్‌కు గెస్ట్ అయ్యారు మోహన్‌లాల్. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో 'జైలర్' చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో మలయాళ స్టార్ మోహన్‌లాల్ గెస్ట్ రోల్ చేశారు. ఇందులో ఆయన ఓ ఖైదీ పాత్రలో కనిపిస్తారట. ఆల్రెడీ మోహన్‌లాల్ పాత్రకు సంబంధించిన షూటింగ్ కూడా పూర్తయింది. ఈ చిత్రం ఈ ఏడాదిలోనే రిలీజ్ కానుంది.

భాయ్‌కి గెస్ట్

సిల్వర్ స్క్రీన్‌పై సల్మాన్ భాయ్‌కి గెస్ట్ అయ్యారు రామ్‌చరణ్. సల్మాన్ ఖాన్, వెంకటేశ్, పూజా హెగ్డే, జగపతిబాబు ప్రధాన పాత్రల్లో నటించిన హిందీ చిత్రం 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్'. ఫర్హాద్ సామ్జీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం రంజాన్ సందర్భంగా విడుదల కానుంది. ఈ చిత్రంలో రామ్‌చరణ్ ఓ గెస్ట్ రోల్ చేశారు. సల్మాన్ ఖాన్, వెంకటేశ్‌లపై చిత్రీకరించిన ఓ పాటలో రామ్‌చరణ్ గెస్ట్‌గా కనిపిస్తారు.

నిర్మాతే అతిథి!

సూర్య కెరీర్‌లో ఘనవిజయం సాధించిన చిత్రాల్లో 'సూరరై పోట్రు' (తెలుగులో 'ఆకాశమే హద్దురా..!') ఒకటి. సుధ కొంగర దర్శకత్వం వహించిన ఈ చిత్రం హిందీలో రీమేక్ అవుతోంది. బాలీవుడ్ కిలాడి అక్షయ్ కుమార్ హీరోగా నటిస్తున్నారు. ఒరిజినల్ వెర్షన్‌ను తెరకెక్కించిన సుధానే హిందీ రీమేక్‌కూ దర్శకత్వం వహిస్తున్నారు. తమిళ వెర్షన్‌లో హీరోగా నటించిన సూర్య హిందీ రీమేక్‌కి ఓ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అంతే కాదు... ఈ రీమేక్‌లో సూర్య ఓ గెస్ట్ రోల్ కూడా చేశారు.

కబ్జా కోసం...

ఉపేంద్ర 'కబ్జా'కు సాయం చేశారు శివ రాజ్‌కుమార్. ఉపేంద్ర, సుదీప్, శ్రియ ప్రధాన పాత్రల్లో నటించిన పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్ 'కబ్జా'. ఆర్. చంద్రు దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదల కానుంది. ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్ ఓ గెస్ట్ రోల్ చేశారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను బాలీవుడ్ బిగ్ బి అమితాబ్ బచ్చన్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.

ఇలా 'స్టార్ గెస్ట్' లిస్ట్‌లో మరికొందరు స్టార్స్ ఉన్నారు.

వేసవిలో రామబాణం


● గోపీచంద్

'లక్ష్యం', 'లౌక్యం' వంటి హిట్స్‌తో హిట్ కాంబినేషన్ అనిపించుకున్న హీరో గోపీచంద్, దర్శకుడు శ్రీవాస్ చేస్తున్న మూడో చిత్రం 'రామబాణం'. టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మిస్తున్న ఈ చిత్రంలో గోపీచంద్ సరసన డింపుల్ హయతి కథానాయికగా నటిస్తుండగా, జగపతిబాబు, ఖుష్బూ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. శనివారం ఈ చిత్రం కొత్త పోస్టర్‌ని విడుదల చేసి, మే 5న చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ''ఈ చిత్రంలో గోపీచంద్ చేస్తున్న విక్కీ పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుంది. ప్రత్యేకమైన మేకోవర్‌తో గోపీచంద్ లుక్ ఆకట్టుకునే విధంగా ఉంటుంది. 'లక్ష్యం, లౌక్యం'లను మించేలా 'రామబాణం' ఉండాలని శ్రీవాస్ ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఫ్యామిలీ ఎమోషన్స్, సామాజిక సందేశం మిళితమైన బలమైన కథాంశంతో తెరకెక్కిస్తున్నారు. విద్యార్థులకు పరీక్షలు ముగిశాక, వేసవిలో వినోదం పంచడానికి మా 'రామబాణం' దూసుకు రానుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, కెమెరా: వెట్రి పళనిస్వామి.

బాహుబలిని దాటిన పఠాన్


● షారుక్ ఖాన్

హిందీలో 'బాహుబలి'ని దాటేశాడు 'పఠాన్'. షారుక్ ఖాన్ టైటిల్ రోల్‌లో రూపొందిన హిందీ చిత్రం 'పఠాన్'. యశ్ రాజ్ ఫిలింస్ పతాకంపై ఆదిత్యా చోప్రా నిర్మించిన ఈ చిత్రం జనవరి 25న విడుదలైంది. ఇటీవల ఈ చిత్రం రూ. 1000 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించి, ఓ రికార్డును నమోదు చేసుకుంది. కాగా హిందీలో అత్యధిక నెట్ బాక్సాఫీస్ కలెక్షన్స్ సాధించిన టాప్ ప్లేస్ (దాదాపు రూ. 510 నెట్ కలెక్షన్స్)లో ప్రభాస్, రానా, అనుష్క, రమ్యకృష్ణ కాంబినేషన్‌లో రాజమౌళి దర్శకత్వం వహించిన 'బాహుబలి: ది కన్‌క్లూజన్' ఉండేది. ఈ రికార్డును 'పఠాన్' చిత్రం అధిగమించింది. ''హిందీలో నెట్ బాక్సాఫీస్ కలెక్షన్స్ పరంగా 'బాహుబలి: ది కన్‌క్లూజన్' రికార్డును అధిగమించిన షారుక్ ఖాన్, చిత్రదర్శకుడు సిద్దార్థ్ ఆనంద్, యశ్‌రాజ్ సంస్థకు శుభాకాంక్షలు. రికార్డులు ఉన్నది బ్రేక్ కావడం కోసమే'' అని ట్వీట్ చేశారు 'బాహుబలి' నిర్మాతల్లో ఒకరైన శోభు యార్లగడ్డ. 'బాహుబలి'లాంటి సినిమా ఇచ్చినందుకు థ్యాంక్స్. మేం మరింత కష్టపడటానికి ఆ సినిమా స్ఫూర్తిగా నిలిచింది'' అని యశ్ రాజ్ సంస్థ ట్వీట్ చేసింది.

కథ విన్నప్పుడే ఫిక్స్ అయ్యా!

- 'దిల్' రాజు



''కథ విన్నప్పుడే 'బలగం' మంచి సినిమా అవుతుందని ఫిక్స్ అయ్యా. ఎందుకంటే ఈ సినిమాలో బలమైన భావోద్వేగాలతో పాటు మంచి సందేశం కూడా ఉంది'' అన్నారు నిర్మాత 'దిల్' రాజు. ప్రియదర్శి, కావ్యా కల్యాణ్ రామ్, సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బలగం'. నటుడు వేణు ఎల్దండి దర్శకత్వంలో 'దిల్' రాజు ప్రొడక్షన్స్‌పై హన్షిత, హర్షిత్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ– ''తెలంగాణ సంస్కృతి ప్రత్యేకతను గ్రహించి వేణు కథ చెప్పినప్పుడు అతనిలో ఓ మంచి దర్శకుడు ఉన్నాడని గ్రహించాను. అనుకున్న దానికంటే బడ్జెట్ కాస్త ఎక్కువే అయినా 'బలగం' మాకు ప్రాఫిటబుల్ వెంచర్. ఇదే బ్యానర్‌లో వేణుతో మరో సినిమా చేయనున్నాం. ఓ డ్యాన్స్ మాస్టర్‌ను హీరోగా, ఓ సింగర్‌ను మ్యూజిక్ డైరెక్టర్‌గా పరిచయం చేస్తూ శశి అనే కొత్త దర్శకుడితో ఓ సినిమా ప్లాన్ చేశాం'' అన్నారు.

గ్యాంగ్‌స్టర్


● సుధీర్‌బాబు

దుర్గ లావుగా, మాస్‌గా ఉంటాడు. దుర్గకు పూర్తి భిన్నంగా ఉంటాడు పరశురామ్. చేతిలో తుపాకీ పట్టుకొని ఏజ్డ్ గ్యాంగ్‌స్టర్‌లా కనిపిస్తాడు. డ్రెస్సింగ్, సిట్టింగ్.. అంతా ఫుల్ స్టైల్. ఇక్కడున్న పరశురామ్ లుక్ చూస్తే ఆ విషయం అర్థం అవుతుంది. దుర్గ, పరశురామ్, డీజే.. ఈ మూడు పాత్రల్లో సుధీర్‌బాబు నటిస్తున్న చిత్రం 'మామా మశ్చీంద్ర'. ఇటీవల దుర్గ లుక్‌ని, శనివారం పరశురామ్ లుక్‌ని రిలీజ్ చేశారు. హర్షవర్ధన్ దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్న చిత్రం ఇది. తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్, కెమెరా: పీజీ విందా, సమర్పణ: సోనాలి నారంగ్, సృష్టి.

మన కథలా ఉంటుంది

''నటీనటుల నుంచి సహజమైన నటనను రాబట్టుకోవడం అనేది దర్శకుడిగా నాకున్న బలం. ఫ్రేమ్‌లో నటీనటులు ఎలా యాక్ట్ చేస్తున్నారనే విషయాన్నే నేను ముందు చూస్తాను. నన్ను, నా కథను, నా కొత్త ప్రయోగాన్ని మా నిర్మాతలు నమ్మారు. 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి' సినిమా విజయం సాధిస్తుంది'' అన్నారు రచయిత, దర్శక-నటుడు అవసరాల శ్రీనివాస్. నాగశౌర్య హీరోగా అవసరాల శ్రీనివాస్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. ఈ చిత్రంలో మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటించారు. టీజీ విశ్వప్రసాద్, దాసరి పద్మజ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా శనివారం విలేకర్ల సమావేశంలో చిత్రదర్శకుడు అవసరాల శ్రీనివాస్ పంచుకున్న విశేషాలు.

- అవసరాల శ్రీనివాస్



● ఈ సినిమాలో ఏడు అధ్యాయాలు ఉన్నాయి. ప్రతి అధ్యాయం నిడివి దాదాపు 20 నిమిషాలు ఉంటుంది. కథ రీత్యా 18 ఏళ్ల నుంచి 28 ఏళ్ల వయసు వరకు నాగశౌర్య, మాళవిక పాత్రల ప్రయాణం ఉంటుంది. ఏడు చాప్టర్లూ ఈ పదేళ్ల వ్యవధిలోనే జరుగుతాయి. వయసుకి తగ్గట్లుగా పాత్ర తాలూకు ప్రవర్తన, ఆహార్యంలో వ్యత్యాసం చూపించడానికి నాగశౌర్య ఎంతో కష్టపడ్డారు. నిజజీవితంలో నేను చూసిన కొన్ని ఘటనల ఆధారంగా ఈ సినిమా కథ రాసుకున్నాను. పాత్రలు, సంభాషణలు చాలా సహజంగా ఉంటాయి. మనకు తెలిసిన కథలా, మనలో ఎవరో ఒకరి కథలా ఈ సినిమా ఉంటుంది.

● నాకు ఇష్టమైన యాక్టర్స్‌లో నాగశౌర్య ఒకరు. ఈ సినిమా యూకే షెడ్యూల్ కోసం 40 మందికి వీసాలు అప్లయ్ చేస్తే పదిమందికే ఓకే అయ్యాయి. దీంతో షూటింగ్ కోసం కొన్ని ఇబ్బందులు పడ్డాం. కానీ సెట్స్‌లో తన యాక్టింగ్‌తో నాగశౌర్య ఆ ఇబ్బందులను మర్చిపోయేలా చేసేవారు. ఈ సినిమాలో నాగశౌర్య పెర్ఫార్మెన్స్ ఎంత బాగుందనేది థియేటర్స్‌లో చూస్తారు. అలాగే ఈ సినిమాలో ముద్దు సీన్ ఉన్నట్లు మాళవికకు ముందే చెప్పాను. ఓ సన్నివేశానికి సరైన కారణాలు ఉంటే, కథకి ఖచ్చితంగా అవసరం అనిపిస్తే నటీనటులు ఆ సీన్‌లో యాక్ట్ చేయడానికి ఓకే అంటారన్నది నా అభిప్రాయం. 'అష్టా చమ్మా' చిత్రం నుంచే నాకు సంగీత దర్శకుడు కళ్యాణీ మాలిక్ తెలుసు. ఈ సినిమాకు ఆయన మంచి మ్యూజిక్ ఇచ్చారు. 'కనుల చాటు..' పాటను కీరవాణిగారు మెచ్చుకోవడంతో కళ్యాణీగారు ఇంకా సంతోషంగా ఉన్నారు.

● హిందీ 'బ్రహ్మాస్త్రం' టీమ్ ఓ సారి నాకు ఫోన్ చేసి తెలుగు డైలాగ్స్ రాస్తారా? అని అడిగారు. అప్పటికే ఆ సినిమా గురించి నాకు అవగాహన ఉండటంతో సరే అన్నాను. అలా 'అవతార్ 2'కూ అవకాశం వచ్చింది. అయితే ఇంగ్లిష్ సినిమాలకు తెలుగు డైలాగ్స్ రాయడం చాలా కష్టం. కానీ చాలెంజ్‌గా తీసుకుని రాశాను. ఇక నటుడిగా 'కన్యాశుల్కం' వెబ్ సిరీస్ చేశాను. దర్శకుడిగా నా తర్వాతి చిత్రం గురించి త్వరలో అధికారికంగా చెబుతాను.

అందమైన బంధం...


● మాళవిక, సంతోష్

సంతోష్ శోభన్, మాళవికా నాయర్ జంటగా రూపొందిన చిత్రం 'అన్నీ మంచి శకునములే'. స్వప్న సినిమాస్, మిత్ర విందా మూవీస్‌తో కలిసి బీవీ నందినీ రెడ్డి దర్శకత్వంలో ఈ చిత్రాన్ని ప్రియాంకా దత్ నిర్మించారు. మే 18న ఈ చిత్రం విడుదల కానుంది. మార్చి 4న నందినీ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రం టీజర్‌ను హీరో దుల్కర్ సల్మాన్ సోషల్ మీడియా ద్వారా రిలీజ్ చేశారు. ''కొండ ప్రాంతం నేపథ్యంలో జరిగే కథ ఇది. అందమైన బంధాలు, భావోద్వేగాలతో మంచి రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా నందినీ రెడ్డి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.


'అవినీతి, అసత్య వార్తలు క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం

వెల: ₹ 7.00

సంపుటి: 15

సంచిక: 343

SUNDAY Special

ఆదివారం 5-3-2023



ప్రగతి పథంలో భారత్

నూతన ఆవిష్కరణల కోసం పెద్ద ఎత్తున పెట్టుబడులను కేటాయిస్తే భవిష్యత్తులో భారత్ మరింతగా సర్వతోముఖాభివృద్ధిని సాధించగలదని బిల్‌గేట్స్ అన్నారు. కోవిడ్ టీకాలను అందించి అనేక మంది జీవితాలను భారత్ కాపాడిందన్నారు.

- 6లో



స్పుత్నిక్ వీ టీకా సృష్టికర్త హత్య

కోవిడ్ టీకా స్పుత్నిక్ వీ సృష్టికర్తల్లో ఒకరైన ఆండ్రీ బొటికోవ్ మాస్కోలోని తన అపార్ట్‌మెంట్‌లో హత్యకు గురయ్యారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు రష్యా ఫెడరల్ దర్యాప్తు కమిటీ వెల్లడించింది.

- 6లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

పెట్టుబడుల సదస్సు.. సూపర్‌హిట్

దేశ పారిశ్రామిక దిక్సూచి ఏపీ అంటూ జీఐఎస్‌లో కార్పొరేట్ దిగ్గజాల ప్రశంసలు

రెండు రోజుల్లో రూ.13.41 లక్షల కోట్ల పెట్టుబడులు

378 ఒప్పందాలు

6.09 లక్షల మందికి ఉపాధి

- 30కి పైగా ప్రముఖ కార్పొరేట్ సంస్థలు.. 25 దేశాల నుంచి 46 మందికి పైగా రాయబారులు హాజరు
- 15 రంగాలు, నాలుగు కంట్రీ సెషన్స్‌లో 100 మందికిపైగా ప్రసంగాలు
- ముగ్గురు కేంద్ర మంత్రుల కీలక ఉపన్యాసాలు
- రెండవ రోజు రూ.3,841 కోట్ల విలువైన 14 యూనిట్లు ప్రారంభం
- ఒప్పందాలను వాస్తవ రూపంలోకి తేవడానికి సీఎస్ అధ్యక్షతన కమిటీ
- పెట్టుబడుల కోసం సీఎం చొరవపై పారిశ్రామికవేత్తల హర్షం



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు వేదికపై ప్రముఖ పారిశ్రామికవేత్తలతో కేంద్ర మంత్రులు శర్బానంద సోనోవాల్, కిషన్‌రెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. వేదికపై వరుసగా.. గజానన్ నబర్(నోవా ఎయిర్), సెర్గియో లీ(అపాచీ), వంశీకృష్ణ (హెటిరో), వినీత్ మిట్టల్ (ఆవాదా గ్రూప్), పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్‌నాథ్, సుచిత్రా ఎల్లా (సీఐఐ), సతీష్‌రెడ్డి (డాక్టర్ రెడ్డీస్), సంతానం (సెయింట్ గోబెన్)

విశాఖ జీఐఎస్ వేదిక నుంచి సాక్షి ప్రతినిధి: రాష్ట్రంలోని అపారమైన అవకాశాలను వివరిస్తూ 'అడ్వాంటేజ్ ఏపీ' పేరుతో విశాఖపట్నంలో నిర్వహించిన రెండు రోజుల గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సూపర్ హిట్ అయ్యింది. దేశ, అంతర్జాతీయ కార్పొరేట్ దిగ్గజాలు ఒకే వేదికపైకి రావడమే కాకుండా రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారీ పెట్టుబడులను పెడుతూ ఒప్పందాలు చేసుకున్నారు. రెండు రోజుల సమావేశాలకు రిలయన్స్ గ్రూపు చైర్మన్ ముఖేష్ అంబానీతో పాటు కరణ్ అదానీ, జిందాల్, బంగూర్, ఒబెరాయ్, భజాంకా, దాల్మియా, మిట్టల్, జీఎం రావు, కృష్ణ ఎల్లా, అపోలో ప్రీతా రెడ్డి, సతీష్ రెడ్డి, బీవీఆర్ మోహన్ రెడ్డి, మసహిరో యమగుచి, టెస్లా కోఫౌండర్ మార్టిన్ ఎబర్‌హార్డ్ వంటి 30కిపైగా కార్పొరేట్ దిగ్గజాలు హాజరయ్యారు. అంబానీ మొదలు రాష్ట్రంలోని పారిశ్రామికవేత్త వరకు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మెచ్చుకోవడమే కాకుండా అందులో భాగస్వామ్యమవుతామంటూ ప్రకటించారు. ఈ రెండు రోజుల సమావేశాల్లో 20 రంగాల నుంచి రూ.13,41,734 కోట్ల

మిగతా 2వ పేజీలో ▶

14 యూనిట్లు ప్రారంభం

రాష్ట్రంలో వాణిజ్యపరంగా ఉత్పత్తికి సిద్ధమైన 14 యూనిట్లను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, శర్బానంద సోనోవాల్ సమక్షంలో వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ యూనిట్ల ప్రారంభం ద్వారా రూ.3,841 కోట్ల పెట్టుబడులు వాస్తవరూపంలోకి రావడమే కాకుండా 9,108 మందికి ఉపాధి లభించనుంది. క్లింబెర్లీ క్లార్క్, బ్లూస్టార్, అంబర్, హావెల్స్, ఎక్సలెంట్ ఫార్మా, ఎన్‌జీసీ టాన్స్‌మిషన్స్, చార్ట్ ఇండస్ట్రీస్, లారస్ ల్యాబ్, అమరా లైఫ్, శారదా ఫెర్రో అల్లాయిస్, విన్‌విన్ స్పెషాలిటీ, ఏవోవీ ఆగ్రో ఫుడ్స్, ఎస్‌హెచ్ ఫుడ్, అవేరా కంపెనీలున్నాయి.

పారిశ్రామిక హబ్‌గా ఏపీ



పెట్టుబడులకు రాష్ట్రం ఆకర్షణీయ గమ్యస్థానం

జీఐఎస్ ముగింపు సమావేశంలో సీఎం వైఎస్ జగన్

- మూడున్నరేళ్లలో ఆర్థికాభివృద్ధి సాధించాం.. కీలక సమయంలో సమ్మిట్ నిర్వహణ
- 378 ఎంవోయూల ద్వారా రూ.13.41 లక్షల కోట్ల పెట్టుబడులు
- తద్వారా 6.09 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు.. ఈ పరిశ్రమల స్థాపనకు అన్ని విధాలా సహకారం
- అందుకోసం సీఎస్ నేతృత్వంలో కమిటీ

2లో

"రాష్ట్రంలో పెట్టుబడులను మరింతగా పెంచేందుకు కృతనిశ్చయంతో ఉన్నాం. పారిశ్రామిక, వ్యాపారవేత్తలు నిర్వహించే కార్యకలాపాలకు మా ప్రభుత్వ మద్దతు, సహకారం పూర్తి స్థాయిలో ఉంటుంది. మీతో బంధం మాకు చాలా విలువైనది. రెండు రోజుల ఈ సదస్సు రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి మరింత సానుకూల వాతావరణం కల్పించడానికి అద్భుతంగా దోహదపడుతుంది. పారిశ్రామికీకరణ దిశగా ప్రయత్నాలకు రెట్టింపు ప్రోత్సాహాన్నిస్తుంది.

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్



ఆరోగ్య రంగంలో ఆదర్శ రాష్ట్రం

రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ద్వారా పెట్టుబడులకు ఏపీ అత్యంత అనువైన ప్రాంతంగా మారింది. హెల్త్‌కేర్ విభాగంలో దేశానికి ఆదర్శంగా నిలిచే సామర్థ్యం ఆంధ్రప్రదేశ్‌కు ఉంది. పారిశ్రామికంగానే కాకుండా రాష్ట్రం సామాజికంగా పురోగమించడంలో సీఎం జగన్ చేస్తున్న కృషి అభినందనీయం. విశాఖ మరింతగా ఎదుగుతుంది. విశాఖలో మాకు 5 ఫార్ములేషన్ యూనిట్లు, రెండు బల్క్ డ్రగ్ యూనిట్లు ఉన్నాయి. ముందు కూడా పెట్టుబడులను కొనసాగిస్తాం.

- డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ చైర్మన్ సతీష్‌రెడ్డి

వాస్తవం ఆవిష్కృతం



- వాస్తవ పెట్టుబడులే లక్ష్యంగా విశాఖ జీఐఎస్.. ఆ వెంటనే అమలుకు కార్యాచరణ ప్రారంభం
- సీఎస్ అధ్యక్షతన కమిటీని నియమిస్తున్నట్టు సీఎం ప్రకటన
- చంద్రబాబు హయాంలో డ్రైవర్లకు సూట్లు తొడిగి హంగామా.. నాడు రూ.18 లక్షల కోట్ల పెట్టుబడులంటూ ప్రచారం.. 10% కూడా రాలేదు
- టీడీపీ హయాంలో సదస్సుల వైపు కన్నెత్తి కూడా చూడని అంబానీ.. తొలిసారి జీఐఎస్‌కు హాజరు

విశాఖ జీఐఎస్ వేదిక నుంచి సాక్షి ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచి చెబుతున్న విధంగా వాస్తవ పెట్టుబడులే లక్ష్యంగా విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించింది. గత సర్కారు హయాంలో మాదిరిగా పెట్టుబడుల సదస్సు పేరిట హంగు, ఆర్భాటాలు కాకుండా దేశ, అంతర్జాతీయ కార్పొరేట్ దిగ్గజాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఆంధ్రప్రదేశ్ ప్రతిష్టను ఇనుమడింప చేసింది. టీడీపీ అధికారంలో ఉండగా సదస్సుకు ఊరు పేరు తెలియని సంస్థలు, డ్రైవర్లను తరలించి సూటు బూటు వేసి భారీ సంఖ్యలో ఒప్పందాలు జరిగినట్లు ప్రచారం చేసుకుంది. నాడు చంద్రబాబు సర్కారు నాలుగు సమ్మిట్స్ ద్వారా రూ.18 లక్షల కోట్లకు పైగా పెట్టుబడుల ఒప్పందాలు జరిగినట్లు ప్రచారం చేసుకోగా కనీసం

మిగతా 2వ పేజీలో ▶



రెండేళ్లలో రూ.2 వేల కోట్లు

ఇప్పటికే ఫార్మా రంగంలో ఏపీ తనదైన ముద్ర వేసింది. రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న చొరవ, సీఎం జగన్ సహకారం వల్ల ఏపీ వైపు చూస్తున్నాం. రాబోయే రెండేళ్లలో ఏపీలో రూ.2 వేల కోట్ల పెట్టుబడులు పెడతాం. దీని ద్వారా కనీసం 3,000 మందికి ఉపాధి లభిస్తుంది.


- వంశీకృష్ణ బండి, హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ



'అపాచీ' మరో 100 మిలియన్ డాలర్లు

అపాచీకి చైనా, భారత్, వియత్నాంలో ప్లాంట్లు ఉండగా ఏపీ ప్లాంటే అతి పెద్దది. ఏపీ ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెడుతున్నాం. ఇప్పటికే 100 మిలియన్ డాలర్లు వెచ్చించాం. మరో 100 మిలియన్ డాలర్ల (రూ. 820 కోట్లు) పెట్టుబడుల కోసం ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాం. తద్వారా 10 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ప్రభుత్వ విధానాల వల్ల వ్యాపారాల నిర్వహణ సులభతరంగా మారిందనడానికి మా సంస్థే ఉదాహరణ.

- అపాచీ ఇండియా డైరెక్టర్ సెర్గియో లీ



'దివీస్' రెండు కొత్త ప్లాంట్లు

రాష్ట్రంలో మరో రెండు యూనిట్లు నెలకొల్పబోతున్నాం. రూ.780 కోట్ల ప్రతిపాదన ఆమోదం పొందగా.. మరో రూ.700 కోట్ల ప్రతిపాదనలకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకున్నాం. దీంతో అదనంగా 22 వేల ఉద్యోగాల కల్పన జరగనుంది. బల్క్ డ్రగ్ పార్క్ వల్ల రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వస్తాయి.

- దివీస్ వైస్ ప్రెసిడెంట్ మధుబాబు



పారిశ్రామిక హబ్‌గా ఏపీ

జీఐఎస్ ముగింపు సమావేశంలో సీఎం వైఎస్ జగన్



వేదికపై సీఎం వైఎస్ జగన్‌తో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, శర్బానంద సోనోవాల్

లక్ష్యాన్ని మించి పెట్టుబడులు

- ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి, ఉపాధి కల్పనకు పెద్దపీట
- రాష్ట్రంలోని సహజ వనరులను ప్రపంచానికి చూపించాం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం.. యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించటమే ప్రధాన లక్ష్యంగా రెండు రోజుల పాటు నిర్వహించిన 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ –2023' గ్రాండ్ సక్సెస్ అయ్యిందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హర్షం వ్యక్తం చేశారు. రూ. 2 లక్షల కోట్ల నుంచి రూ.5 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు వస్తాయని భావించినా, సీఎం జగన్ నాయకత్వంలో లక్ష్యాన్ని మించి రూ.13.41 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై నమ్మకంతోనే ప్రపంచం నలుమూలల నుంచి పెట్టుబడిదారులు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చారని చెప్పారు. జీఐఎస్ సదస్సు ముగింపు సందర్భంగా శనివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సదస్సు ద్వారా ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించామని చెప్పారు. ఫలితంగా సుమారు 378 ఎంవోయూలు జరిగాయన్నారు. ఈ సదస్సులో 48 దేశాలకు చెందిన 100 మంది వరకు వివిధ అంశాలపై చర్చించారని చెప్పారు. ఈయూ కూటమి దేశాల నుంచి అధిక సంఖ్యలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చారన్నారు. 40 దేశాలకు చెందిన 595 మంది ప్రతినిధులు వర్చువల్‌గా పాల్గొన్నారని తెలిపారు. ప్రభుత్వ పని తీరుపై కేంద్ర మంత్రులు, కార్పొరేట్ ప్రముఖులు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్, ఏపీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, పరిశ్రమల శాఖ డైరెక్టర్ డా.జి.సృజన, సమాచార శాఖ కమిషనర్ టి.విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ జీఐఎస్ ప్రాంగణం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని, ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడులకు రాష్ట్రాన్ని ఆకర్షణీయ గమ్యస్థానంగా నిలుపుతామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడుల వృద్ధికి కృతనిశ్చయంతో ఉన్న తమ ప్రభుత్వం.. అందుకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర సదుపాయాలు కల్పిస్తుందని పారిశ్రామికవేత్తలకు భరోసానిచ్చారు. కరోనా ప్రతికూల పరిస్థితులను ఎదురొడ్డి మూడున్నరేళ్లలో ఆర్థికాభివృద్ధి సాధించడం తమ ప్రభుత్వ ఘనత అని చెప్పారు. కీలక సమయంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కుదిరిన 378 ఒప్పందాలతో రాష్ట్రానికి రూ.13.41 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని వెల్లడించారు. తద్వారా రాష్ట్రంలో 6.09 లక్షల మందికి ఉద్యోగాలు లభించనుండటం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. సమ్మిట్‌లో కుదిరిన ఒప్పందాల మేరకు పరిశ్రమలను స్థాపించేలా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంతో ఓ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. 'గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023' రెండో రోజు శనివారం ముగింపు సమావేశంలో దేశీయ, అంతర్జాతీయ అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సమ్మిట్‌ను విజయవంతం చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తద్వారా తన ఆత్మవిశ్వాసం, ఉత్సాహం రెట్టింపు అయిందని చెప్పారు. ఈ సమ్మిట్‌లో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

మూడున్నరేళ్లలో పుంజుకున్న ఆర్థిక వ్యవస్థ

- మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ మూడున్నరేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ శరవేగంతో పుంజుకుంది. కోవిడ్ మహమ్మారితో ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలమైన ప్రతికూల పరిస్థితుల్లో కూడా మా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అనేక రంగాలకు ప్రోత్సాహాన్నిచ్చింది.
- మా సుపరిపాలన విధానాలు ఆర్థిక వ్యవస్థకు రక్షణగా నిలిచాయి. ద్రవ్యలోటు నియంత్రణలో ఉండేలా చేశాయి. తద్వారా వ్యాపారాలు ప్రమాదంలో పడకుండా మా ప్రభుత్వం చూసింది. కోవిడ్ సమయంలో అత్యంత జాగరూకతతో వ్యవహరించి పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలకు మరింత సానుకూల వాతావరణం కల్పించేందుకు ఒక నిర్దిష్ట మార్గాన్ని ఏర్పాటు చేశాం. మౌలిక సదుపాయాల వ్యవస్థను బలోపేతం చేశాం. ఇంటర్నెట్, బ్రాడ్‌బ్యాండ్ సేవలను విస్తరించి యువతలో నైపుణ్యాలను మరింతగా పెంపొందించాం.

పెట్టుబడులకు అనుకూల గమ్యస్థానంగా ఏపీ

- అత్యంత కీలక సమయంలో ఈ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌ను నిర్వహించాం. దేశ, విదేశీ పారిశ్రామికవేత్తల పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్‌ను అనుకూల గమ్యస్థానంగా నిలపడంలో ఈ సమ్మిట్ విజయం సాధించింది. వివిధ రంగాలపై 15 సెషన్లుగా నిర్వహించిన చర్చాగోష్టుల్లో 100 మందికి పైగా ప్రముఖులు, నిపుణులు మాట్లాడారు. పెట్టుబడులు ఆకర్షించేందుకు ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న సానుకూల అంశాలేమిటో వివరించారు.
- ఆటోమొబైల్, ఈవీ సెక్టార్, హెల్త్ కేర్, మెడికల్ ఎక్విప్‌మెంట్, రెన్యూవబుల్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా, అగ్రి ప్రాసెసింగ్, టూరిజం తదితర రంగాల్లో పెట్టుబడులకు రాష్ట్రంలో ఉన్న అపార అవకాశాలను విశదీకరించారు. మరిన్ని రంగాల్లో మరిన్ని పెట్టుబడులకు అవకాశాలను అన్వేషించేందుకు యూఏఈ, నెదర్లాండ్స్, వియత్నాం, వెస్ట్రన్ ఆస్ట్రేలియాలను భాగస్వాములుగా చేసుకుని మరో నాలుగు సెషన్లు కూడా నిర్వహించాం. సమ్మిట్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఎరీనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
- 'ఒక జిల్లా–ఒక ఉత్పత్తి' అనే థీమ్‌తో 137 స్టాళ్లను ఈ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేశాం. సమ్మిట్ సందర్భంగా రెండు రోజులపాటు కేంద్ర మంత్రులు, విదేశీ ప్రతినిధులు, దౌత్యవేత్తలు, రాయబారులు, దేశీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి చర్చలు జరపడం సంతోషంగా ఉంది. ఈ సమావేశాలన్నీ ఫలప్రదమయ్యాయి.

పరిశ్రమల గ్రౌండింగ్‌కు కమిటీ

- పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ మీద ప్రత్యేకించి మా ప్రభుత్వం మీద మీరు చూపించిన నమ్మకానికి ధన్యవాదాలు. ఎంవోయూలు కుదుర్చుకున్న వారంతా త్వరగా రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించాలని కోరుతున్నాను. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం మీకు అన్ని విధాలుగా తోడుగా ఉంటుంది. అన్ని సదుపాయాలు కల్పిస్తుంది.
- పరిశ్రమలు స్థాపించేలా పర్యవేక్షించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేస్తున్నాం. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటు చేసే ఈ కమిటీలో ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ప్రతి వారం సమావేశమై ఈ సదస్సులో కుదిరిన ఎంవోయూల అమలు దిశగా చర్యలు తీసుకుంటుంది. పరిశ్రమలు స్థాపించే క్రమంలో పారిశ్రామికవేత్తలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ఈ కమిటీ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తుంది. ఎలాంటి ఆటంకాలు లేకుండా ఈ ఎంవోయూలు ఫలప్రదమయ్యేలా చూస్తుంది.

మా సానుకూల దృక్పథానికి నిదర్శనం

- రూ.3,841 కోట్లతో స్థాపించిన 14 పారిశ్రామిక యూనిట్లను ఈ సమ్మిట్ వేదిక నుంచి ప్రారంభించాం. వాటితో 9,108 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. కింబర్లే క్లార్క్, బ్లూస్టార్, క్లెమ్మాటిక్, లారస్ ల్యాబ్, హేవెల్స్ ఇండియా, శారదా మెటల్స్, అల్లాయిస్ తదితర కంపెనీలు ఈ పెట్టుబడులు పెట్టాయి. ఈ కంపెనీలను ప్రారంభించడం గర్వంగా భావిస్తున్నాను.
- రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటును సాకారం చేయడానికి, పారిశ్రామికవేత్తలకు పూర్తి సహకారం అందించడంలో మా ప్రభుత్వ సానుకూల దృక్పథానికి ఈ రోజు ప్రారంభించిన ఈ పారిశ్రామిక యూనిట్లే నిదర్శనం. ఈ రోజు యూనిట్లు ప్రారంభించిన వారందరికీ శుభాకాంక్షలు. వారి పారిశ్రామిక కార్యకలాపాలు విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాను.

సరైన మార్గ నిర్దేశం చేస్తాం

పారిశ్రామికవేత్తలను ఆహ్వానించడమే కాకుండా, వారికి సరైన మార్గనిర్దేశం చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. నైపుణ్యవంతమైన మానవ వనరులను అందించే చక్కటి వాతావరణం ఇక్కడ కల్పిస్తున్నాం. వ్యాపారాల్లో ఉన్న నష్టతరమైన సంక్లిష్టతను తగ్గించడంతోపాటు ఎంవోయూల మేరకు ఆటంకాలు లేకుండా పరిశ్రమల స్థాపనకు ఇది దోహదపడుతుంది.



గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌కు హాజరైన పారిశ్రామికవేత్తలు తదితరులు

378 ఒప్పందాలు.. 13.41 లక్షల కోట్ల పెట్టుబడులు

- రెండు రోజుల సదస్సులో రూ.13,41,734 కోట్ల విలువైన పెట్టుబడులతో 378 ఎంఓయూలు కుదిరాయి. ఈ ఒప్పందాల వల్ల మొత్తం 6,09,868 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. ఒక్క ఇంధన రంగంలోనే రూ.9,57,112 కోట్ల పెట్టుబడులకు సంబంధించి 42 అవగాహన ఒప్పందాలను కుదుర్చుకున్నాం. దాంతో 1,80,918 మందికి ఉద్యోగాలు వస్తాయి.
- ఐటీ, ఐటీ ఆధారిత రంగాలకు సంబంధించి 82 ఒప్పందాలు చేసుకున్నాం. వీటి విలువ రూ.73,819 కోట్లు. దాంతో 1,40,002 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. పర్యాటక రంగానికి సంబంధించి 117 అవగాహన ఒప్పందాలు చేసుకున్నాం. వాటితో రూ.22,096 కోట్ల పెట్టుబడులు వస్తాయి. దాంతో 30,787 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. రెండో రోజు సదస్సులో భాగంగా రూ.1.56 లక్షల కోట్ల పెట్టుబడులతో 286 ఎంఓయూలు చేసుకున్నాం. వీటి ద్వారా సుమారు 2.09 లక్షల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.
- పునరుత్పాదక ఇంధన (రెన్యూవబుల్ ఎనర్జీ) రంగంలో భారీగా పెట్టుబడులు సాధించాం. గణనీయమైన పెట్టుబడులకు అవకాశాలున్న రంగాల్లో రెన్యూవబుల్ ఎనర్జీ రంగం ప్రధానం. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి, పంప్డ్ స్టోరేజీ, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి సంబంధించి మేం సాధిస్తున్న పెట్టుబడులు ఈ రంగంలో ఉన్న సమస్యను, సంక్లిష్టతను పరిష్కరిస్తాయి. శిలాజ ఇంధన ఆధారిత ఉత్పత్తికి విశ్వసనీయమైన ప్రత్యామ్నాయ ఇంధన వనరులను చూపిస్తాయి. కర్బన రహిత లక్ష్యంగా గ్రీన్ ఎనర్జీ సాధన దిశగా మన దేశ లక్ష్య సాధనకు ఆంధ్రప్రదేశ్ తగిన సహకారం అందిస్తుంది.



సదస్సులో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

బ్రాండ్ భరోసా

- మనకు అపార వనరులున్నా ఇన్ని పెట్టుబడులు ఇదే తొలిసారి
- ఉవ్వెత్తున ఎగసిన రాష్ట్ర పారిశ్రామిక సూచీ
- విశ్వసనీయత, సమర్థత, సత్వర నిర్ణయాలకు ప్రతీకగా సీఎం జగన్
- ఈవోడీబీ, వృద్ధి రేటులో అగ్రపథంలో ఆంధ్రప్రదేశ్
- కోవిడ్‌లో పేదలతోపాటు పరిశ్రమలకూ ప్రభుత్వం ఊతం
- వీటిని బేరీజు వేసుకునే రాష్ట్రం బాట పట్టిన పారిశ్రామిక వర్గాలు

(విశాఖ జీఐఎస్ ప్రాంగణం నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి) : విశ్వసనీయత, భరోసాకు నిదర్శనంగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరే రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి బ్రాండ్‌గా మారింది. రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టేలా పారిశ్రామికవేత్తలకు ప్రేరణగా నిలిచింది. ముఖ్యమంత్రి జగన్ తానే స్వయంగా ఏపీకి బ్రాండ్ అంబాసిడర్‌గా మారి పారిశ్రామిక సెన్సెక్స్‌లో రాష్ట్ర సూచీని ఉవ్వెత్తున ఎగసేలా చేశారు. ఒక్క పేరు కల్పించిన విశ్వాసంతో దిగ్గజ పారిశ్రామికవేత్తలు ప్రత్యేకంగా విశాఖ సమ్మిట్‌కు హాజరయ్యారు. విశాఖలో రెండు రోజులపాటు నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023 వేదికగా అరుదైన దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి.

సత్వర నిర్ణయాలు, సమర్థ నాయకత్వం

జీఐఎస్ 2023 సదస్సును విజయవంతంగా నిర్వహించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యావత్ దేశం దృష్టిని ఆకర్షించింది. కేవలం రెండు రోజుల్లోనే ఏకంగా రూ.13,41,734 కోట్లకుపైగా పెట్టుబడులను సాధించడం ద్వారా పారిశ్రామిక వర్గాల్లో నమ్మకాన్ని రుజువు చేసుకుంది. ఒకటికి నాలుగు సార్లు ఆలోచించి ఎంతో కాలయాపన తరువాతగానీ నిర్ణయం తీసుకోని అగ్ర పారిశ్రామికవేత్తలు సైతం ఏపీలో పెట్టుబడుల విషయంలో మీనమేషాలు లెక్కించలేదు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలపై సత్వరం సానుకూలంగా స్పందించి ఏకంగా 20 రంగాల్లో 378 పెట్టుబడుల ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి జగన్ సమర్థ నాయకత్వం ఉందన్న నమ్మకమే దీనికి కారణం. విశ్వసనీయత, సమర్థత, సత్వర నిర్ణయాలకు సీఎం జగన్‌ను ప్రతీకగా పారిశ్రామికవేత్తలు గుర్తించారు. కోవిడ్ సమయంలో పరిశ్రమలకు అండగా నిలవడంతోపాటు గత మూడున్నరేళ్లుగా రాష్ట్రం సాధించిన వృద్ధిని కూడా వారు పరిగణలోకి తీసుకున్నారు.

కోవిడ్‌లో కాపాడిన సంక్షేమం

కోవిడ్ ప్రతికూల పరిస్థితులను దీటుగా ఎదురొడ్డి మరీ ఆంధ్రప్రదేశ్ 2021–22లో 11.43 శాతం వృద్ధి రేటు సాధించడం సాధారణ విషయం కాదు. గత మూడేళ్లలో ఎగుమతుల్లో సగటు వార్షిక వృద్ధిరేటు 9.3 శాతంగా నమోదైంది. సులభతర వాణిజ్య విధానాల్లో దేశంలోనే మొదటిస్థానంలో ఉంది. ఈ విజయాలన్నీ ముఖ్యమంత్రి జగన్ దక్షత, రాష్ట్ర అభివృద్ధి పట్ల నిబద్ధతకు నిదర్శనంగా పారిశ్రామికవేత్తలు గుర్తించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల విపక్షాలు ఎంత బురద చల్లుతున్నా కరోనా గడ్డు కాలంలో రాష్ట్ర ప్రజల కొనుగోలు శక్తిని నిలబెట్టింది అవేనని పారిశ్రామికవేత్తలు గుర్తించారు. అంత సమర్థ నాయకత్వం ఉన్నందువల్లే ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు సన్నద్ధమై ముందుకొచ్చారు.

తీరం.. మనకు వరంలా

ఇక అతి పొడవైన తీర ప్రాంతం రాష్ట్రానికే ఉందని గత పాలకులు చెప్పటమే కానీ సద్వినియోగం చేసుకున్న దాఖలాలు లేవు. ఇందుకు భిన్నంగా తీర ప్రాంతాన్ని రాష్ట్ర ప్రగతికి చుక్కానిగా మలచుకోవాలని విధానపరమైన నిర్ణయం తీసుకుంది సీఎం వైఎస్ జగన్ మాత్రమే. అందుకే ఇప్పటికే నిర్వహణలో ఉన్న ఆరు పోర్టులతోపాటు కొత్తగా నాలుగు పోర్టుల నిర్మాణాన్ని చేపట్టారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో పలుమార్లు చర్చించి పోర్టులను జాతీయ రహదారులతో అనుసంధానించేందుకు రూ.20 వేల కోట్ల రహదారి ప్రాజెక్టులను మంజూరు చేయించడంలో విజయం సాధించారు. కార్యనిర్వాహక రాజధాని కానున్న విశాఖపట్నం నుంచి భోగాపురం వరకు ఆరులేన్ల రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించారు. తద్వారా ఏపీని లాజిస్టిక్ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో సీఎం జగన్ అతి పెద్ద ముందడుగు వేశారు. ఆ పోర్టులు, పారిశ్రామిక కారిడార్ల పరిధిలో భారీ పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించగలిగారు. దీంతో రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రం అమాంతం మారిపోనుంది. ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా యువతకు స్థానికంగా పెద్ద ఎత్తున ఉపాధి కల్పించేలా రాచబాట పరిచారు.

దార్శనికత చాటిన దూరదృష్టి

మారిన పరిణామాల నేపథ్యంలో యావత్ ప్రపంచం దృష్టి కర్బన ఉద్గారాలను తగ్గించడం, కాలుష్య నియంత్రణ మీదే ప్రధానంగా ఉన్నట్లు సీఎం జగన్ గుర్తించారు. భవిష్యత్ అంతా పునరుత్పాదక ఇంధన వనరుల రంగానిదేనని స్పష్టం కావడంతో ఆ దిశగా రాష్ట్రంలో వనరుల సద్వినియోగంపై దృష్టి సారించారు. పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించారు. అందుకే ఇంధన రంగంలో రికార్డు స్థాయిలో రూ.9,57,139 కోట్ల మేర పెట్టుబడుల వరద పారింది.

సగం విజయం ముందుగానే..

ఆంధ్రప్రదేశ్‌లో అపార సహజ వనరులున్నా, గతంలో ఎప్పుడూ ఇంత భారీ స్థాయిలో పెట్టుబడులు రాలేదు. రాష్ట్రానికి పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా భవిష్యత్ పరిణామాలను ముందుగానే అంచనా వేయడం ద్వారా 50 శాతం లక్ష్యాన్ని సాధించారు. అందుకనుగుణంగా రాష్ట్రంలోని వనరులను సద్వినియోగం చేసుకునేలా ప్రణాళిక రూపొందించి మిగిలిన 50 శాతం లక్ష్యాన్ని చకచకా పూర్తి చేశారు.

ఆ ఒక్క మాట... ఆ ఒక్క నిర్ణయం

జీఐఎస్ వేదికగా ముఖ్యమంత్రి జగన్ చెప్పిన రెండు మాటలు యావత్ పారిశ్రామిక ప్రపంచానికి భరోసానిచ్చాయి. ఎంవోయూల మేరకు పరిశ్రమల స్థాపనలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తనకు ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు పరిష్కరిస్తానని స్పష్టమైన హామీనిచ్చారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇలాంటి భరోసానివ్వలేదని పారిశ్రామికవేత్తలు వ్యాఖ్యానించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక వేగంగా ఎంవోయూల సాకారానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంతో అత్యున్నత కమిటీని నియమిస్తున్నట్లు సీఎం జగన్ చేసిన ప్రకటన పెట్టుబడిదారుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించింది. అటు ముఖ్యమంత్రే స్వయంగా ఫోన్ కాల్ దూరంలో అందుబాటులో ఉండటం... ఇటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రతి వారం పరిశ్రమల ఏర్పాటును పర్యవేక్షించనుండటం విధానపరంగా విప్లవాత్మక నిర్ణయాలనే ఏకాభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో పారిశ్రామిక పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ సరైన గమ్య స్థానమన్న భావన దేశీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తల్లో స్థిరపడిపోయింది. ఏపీలో పారిశ్రామిక పెట్టుబడులు టేకాఫ్ అందుకున్నాయని, ఇక రాష్ట్ర ప్రగతి ఉవ్వెత్తున దూసుకుపోవడం ఖాయమన్నది జీఐఎస్–2023 ద్వారా స్పష్టమైంది.

పెట్టుబడుల సదస్సు సూపర్ హిట్

Global Investors Summit 2023
March 3 - 4, Visakhapatnam
www.advantageap.in

▶ మొదటి పేజీ తరువాయి

విలువైన పెట్టుబడుల ఒప్పందాలు కుదిరాయి. 378 ఒప్పందాల ద్వారా రాష్ట్ర యువతకు ప్రత్యక్షంగా 6,09,868 ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. గత ప్రభుత్వాల వలే ప్రచారం కోసం ఒప్పందాలు కుదుర్చుకొని వదిలేయకుండా వాటిని తక్షణం అమల్లోకి తీసుకువచ్చే విధంగా ముఖ్యమంత్రి.. సీఎస్ అధ్యక్షతన ఒప్పందాల పర్యవేక్షణ కమిటీ వేశారు. ఈ కమిటీ ప్రతి వారం సమావేశమై ఒప్పందాల అమలు తీరు, అనుమతుల మంజూరు వంటి అంశాలను పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటుందని సీఎం ప్రకటించడంపై పారిశ్రామికవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అర్థవంతమైన చర్చలు

ఈ సమావేశాల సందర్భంగా 15 రంగాలపై అర్థవంతమైన చర్చలు జరిగాయి. ఇందులో ఆయా రంగాలకు చెందిన 100 మందికిపైగా ప్రముఖ నిపుణులు పాల్గొని చర్చించారు. పలు దేశాల్లో ఉన్న పరస్పర పెట్టుబడుల అవకాశాలపై వియత్నాం, నెదర్లాండ్స్, యూఏఈ, వెస్ట్రన్ ఆస్ట్రేలియా దేశాలతో కంట్రీసెషన్స్ జరిగాయి. పలు దేశాలకు చెందిన ప్రతినిధులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో వివిధ అంశాలపై చర్చలు జరిపారు. రాష్ట్రంలోని పెట్టుబడులు, ఉత్పత్తులు, ప్రభుత్వం చేపట్టిన వివిధ ప్రాజెక్టుల నిర్మాణాన్ని కళ్లకు కట్టినట్లు చూపించేలా 137 స్టాల్స్‌తో ఏర్పాటు చేసిన పారిశ్రామిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యంగా ఒక జిల్లా ఒక ఉత్పత్తి పేరుతో జిల్లాల వారీగా ఎగుమతులను ప్రోత్సహిస్తున్న ఉత్పత్తుల స్టాల్ విశేషంగా ఆకర్షించింది. 25 దేశాల నుంచి 46 మంది రాయబారులతో పాటు మొత్తం 14,000కు పైగా ప్రతినిధులు హాజరయ్యారు.

జీఐఎస్‌లో ఒప్పందాలు

రంగం	ఒప్పందాల సంఖ్య	పెట్టుబడి రూ.కోట్లలో	ఉపాధి
ఎనర్జీ	42	9,57,112	1,80,918
పెట్రోకెమికల్స్	20	1,33,505	79,606
ఐటీఈఎస్	82	73,819	1,40,002
ఖనిజపరిశ్రమలు	25	61,641	28,710
ఈఎస్‌జీ	2	50,700	21,500
పర్యాటకం	117	22,096	30,787
ఈఎస్‌డీఎం	23	15,889	46,890
ఫార్మాస్యూటికల్స్	12	5,711	9,700
లాజిస్టిక్ ఇన్‌ఫ్రా	7	9,932	39,725
ఫుడ్ ప్రాసెసింగ్	27	4,910	5,330
పల్ప్ –పేపర్	3	2,517	2,775
ఆటోమొబైల్	3	1244	3,250
ఫర్నిచర్	2	885	2,050
టెక్స్‌టైల్	4	884	12,305
ఇంజనీరింగ్	4	522	5,170
ఎలక్ట్రికల్స్	3	334	1,100
ఎఫ్‌ఎంసీజీ	1	33	50
పవర్ ఫైనాన్స్	1	-	-
మొత్తం	378	13,41,734	6,09,868

వాస్తవం ఆవిష్కృతం

▶ మొదటి పేజీ తరువాయి

పది శాతం కూడా వాస్తవరూపం దాల్చలేదు.

తొలిసారిగా అంబానీ రాక

రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను రప్పించడం, యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా తాజాగా నిర్వహించిన విశాఖ సదస్సుకు రిలయన్స్, అదానీ, జేఎస్‌డబ్ల్యూ, జిందాల్, ఒబెరాయ్, దాల్మియా, బంగర్, బజాంకా తదితర పారిశ్రామిక దిగ్గజాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి పెట్టుబడుల ఒప్పందాలను ప్రభుత్వం కుదుర్చుకుంది. చంద్రబాబు హయాంలో నిర్వహించిన సదస్సులకు నాలుగేళ్లలో ఒక్కసారి కూడా ముఖేష్ అంబానీ హాజరు కాకపోవడం గమనార్హం. దక్షిణాదిలో ఏ ఒక్క రాష్ట్రంలోనూ పెట్టుబడుల సమావేశానికి ఆయన హాజరైన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో సీఎం జగన్ ప్రభుత్వం తొలిసారి నిర్వహించిన పెట్టుబడుల సమావేశానికి భారీ సంఖ్యలో పారిశ్రామిక దిగ్గజాలు హాజరు కావడం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై కార్పొరేట్ల నమ్మకానికి నిదర్శనమని పారిశ్రామిక వర్గాలు అంటున్నాయి.

దుష్ప్రచారానికి చెంపపెట్టులా సదస్సు

విశాఖ సమ్మిట్ ద్వారా ఒక్క సమావేశంతో రికార్డు స్థాయిలో రూ.13.4 లక్షల కోట్లకుపైగా విలువైన పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయి. ఒప్పందం చేసుకున్న కంపెనీలన్నీ అంతర్జాతీయంగా పేరు పొందినవే. థర్మల్ పవర్ నుంచి గ్రీన్ ఎనర్జీ రంగంలోకి అడుగుపెట్టిన కేంద్ర ప్రభుత్వ రంగ నవరత్న కంపెనీ ఎన్‌టీపీసీ అందుకు రాష్ట్రాన్ని వేదికగా చేసుకుని రూ.2.35 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేలా మూడు ఒప్పందాలను కుదుర్చుకుంది. రిలయన్స్, ఏబీసీ, జేఎస్‌డబ్ల్యూ ఆదిత్య బిర్లా, జిందాల్, ఫ్యూచర్, అదానీ, ఐవోసీఎల్ , అరబిందో, హీరో తదితర దిగ్గజ కంపెనీలు పెట్టుబడుల ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. సీఎం జగన్ ప్రభుత్వంపై ఓ వర్గం మీడియా తరచూ చేస్తున్న దుష్ప్రచారానికి తాజా సదస్సు చెంపపెట్టు లాంటిదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇలాంటి సదస్సులకు గతంలో ఒకరిద్దరు మాత్రమే ప్రముఖులు హాజరయ్యే వారని అలాంటిది ఈసారి ఇంతమంది కార్పొరేట్ దిగ్గజాలు ఒకేసారి రావటాన్ని నమ్మలేకపోతున్నామని సమావేశానికి హాజరైన ఔత్సాహిక పారిశ్రామికవేత్త ఒకరు పేర్కొన్నారు.

కార్యాచరణ ప్రారంభం

కేవలం పెట్టుబడుల ఒప్పందాలను కుదుర్చుకుని వదిలేయడం కాకుండా అమల్లోకి తెస్తూ కార్యాచరణను సైతం రాష్ట్రం ప్రభుత్వం వెంటనే ప్రారంభించింది. ఒప్పందాలను వేగంగా వాస్తవ రూపంలోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన పర్యవేక్షణ కమిటీని నియమిస్తున్నట్లు సీఎం జగన్ ప్రకటించారు. త్వరగా కార్యరూపం దాల్చే ఒప్పందాలకు ఎర్లీబర్డ్ రాయితీలు ఇచ్చే ఆలోచన చేస్తున్నట్లు పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ తెలిపారు.



నూతన పారిశ్రామిక యూనిట్లను వర్చువల్‌గా ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

జీఐఎస్ వేదికపై నుంచి ప్రారంభించిన 14 కంపెనీలు

కంపెనీ పేరు	రంగం	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి
కింబెర్లీ క్లార్క్ ఇండియా	ఎఫ్‌ఎంసీజీ	700	1,500
బ్లూస్టార్ క్లైమేటిక్	ఏసీ	540	1,500
అంబర్ ఎంటర్‌ప్రైజెస్	ఎలక్ట్రానిక్స్	150	500
హావెల్స్ ఇండియా	ఎలక్ట్రానిక్స్	300	1,000
ఎక్సలెంట్ ఫార్మా	ఫార్మా	176	550
ఎన్‌జీసీ	ఇంధన	185	118
చార్ట్ ఇండస్ట్రీస్	ఇంజనీరింగ్	95	200
లారస్ ల్యాబ్	ఫార్మా	460	1,200
అమరలైఫ్	ఫార్మా	60	190
శారదా	మెటల్స్	152	300
విన్‌విన్ స్పెషాల్టీ	ఇన్సులేటర్స్	174	500
ఏవోవీ ఆగ్రో	ఆహార	200	1,000
ఎస్‌హెచ్ ఫుడ్	ఆహార	30	50
అవేరా	ఈవీ	619	500

క్లుప్తంగా...

న్యాయ వ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడదాం..
హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటశేషసాయి



సాక్షి, భీమవరం: ప్రజలకు న్యాయం చేసేందుకు, న్యాయ వ్యవస్థ ఔన్నత్యాన్ని కాపాడేందుకు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) కృషి చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి కోరారు. ఐఏఎల్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఐదో మహాసభలు భీమవరం డీఎన్నార్ లా కళాశాలలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జస్టిస్ వెంకటశేషసాయి మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ, ప్రకాశం పంతులు వంటి న్యాయవాదులు కీలకంగా వ్యవహరించారని చెప్పారు. జ్యాంగం డ్రాఫ్టింగ్ కమిటీకి సారథ్యం వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయవాదని, అదే కమిటీలో కీలక బాధ్యతలు చేపట్టిన బీఎస్ రావు తెలుగు న్యాయవాదని గుర్తుచేశారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్‌లో కీలకంగా వ్యవహరించిన వీఆర్ కృష్ణయ్య, పద్మనాభరెడ్డి వంటి మహనీయుల స్ఫూర్తితో న్యాయ వ్యవస్థ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మరో అతిథి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ మాట్లాడుతూ ఐఏఎల్ సభ్యులు ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ న్యాయ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. అనంతరం జస్టిస్ వెంకటశేషసాయిని సత్కరించారు. డీఎన్నార్ లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రఘురామ్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఐఏఎల్ జాతీయ కార్యదర్శి చలసాని అజయ్, రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు, జిల్లా జడ్జి పి.శ్రీసత్యాదేవి, సీనియర్ సివిల్ జడ్జి అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి లక్ష్యాలను అధిగమిద్దాం
ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ డాక్టర్ సమీర్ శర్మ



అధికారులతో సమీక్షిస్తున్న డాక్టర్ సమీర్ శర్మ

తిరుపతి అర్బన్: సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సమిష్టిగా పనిచేయాలని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ డాక్టర్ సమీర్‌శర్మ పిలుపునిచ్చారు. తిరుపతి పద్మావతి అతిథి గృహంలో ఆయన జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డితో కలిసి అధికారులతో శనివారం సమీక్షించారు. 10–19 వయస్సు గల పిల్లలకు, గర్భిణులకు ప్రతి నెలా వైద్య పరీక్షలు జరపాలని, రక్తహీనతపై అవగాహన కల్పించడమే కాకుండా పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. పర్యావరణహిత కార్యక్రమాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్‌కు సూచించారు. వైద్యసేవలు, పిల్లలకు పౌష్టికాహారం అందించే విషయంలో సచివాలయ పరిధి నుంచే అవగాహన కల్పించాలన్నారు. పర్యావరణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను కచ్చితంగా పాటించాలని చెప్పారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యామ్నాయం కల్పించాలని కోరారు. ప్లాస్టిక్ క్యారీ బాగులు వాడకంలో తప్పనిసరి 120 మైక్రాన్స్ ఉండాలని స్పష్టం చేశారు. మెడికల్ వ్యర్థాలపై దృష్టి పెట్టాలని తెలిపారు. పరిశ్రమల్లో పచ్చదనం పెంపునకు కృషి చేయాలని చెప్పారు.

బెయిల్‌పై పట్టాభి విడుదల



కంబాలచెరువు(రాజమహేంద్రవరం): గన్నవరంలో విధులు నిర్వర్తిస్తున్న సీఐ కనకారావుపై దాడి చేసిన ఘటనలో అరెస్టయిన కొమ్మారెడ్డి పట్టాభి శనివారం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. ఆయనతో పాటు అరెస్టు అయి సెంట్రల్ జైలులో ఉన్న మరో పది మంది కూడా విడుదల అయ్యారు. బెయిల్ పత్రాలను సమర్పించిన తర్వాత విడుదల చేసినట్లు సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాజారావు తెలిపారు. రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నాయకులు జైలు వద్దకు చేరుకున్నారు. బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. పట్టాభిపై అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు.

ప్రత్తిపాడు టీడీపీ ఇన్‌చార్జి వరుపుల రాజా హఠాన్మరణం



సాక్షి ప్రతినిధి, కాకినాడ: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల రాజా (49) మృతి చెందారు. శనివారం ప్రత్తిపాడులో గుండెపోటుతో తీవ్ర అస్వస్థతకు గురైన రాజాను కాకినాడ అపోలో ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యులు ఆయనను ప్రాణాపాయం నుంచి రక్షించేందుకు సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయింది. దీంతో రాత్రి 11 గంటలకు రాజా మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్‌గా వరుపుల రాజా పనిచేశారు.



ఏలూరులో బడి చంద్రశేఖర్‌కు దివ్యాంగుల పింఛను అందజేస్తున్న వలంటీర్ ఎ.సౌజన్య



విజయవాడ ప్రకాష్ నగర్‌లో మరియమ్మకు పింఛను అందిస్తున్న వార్డు వలంటీర్ దుర్గ



గుంటూరు కోబాల్డ్‌పేటలో కనకరత్నమ్మకు పింఛను అందజేస్తున్న వార్డు వలంటీర్ ఆషా

ఏపీ 'పవర్'ఫుల్


రాష్ట్రంలో పెరిగిన తలసరి విద్యుత్

2022లో ఒక్కొక్కరికి అందుబాటులో 1,378.6 యూనిట్లు

ఏ రాష్ట్రంలో అయినా పౌరులకు సరిపడినంత స్థాయిలో విద్యుత్ అందుబాటులో ఉందంటే ఆ రాష్ట్రంలో ఉత్పాదకత, జీవన ప్రమాణాలు మెరుగైన స్థితిలో ఉన్నాయని అర్థం. ఆర్థిక అభివృద్ధికి విద్యుత్ వినియోగాన్ని సైతం ప్రామాణికంగా తీసుకుంటారు. అలాంటి అత్యుత్తమ పరిస్థితులు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయని మరోసారి రుజువైంది. రాష్ట్రంలో తలసరి విద్యుత్ లభ్యత పెరుగుదలే దీనికి నిదర్శనంగా నిలుస్తోంది. 2018లో తలసరి విద్యుత్ లభ్యత 1,180.3 యూనిట్లు మాత్రమే ఉండగా.. ఇప్పుడది 1,378.6 యూనిట్లకు పెరిగింది. మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్థలకు ఇస్తున్న ప్రోత్సాహం, బలపడుతున్న విద్యుత్ వ్యవస్థల కారణంగానే ఇది సాధ్యమైంది.

2018లో తలసరి విద్యుత్ లభ్యత 1,180.3 యూనిట్లు మాత్రమే

- రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో మెరుగైన విద్యుత్ వ్యవస్థ
- క్లిష్ట పరిస్థితుల్లోనూ వినియోగదారులకు నిరంతర సరఫరా
- ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ఆదర్శంగా నిలుస్తున్న డిస్కంలు



సాక్షి, అమరావతి: వినియోగదారులకు అత్యధిక విద్యుత్‌ను అందుబాటులో ఉంచేందుకు ఏపీ ట్రాన్స్‌కో మెరుగైన నెట్‌వర్క్ మెయింటెనెన్స్, మానిటరింగ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌ను సులభతరం చేసే దిశగా చర్యలు చేపట్టింది. జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (జీఐఎస్) అంతర్గత డిమాండ్ అంచనా నమూనాను అభివృద్ధి చేసింది. ఏపీ స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఏపీ ఎస్ఎల్‌డీసీ) ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ పద్ధతులను ఉపయోగించి మరింత అధునాతన అంతర్గత ఎనర్జీ ఫోర్ కాస్టింగ్ మోడల్‌ను అభివృద్ధి చేసింది. తద్వారా ఎప్పటికప్పుడు అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేయగలుగుతోంది. మరోవైపు పంపిణీ వ్యవస్థను డిస్కంలు మెరుగుపరుచుకుంటున్నాయి. దీంతో 2018–19లో 16.36 శాతంగా ఉన్న యాగ్రిగేట్ టెక్నికల్, కమర్షియల్ (ఏటీసీ) నష్టాలు 2021–22లో 11.21 శాతానికి తగ్గాయి. 5.15 శాతం తగ్గుదలతో దేశంలోనే ఏపీ మొదటి స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలు దేశంలోనే అత్యుత్తమమని రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) ప్రకటించింది.

ముందు మరింత మెరుగ్గా..

రాష్ట్రంలోని 1.92 కోట్ల వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేస్తున్న మూడు డిస్కంలు 'కన్స్యూమర్ సర్వీస్ రేటింగ్ ఆఫ్ డిస్కమ్స్' నివేదికలో ఇప్పటికే 'ఏ' గ్రేడ్ సాధించాయి. రానున్న రోజుల్లో సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు 'లాస్ డిడక్షన్ వర్క్స్' పేరుతో ఏపీ ఈపీడీసీఎల్‌లో రూ. 2,617.54 కోట్లు, ఏపీ సీపీడీసీఎల్‌లో రూ.1,498.5 కోట్లు, ఏపీ ఎస్పీడీసీఎల్‌లో రూ.5,160.64 కోట్లు వెచ్చించాలని భావిస్తున్నాయి. విద్యుత్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు దానివల్ల ప్రజలు, విద్యుత్ సిబ్బంది ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు కూడా విద్యుత్ సంస్థలు చర్యలు చేపడుతున్నాయి. భద్రతా చర్యలలో భాగంగా స్ప్రింగ్ చార్జ్ బ్రేకర్స్ స్థానంలో సాంకేతికంగా మెరుగైన 'ఫాస్ట్ యాక్టింగ్ పర్మినెంట్ మాగ్నెట్ యాక్చ్యుయేటర్ మెకానిజం టైప్ వాక్యూమ్ సర్క్యూట్ బ్రేకర్ల'తో భర్తీ చేయాలని డిస్కంలు ఇప్పటికే ప్రతిపాదించాయి.

2012 నుంచి 2022 వరకు రాష్ట్రంలో తలసరి విద్యుత్ లభ్యత (యూనిట్లలో)

ఏడాది	యూనిట్లు
2012	1,006
2013	970.5
2014	1,051.6
2015	1,140.2
2016	1,019.8
2017	1,098.6
2018	1,180.3
2019	1,289.4
2020	1,321.9
2021	1,254.5
2022	1,378.6

ప్రభుత్వ ప్రోత్సాహం

గడచిన మూడేళ్లలో డిస్కంలకు ప్రభుత్వం రూ.40 వేల కోట్లకుపైగా ఆర్థిక సాయం అందించింది. దీంతో విద్యుత్ సరఫరా వ్యవస్థను అభివృద్ధి పరుచుకుంటున్నాం. మౌలిక సదుపాయాలు కల్పించుకుంటున్నాం. ఆధునిక సాంకేతికతతో వినియోగదారులకు అధిక విద్యుత్‌ను అందుబాటులో ఉంచుతున్నాం.

– కె.సంతోషరావు, సీఎండీ, ఏపీ ఈపీడీసీఎల్, ఏపీ ఎస్పీడీసీఎల్

మనమే ఆదర్శం

విద్యుత్ కొరత ఏర్పడితే బహిరంగ మార్కెట్ నుంచి అత్యధిక ధరకు కొనైనా సరే వినియోగదారులకు అందించేందుకు ప్రభుత్వమే ఆర్థికంగా చేయూతనిస్తోంది. మెరుగైన విద్యుత్ సరఫరా కోసం అత్యాధునిక సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నాం. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, మరమ్మతులను తరచుగా నిర్వహిస్తున్నాం.

– జె.పద్మాజనార్దనరెడ్డి, సీఎండీ, ఏపీ సీపీడీసీఎల్



రెండు చేతులా సంపాదిస్తున్నా సరిపోవడం లేదని కొందరు వాపోతుంటారు.. అదే మరో చేయి కూడా ఉంటే..? పక్షుల్లా ఆకాశంలో ఎగరాలని ఎందరో కలలు కంటుంటారు.. అలా మనకూ రెక్కలు వచ్చేస్తే..? .. ఇవన్నీ మరికొన్ని ఏళ్లలో సాధ్యమేనని.. ఇప్పటికే సిద్ధం చేసిన 'మూడో బొటనవేలు (థర్డ్ థంబ్)' సాక్ష్యమని శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఒక చేతికి ఈ 'థర్డ్ థంబ్'ను అమర్చుకుంటే.. రెండు చేతులతో చేసే పనిని ఒక చేతితోనే చేసేయవచ్చని స్పష్టమైందని, ఇదే సాంకేతికతతో భవిష్యత్తులో రెక్కలు, టెంటకిల్స్ వంటివీ పెట్టేసుకోవచ్చని వివరిస్తున్నారు. అసలు 'థర్డ్ థంబ్' ఏంటి? ఎలా పనిచేస్తుంది? ఈ టెక్నాలజీ మిగతా వాటికి ఎలా దారిచూపుతుందో తెలుసుకుందామా..

– సాక్షి సెంట్రల్ డెస్క్

ఇది 'మూడో బొటన వేలు'

త్వరలో రెక్కలు, టెంటకిల్స్ కూడా వస్తాయ్..

కోల్పోయినా.. కావాలన్నా..



ప్రమాదాలు, యుద్ధాలు, దాడుల్లో కొందరు కాళ్లు, చేతులు కోల్పోతుంటారు. అలాంటి వారి కోసం పూర్తి స్థాయిలో పనిచేయగల కృత్రిమ అవయవాలను రూపొందించడంపై శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. మరోవైపు మనుషుల సామర్థ్యం పెరిగేలా పరికరాల సృష్టికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే కేంబ్రిడ్జ్ వర్సిటీ కాగ్నిటివ్ న్యూరోసైన్స్ ప్రొఫెసర్లు డానీ క్లోడ్, తమర్ మకిన్ కలసి కృత్రిమ బొటనవేలిని రూపొందించారు. 'థర్డ్ థంబ్'గా పిలుస్తున్న ఈ పరికరాన్ని త్రీడీ ప్రింటింగ్ ద్వారా ముద్రించి, పలు రకాల సెన్సర్లను అమర్చారు. చేతిపై చిటికెన వేలికి కాస్త కిందుగా దీన్ని ఏర్పాటు చేస్తారు. దీనికి అనుసంధానంగా కాలి బొటనవేలి వద్ద ఒత్తిడిని గుర్తించే) సెన్సర్లను అమర్చుతారు. కాలి బొటనవేలి కదలికలు, ఒత్తిడిని బట్టి.. చేతికి అమర్చిన 'థర్డ్ థంబ్' కదులుతుందన్న మాట.

20 మంది వలంటీర్లకు ఈ 'థర్డ్ థంబ్'ను ప్రయోగాత్మకంగా అమర్చి.. పనితీరు, కదలికలపై ఐదు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. వారి మెదడు ఈ పరికరాన్ని శరీరంలో భాగంగా పరిగణించి, తగినట్టుగా స్పందించడానికి త్వరగానే అలవాటు పడింది. వలంటీర్లు ఒకే చేతితో కాఫీ

శరీరంలో భాగమే అనుకునేలా..



కప్పు పట్టుకుని,దానిలో చక్కెర వేసి కలపడం, సూదిలో దారం ఎక్కించడం, ఒకే సమయంలో ఎక్కువ వస్తువులను పట్టుకోవడం వంటివి ఈ 'థర్డ్ థంబ్'తో చేయగలిగారు. ఒకదశలో ఇది శరీరంలో భాగమనే స్థాయిలో ఫీల్ అయ్యారు. దీనికి సంబంధించిన వీడియోలను శాస్త్రవేత్తలు విడుదల చేశారు.

మరిన్ని అవయవాలు కూడా..

'థర్డ్ థంబ్'ను మెదడు దాదాపుగా స్వీకరించిందని.. అంటే భవిష్యత్తులో మరింత పెద్దవైన, సంక్లిష్టమైన రెక్కలు, టెంటకిల్స్ వంటి అవయవాలనూ జత చేసుకోగలమని ప్రొఫెసర్ తమర్ మకిన్ చెప్పారు. ఇప్పటికే అలాంటి టెక్నాలజీలు కొంతమేర అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం 'థర్డ్ థంబ్'ను నియంత్రించడానికి కాలి బొటనవేలి కదలికలను ఉపయోగించుకున్నామని.. నేరుగా మెదడు నుంచి అందే సిగ్నల్స్‌తో కదిలించే స్థాయికి చేరాల్సి ఉందని వివరించారు. కృత్రిమ రెక్కలు, టెంటకిల్స్ తేలికగా, సమర్థవంతంగా, తక్కువ విద్యుత్‌తో పనిచేయాలని.. భవిష్యత్తులో దీనికి దారి చూపగలదని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఇప్పటికే రోబోటిక్ టెంటకిల్..

ప్రొఫెసర్ డానీ క్లోడ్ ఇప్పటికే 'వైన్ 2.0' పేరిట ఒక రోబోటిక్ టెంటకిల్‌ను కూడా రూపొందించారు. వెన్నెముక తరహాలో 26 భాగాలను అనుసంధానం చేసి రూపొందించిన ఈ టెంటకిల్‌ను.. పాదాల వద్ద ఏర్పాటు చేసిన ఒత్తిడి సెన్సర్ల ద్వారా నియంత్రించవచ్చు. అది అచ్చంగా ఆక్టోపస్ తరహా కదలికలను చూపడం గమనార్హం.



కమిషనర్ టేబుల్,కుర్చీల అటాచ్‌మెంట్

కాకినాడ: పాతికేళ్లుగా కొనసాగుతున్న ఓ కేసుకు సంబంధించి.. కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ టేబుల్, కుర్చీలను అటాచ్ చేస్తూ న్యాయస్థానం నుంచి వచ్చిన ఆదేశాలతో కలకలం రేగింది. కార్పొరేషన్ కమిషనర్ కె.రమేష్ సుమారు 13 రోజుల పాటు సెలవుపై వెళ్లడంతో ఉత్తర్వుల అమలుకు తాత్కాలికంగా బ్రేక్ పడటంతో ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. వనుము సత్యనారాయణ అనే వ్యక్తి దాదాపు పాతికేళ్ల కిందట కాకినాడ నగర పాలక సంస్థలో రోజువారి వేతనంపై ఎన్ఎంఆర్‌గా పనిచేసేవాడు. విధుల్లో ఉన్న సమయంలో అతడిపై ఓ క్రిమినల్ కేసు దాఖలు కావడంతో బాధ్యతల నుంచి తప్పించారు. దీనిని సవాల్ చేస్తూ సత్యనారాయణ న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో అతని కేసుపై న్యాయస్థానం స్పందిస్తూ శనివారం అటాచ్‌మెంట్ ఇచ్చింది.

నేడు సీఎం జగన్ పశ్చిమగోదావరి జిల్లా కలగంపూడి పర్యటన

నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి కుమార్తె వివాహ రిసెప్షన్‌కు హాజరు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా కలగంపూడిలో పర్యటించనున్నారు. నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు కుమార్తె వివాహ రిసెప్షన్‌కు సీఎం హాజరుకానున్నారు. సాయంత్రం 3.50 గంటలకు తాడేపల్లి నుంచి బయలుదేరి.. 4.20 గంటలకు కలగంపూడి చేరుకుని, 4.30 గంటలకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో వివాహ రిసెప్షన్‌కు హాజరవుతారు. అనంతరం 5.15 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 5.55కి తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

ఏపీ ఐటీ విభాగంతో సీఆర్‌సీఐడీఎఫ్ ఒప్పందం



మంత్రి అమర్‌నాథ్ సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న సౌరభ్‌గౌర్, ప్రసాద్

బీచ్‌రోడ్డు(విశాఖ): సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ సైబర్ ఇంటెలిజెన్స్ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్స్ (సీఆర్‌సీఐడీఎఫ్)సంస్థ, ఏపీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సమక్షంలో శనివారం సీఆర్‌సీఐడీఎఫ్ సీఈవో ప్రసాద్, ప్రభుత్వ కార్యదర్శి సౌరభ్ గౌర్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా సీఆర్‌సీఐడీఎఫ్ మూడేళ్లలో రూ.15 కోట్లు పెట్టుబడి పెట్టడంతోపాటు 50 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

టీడీపీ అభ్యర్థి అనుచరుడి నుంచి భారీగా నగదు పట్టివేత

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రూ.26.89 లక్షల నగదు స్వాధీనం

ఎంవీపీ కాలనీ (విశాఖ తూర్పు): భారీ నగదుతో టీడీపీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవి అనుచరుడు పోలీసులకు పట్టుబడ్డ ఘటన శనివారం ఎంవీపీ కాలనీలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేపాడ చిరంజీవి అనుచరుడు కంచిపాటి రమేష్‌నాయుడు ఎంవీపీ కాలనీ సెక్టార్–1 లవకుశ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. రమేష్‌నాయుడు బయట నుంచి శనివారం సాయంత్రం రూ.26,89,500 నగదును ఎంవీపీ కాలనీ సెక్టార్–1లోని ఇంటికి తరలిస్తుండగా అప్పటికే ప్రత్యేక నిఘా పెట్టిన సీఐ మల్లేశ్వరరావు, తహసీల్దార్లు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆ నగదుకు సంబంధించి అతని దగ్గర ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఎన్నికల నేపథ్యంలో ఆర్థిక అవకతవకలకు పాల్పడేందుకు ఈ నగదును నిల్వ చేస్తున్నట్టు గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. అతని నుంచి రెండు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం, నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

'ఆయనకు ఇచ్చేందుకే తీసుకెళ్తున్నా'

కాగా, ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవి పూర్వం నుంచీ పరిచయం ఉన్న వ్యాపారి కావడంతో.. ఆయనకు ఇచ్చేందుకు ఈ నగదు తీసుకు వెళుతున్నట్టు రమేష్‌నాయుడు పోలీసులకు తెలిపారు. ఓటర్లకు ఎన్నికల నిమిత్తం డబ్బులు పంచదలిచామని పేర్కొన్నారు.

ఇప్పటంలో చిచ్చుకు మళ్లీ జనసేన యత్నం

- మిగిలిపోయిన ఆక్రమణలు తొలగించేందుకు అధికారుల రాక
- కృష్ణా గుంటూరు జిల్లాల నుంచి వచ్చిన టీడీపీ, జనసేన శ్రేణులు
- అవి ప్రభుత్వ భూమిలోనివని నిరూపించాలంటూ హంగామా
- గుడిలోకి వెళ్లి తాళాలు వేసుకున్న వైనం
- ఆధారాలు చూపించడంతో తోకముడిచిన మూకలు



ఇప్పటంలో రాముల వారి గుడి లోపల కూర్చుని నిరసన తెలియజేస్తున్న జనసేన నాయకులు

తాడేపల్లి రూరల్: గుంటూరు జిల్లా ఇప్పటంలో గతంలో తొలగించకుండా మిగిలిపోయిన ఆక్రమణల విషయంలో జనసేన మూకలు శనివారం మరోసారి గ్రామంలో చిచ్చుపెట్టేందుకు యత్నించారు. అధికారులు ఎంత చెప్పినా వినకపోవడంతోపాటు గ్రామంలోని రామాలయంలోకి వెళ్లి తాళాలు వేసుకున్నారు. సదరు ఆక్రమణలు ప్రభుత్వ భూమిలోనివేనని అధికారులు స్పష్టంచేయడం.. పోలీసుల హెచ్చరికలతో జనసేన మూకలు తోకముడిచాయి. వివరాలివీ.. గతంలో నానా రభస సృష్టించి ఇప్పటంలో అభివృద్ధి పనులను జనసేన శ్రేణులు అడ్డుకోవడంతో మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంటీఎంసీ) అధికారులు అప్పట్లో కొన్ని ఆక్రమణలను తొలగించలేదు. వీటిని తిరిగి శనివారం తొలగించేందుకు సిద్ధమవుతుండగా కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి జనసేన, టీడీపీ శ్రేణులు గ్రామంలో మరోసారి రగడ సృష్టించేందుకు ప్రయత్నించారు. ముఖ్యమంత్రిని, ప్రభుత్వాన్ని రాయడానికి వీల్లేని భాషలో ఇష్టానుసారం దూషించారు. కానీ, ఎంటీఎంసీ అధికారులు మాత్రం సంయమనం పాటించారు. అంతేకాక.. తామేమీ ప్రైవేట్ ఆస్తులను తొలగించడంలేదని.. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నిర్మించుకున్న ప్రహరీ గోడలు, మెట్లు, వ్యాపార సముదాయాలు మాత్రమే తొలగిస్తున్నామని స్పష్టంచేశారు. ఇంతలో అది ప్రభుత్వ భూమి అయితే ఆధారాలు చూపాలని జనసేన శ్రేణులు డిమాండ్ చేయగా అధికారులు అందుకు సరేనన్నారు. అదే సమయంలో గ్రామంలో బయట వ్యక్తులు ఎవరూ ఉండకూడదని పోలీసులు హెచ్చరించడంతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్తత ఏర్పడింది. వారిని అడ్డుకునే ప్రయత్నంలో జనసేన మూకలు రెచ్చిపోగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. మరికొందరు అక్కడి రామాలయంలోకి వెళ్లి తాళాలు వేసుకున్నారు. ఇంతలో ఎంటీఎంసీ అధికారులు 1916 నాటి రికార్డులను తీసుకొచ్చి వారికి చూపించారు. దీంతో.. అధికారులు ఆక్రమణలపై చేసిన మార్కింగ్ కొలతలు.. రికార్డుల్లో ఉన్న కొలతలు ఒకటేనని తేలిపోయింది. ఇక ఏం మాట్లాడాలో అర్థంకాక అధికారులతో జనసేన మూకలు వాదనకు దిగాయి. పోలీసులు హెచ్చరించడంతో వారు బయటకొచ్చి వెళ్లిపోయారు. దీంతో ఉద్రిక్త పరిస్థితి సద్దుమణిగింది. ఇదిలా ఉంటే.. జనసేన శ్రేణులు గుడిలోకి వెళ్లి తాళాలు వేసుకోవడం.. ప్రభుత్వం, సీఎంపై నానా మాటలు అనడంతో గ్రామానికి చెందిన మహిళలు బహిరంగంగానే ఆక్షేపించారు.

ప్రతిభకు పట్టం కడదాం..

'సాక్షి ఎక్సలెన్స్ అవార్డు'లకు ఎంట్రీల ఆహ్వానం ● చివరి తేదీ: మార్చి 31, 2023



సాక్షి,హైదరాబాద్: 'ప్రతిభ ఏదైనా పట్టం కడదాం. రంగం ఏదైనా ప్రతిభే కొలమానం.'అంటూ ప్రతి ఏటా వివిధ రంగాల్లో ప్రతిభావంతులను గుర్తించి 'సాక్షి'ఎక్సలెన్స్ అవార్డులను ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే. త్యాగం, నైపుణ్యం, ప్రతిభ, కళ ఎక్కడ ఏ రూపంలో ఉన్నా.. 'సాక్షి' వెలికితీసి గౌరవిస్తోంది. సమాజ హితం కోరే ముఖ్యులతో ఏర్పాటైన 'జ్యూరీ'అవార్డుల కోసం వచ్చిన ఎంట్రీల నుంచి విజేతలను నిర్ణయించి ప్రకటిస్తోంది. ప్రతీ ఏడాదిలాగే ఈసారి కూడా 'సాక్షి' ఎక్సలెన్స్ అవార్డుల'కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తోంది. 2022కు సంబంధించి ఎంట్రీలు పంపవచ్చు. అవార్డుల ఎంపిక ప్రక్రియ మొదలైంది. ఆసక్తి గల వారు మార్చి 31, 2023 సాయంత్రం 6 గంటల వరకు ఎంట్రీలను పంపించవచ్చు. ఈసారి కూడా ఎంట్రీలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే వెసులుబాటు ఉంది. ప్రతిభను గుర్తెరిగిన ఇతరులెవరైనా.. ఆయా వ్యక్తులు, సంస్థల తరఫున కూడా ఎంట్రీలను పంపవచ్చు. కొన్ని అంశాల్లో యువతరానికి, ప్రవాస భారతీయులకు కూడా అవార్డులు ఉన్నాయి. సందర్భాన్ని బట్టి 'జ్యూరీ ప్రత్యేక ప్రశంస' కూడా లభించవచ్చు. నైపుణ్యాలను ప్రశంసించడం, సేవలను కొనియాడటం, సాధనను అభినందించడం ఎవరైనా చేయదగినవే. ఈ భావన కలిగినవారంతా తమ ఎరుకలో ఉన్న ఇటువంటి ప్రతిభామూర్తులను గుర్తించి, వారి పేర్లను ప్రతిపాదిస్తూ అవార్డుల కోసం ఎంట్రీలను పంపుతారని 'సాక్షి' అభిలషిస్తోంది. 'సాక్షి' చేస్తున్న ఈ కృషికి అందరూ చేయూతనివ్వండి. నామినేషన్ల ఎంట్రీలను నేరుగా అప్లికేషన్‌ఫారంలో ఇచ్చిన చిరునామాకు పంపించవచ్చు. లేదా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు **www.sakshiexcellenceawards.com** వెబ్‌సైట్‌కు లాగిన్ కావచ్చు. పూర్తి వివరాల కోసం పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 040 – 23256134 నంబర్‌పై గానీ, మెయిల్ ఐడీలో గానీ సంప్రదించవచ్చు.

sakshiexcellenceawards@sakshi.com

SAKSHI | సాక్షి | SAKSHI DIGITAL | MEDIA GROUP

కేటగిరీలు ఇలా:

ప్రధాన అవార్డులు (జ్యూరీ బెస్ట్)

- ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్
- ఎక్సలెన్స్ ఇన్ సోషల్ డెవలప్ మెంట్
- ఎక్సలెన్స్ ఇన్ హెల్త్ కేర్ – వ్యక్తి/ సంస్థ
- ఎక్సలెన్స్ ఇన్ ఫార్మింగ్
- బిజినెస్ పర్సన్ ఆఫ్ ద ఇయర్– లార్జ్ స్కేల్
- బిజినెస్ పర్సన్ ఆఫ్ ద ఇయర్ – స్మాల్/ మీడియం
- ఎక్సలెన్స్ ఇన్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ – ఇండివిడ్యువల్
- ఎక్సలెన్స్ ఇన్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్– కార్పొరేట్
- ఎక్సలెన్స్ ఇన్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ – ఎన్‌జీఓ

యంగ్ అచీవర్స్ (జ్యూరీ బెస్ట్)

- యంగ్ అచీవర్ ఆఫ్ ద ఇయర్ – ఎడ్యుకేషన్
- యంగ్ అచీవర్ ఆఫ్ ద ఇయర్ – సోషల్ సర్వీస్
- యంగ్ అచీవర్ ఆఫ్ ద ఇయర్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ – ఇండివిడ్యువల్
- యంగ్ అచీవర్ ఆఫ్ ద ఇయర్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ – కార్పొరేట్
- యంగ్ అచీవర్ ఆఫ్ ద ఇయర్ ఎన్విరాన్‌మెంట్ కన్జర్వేషన్ – ఎన్‌జీఓ



> నీతి మార్గము నందు జీవము కలదు.
> దాని త్రోవలో మరణమే లేదు.
> – క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, **తిథి:** శు.త్రయోదశి ప.2.06 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** ఆశ్లేష రా.9.36 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** ఉ.9.11 నుండి 10.56 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.28 నుండి 5.15 వరకు, **అమృతఘడియలు:** రా.7.52 నుండి 9.34 వరకు.

సూర్యోదయం : 6.20
సూర్యాస్తమయం : 6.03
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

మల్లికార్జున్ ఖర్గే (కాంగ్రెస్ అధ్యక్షుడు)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

రాహుల్ లండన్ నుంచి ఫోన్ చేసినప్పుడు గానీ రాహుల్ ఇండియాలో లేరన్న ఒక ప్రకృతి సహజమైన విషయం నాకు స్ఫురణకే రాలేదు!

గురువారం రాహుల్ నాకు ఫోన్ చేసే సమయానికి టీవీలో నేను ఎన్నికల ఫలితాలు చూస్తున్నాను. త్రిపురలో కాంగ్రెస్ నాలుగో స్థానంలోకి పడిపోయింది. అక్కడ మూడు సీట్లే వచ్చాయి! మేఘాలయలో 21 సీట్లుండేవి. అవి ఐదు సీట్లకు పడిపోయాయి! నాగాలాండ్‌లో వరుసగా రెండోసారీ ఒక్క సీటూ రాలేదు!

'ఖర్గేజీ.. ఎలా ఉన్నాయి ఎన్నికల ఫలితాలు?' అని అడిగి రాహుల్ నన్ను ఇబ్బంది పెట్టరని నాకు తెలుసు కనుక నేనూ ఆయన్ని ఇబ్బంది పెట్టకుండా.. "రాహుల్‌జీ.. ఏమిటి లండన్ సంగతులు.. చెప్పండి.." అని అడిగాను.

తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నప్పుడు.. 'ఏమిటి సంగతులు' అనే ఒక సునాయాసమైన ప్రశ్నను వేయడానికి కూడా నవనాడులనూ కృంగదీసుకోవలసి వస్తుంది.

"లండన్‌లో అంతా నా 'న్యూ' లుక్ గురించే మాట్లాడుతున్నారు ఖర్గేజీ. కేంబ్రిడ్జి



స్టూడెంట్స్ అయితే.. అసలు ఆ గుబురు గడ్డంలోనే నేనెంతో బాగున్నానని అంటున్నారు.." అని చెప్పి, పెద్దగా నవ్వారు రాహుల్.

గుండెల్లో ఏ భారమూ లేని వాళ్లే అంత హాయిగా నవ్వగలరు.

నేనూ నవ్వాను.

తను నవ్వినప్పుడు తోడుగా ఎవరైనా నవ్వడాన్ని రాహుల్ చాలా ఇష్టపడతారు. ఆ సంగతిని నేను తొలిసారిగా గత ఏడాది మార్చి 10న గ్రహించాను. టీవీలో ఆ రోజు ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వస్తున్నాయి. ఉత్తరప్రదేశ్, పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్, మణిపూర్.. ఒక్క రాష్ట్రంలోనూ కాంగ్రెస్ రావడం లేదు. నేను ఢిల్లీలో ఉన్నాను. రాహుల్ ఎక్కడున్నారో తెలీదు. ఫోన్ చేశాను.

"రాహుల్‌జీ.. టీవీ చూస్తున్నారా?" అని అడిగాను.

"ఆ.. చూస్తున్నా ఖర్గేజీ. ఐస్‌క్రీమ్ మిక్స్ చేసిన చల్లని ఫలూదా తింటూ టీవీ చూడ్డం ఎంతో బాగుంది.." అన్నారు!!

"అవును రాహుల్‌జీ. ఫలూదా ఎంతో బాగుంటుంది" అన్నాను. ఆ మాటకు ఆయన చాలా సంతోషించారు. "వయనాడులోని ది బెస్ట్ ఫలూదాను తింటూ నేనిప్పుడు మీతో మాట్లాడుతున్నాను తెలుసా ఖర్గేజీ.." అన్నారు.

అప్పటికీ, ఇప్పటికీ ఒకేలా ఉన్నారు రాహుల్! పార్టీ విధేయుడిగా ఆయనలో మార్పు తీసుకువచ్చే ప్రయత్నం చేయలేను. పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికల ఫలితాల గురించి మాట్లాడకుండానూ ఉండలేను. ఎలా?!

రాహుల్ తన 'న్యూ' లుక్ మూడ్‌లోంచి బయటికి వచ్చేవరకు ఆగి.. "రాహుల్‌జీ.. ఈ ఎన్నికల్లో మనం బీజేపీతో ఢీ అంటే ఢీ అన్నాం. ఐదు రాష్ట్రాల్లో సరిసమానంగా మూడు సీట్లు మనకు, మూడు సీట్లు వాళ్లకు వచ్చాయి.." అని చెప్పాను.

"ఎన్నికలు జరిగింది మూడు రాష్ట్రాలకే కదా ఖర్గేజీ! ఐదంటారేమిటి?!" అని అడిగారు రాహుల్. ఆ మాటకు నేను తబ్బిబ్బయ్యాను. ఎన్ని రాష్ట్రాలకు ఎన్నికలు జరిగిందీ రాహుల్‌కు తెలియకుండా ఏమీలేదు!!

"రాహుల్‌జీ.. నేనంటున్నది ఆరు స్థానాలకు ఉప ఎన్నికలు జరిగిన ఐదు రాష్ట్రాల గురించి. బెంగాల్, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో మనకు మూడు సీట్లొస్తే.. మహారాష్ట్ర, అరుణాచల్, జార్ఖండ్ రాష్ట్రాల్లో బీజేపీకి మూడు సీట్లొచ్చాయి.. " అన్నాను.

"వావ్.. ఖర్గేజీ" అన్నారు రాహుల్.

"ఇంకా చెప్పమంటారా?" అని అడిగాను.

"చెప్పండి ఖర్గేజీ.." అన్నారు.

"ముప్పై ఏళ్లలో తొలిసారి మహారాష్ట్ర కస్బాపేట సీటును మన పార్టీ గెలుచుకుంది రాహుల్‌జీ..!" అన్నాను.

"రియల్లీ!! గ్రేట్ ఖర్గేజీ.." అన్నారు రాహుల్!

నేనొక విషయం కనిపెట్టాను. రాహుల్‌బాబు చల్లని ఫలూదాను, పరదేశీ ప్రయాణాలను ఇష్టపడటానికి కారణం ఎన్నికల ఫలితాలపై ఆసక్తి లేక కాదు. ఆసక్తి కలిగించేవారు లేక!!

ఇది విశ్వసనీయత విజయం!





జనతంత్రం

వర్ధెల్లి మురళి

భోజరాజు ముఖం చూస్తే ఎవరికైనా కవిత్వం వచ్చేస్తుందట! రాజుగారికి వందిమాగధులు చేసిన పొగడ్త అలా సాహిత్యంలో నిలబడిపోయింది. అలాంటి ప్రయత్నమే మన ఎల్లో మీడియా చేసింది. మన బాబుగారు చిటికేస్తే అభివృద్ధి పరుగెత్తుకొస్తుందట! బాబుగారి ఇంట్లో తోక ఊపుకుంటూ ఆయన వెంట తిరిగే బొచ్చుకుక్క పేరే అభివృద్ధి అన్నట్టుగా మన మీడియా ప్రచారంలో పెట్టింది. ఏకపక్ష మీడియా ఏం చెప్పినా చెల్లు బాటవుతుందన్న ధీమా. ప్రజల ఇంగితం మీద చిన్నచూపు.

చంద్రబాబు అనే కొయ్యగుర్రాన్ని చెక్కడానికి ఎల్లో మీడియా ఎన్ని కోతలు కోసింది? భారత రాష్ట్రపతిగా అబ్దుల్ కలామ్‌ను బాబే ఎంపిక చేశారు. ప్రధాని పదవి చేపట్టే అవకాశాన్ని చంద్రబాబు తృణప్రాయంగా తృణీకరించి దేవెగౌడను ఆ స్థానంలో కూర్చోబెట్టారు. ఆ తర్వాత గుజ్రాల్‌ను కూడా! హైదరాబాద్‌ను చంద్రబాబే నిర్మించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సృష్టికర్త ఆయనే! ఇటువంటి అతిశయోక్తులను ఎంతగా ప్రచారంలో పెట్టారంటే చివరకు చంద్రబాబు కూడా వాటిని నిజమనుకునే భ్రాంతిలోకి జారుకున్నారు. ఎల్లో మీడియా దెబ్బకు ఈ లేటు వయసులో పాపం చంద్రబాబు ఆ భ్రాంతిలోనే మరింత కూరుకుపోతున్నారు.

జనం నవ్వుకుంటున్నారన్న స్పృహ కూడా ఆయనకు ఉండటం లేదు. 'తమ్ముళ్లూ! మీ కోసరం నేను సెల్‌ఫోన్ కనిపెట్టాను. మీకోసరం కంప్యూటర్‌ను తయారు చేశాను. దాంతో మీరు దర్జాగా బతికేస్తున్నారు. ఐటీ ఉద్యోగాలు చేసేవాళ్లంతా నాకు రాయల్టీ చెల్లించాల'ని కూడా కలవరిస్తున్నారు. 'నేను నిర్మించిన హైదరాబాద్ అభివృద్ధిని చూస్తే గర్వంగా ఉన్నది. ఇంతకంటే గొప్పగా నేను కట్టించిన అమరావతి మహానగరాన్ని జగన్‌మోహన్‌రెడ్డి కూల్చేస్తున్నాడు.' – ఇలా ఎక్కడికి వెళ్లినా ఈ తరహా ప్రసంగాలే చేస్తున్నారు. తక్షణమే తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఈ పలవరింతలు మరింత ముదిరే అవకాశమున్నది. 'ఎవరక్కడ? నా కోహినూరు వజ్రాన్ని ఎవరో ఎత్తుకెళ్లారు... అయ్యో! నా నెమలి సింహాసనం కనిపించడం లేదు...' వగైరా సంభాషణల్లోకి దిగకముందే ఆయనను ఎల్లో భ్రాంతి నుంచి బయటపడేయవలసిన అవసరం ఉన్నది.

చంద్రబాబు పేరుతో ఎల్లో మీడియా కట్టుకుంటూ వస్తున్న పేకమేడలు ఒకదాని వెంట ఒకటి కుప్పకూలుతున్నాయి. ప్రశస్తమైన పంచకళ్యాణిగా ఎల్లో మీడియా చాటింపు వేసిన అశ్వం కదల్లేని కొయ్య గుర్రమని తేలడానికి ఎంతో సమయం పట్టలేదు. ములాయంసింగ్ యాదవ్ సలహాపైనే రాష్ట్రపతి అభ్యర్థిగా అబ్దుల్ కలామ్‌ను వాజ్‌పేయి ఎంపిక చేశారని బీజేపీ నాయకులు బహిరంగంగానే ప్రకటించారు. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పాటైనప్పుడు ప్రధాని పదవికి అన్ని పార్టీలూ ఏకాభిప్రాయంగా జ్యోతిబసు పేరును ముందుకు తెచ్చాయి. అయితే సీపీఎం అందుకు తిరస్కరించింది. ఫలితంగా రెండో ఛాయిస్‌గా దేవెగౌడను ఎంపిక చేశారు. సీపీఎం నిర్ణయాన్ని ఒక 'చారిత్రక తప్పిదం'గా ఆ తర్వాత కాలంలో జ్యోతిబసు అభివర్ణించారు. భారత రాజకీయ పరిభాషలో ఈ మాట ఒక కొత్త పదబంధంగా చేరిపోయింది. ఈ వ్యవహారంలో ఇంత కథ నడిస్తే మన ఎల్లో మీడియా మాత్రం చంద్రబాబే ప్రధాని పదవిని తిరస్కరించారని ప్రచారంలో పెట్టింది. చంద్రబాబు ఈ ప్రచారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లారు. ప్రధాని పదవిని తీసుకోవద్దనీ, రాష్ట్రానికే నీ సేవలు అవసరమున్నాయనీ తన కుమారుడు లోకేశ్ ఇచ్చిన సలహా మేరకు తిరస్కరించినట్టు బాబు చెప్పుకొచ్చారు. అప్పుడు లోకేశ్‌బాబు వయసు పదమూడు సంవత్సరాలు. నిజమే చినబాబు బాలమేధావే, ఇప్పటికీ!

హైదరాబాద్ ఐటీ అభివృద్ధిలో చంద్రబాబు పోషించినది నిజానికి నెగెటివ్ పాత్ర. కేంద్రంలో అప్పుడున్న పీవీ నరసింహారావు ప్రభుత్వం ఐటీలో హైదరాబాద్ ముందడుగు వేయడానికి అవసరమైన పూర్వరంగాన్ని సిద్ధం చేసింది. తనకూ, తన వాళ్లకూ లబ్ధి చేకూర్చుకోవడం కోసం ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కూ, రియల్ వ్యాపారానికీ పూనుకోవడంతో 'సైబర్ టవర్స్' నిర్మాణంలో జాప్యం జరిగింది. దాంతో బెంగళూరు ముందడుగు వేయగలిగింది. చేసిన ద్రోహానికి నిందించాల్సింది పోయి ఆయనకు వీరతాడు వేసి కూర్చోబెట్టాం. ఎల్లో మీడియా పోషించిన పాత్రే అందుకు కారణం. వైఎస్సార్ హయాంలో జరిగిన అభివృద్ధినీ, కేసీఆర్ హయాంలో జరుగుతున్న అభివృద్ధినీ కూడా తన ఖాతాలోనే వేసుకోవడానికి ఆయన ఏమాత్రం సంకోచించడం లేదు. చివరికి తెలంగాణ వాళ్లకు వరి అన్నం తినడం కూడా తామే నేర్పించామంటూ వదరుబోతుతనాన్ని ప్రదర్శించడం కూడా మొదలుపెట్టారు. కనీస చారిత్రక పరిజ్ఞానం లేక పోవడం వల్ల పట్టిన దౌర్భాగ్యం ఇది. ఇటువంటి దౌర్భాగ్యానికి విజనరీ అనే ముసుగేసి, ఎల్లో మీడియా తెలుగు రాష్ట్రాల ప్రజలను వంచనకు గురిచేసింది.

హైదరాబాద్ ఐటీ అభివృద్ధిలో చంద్రబాబు పోషించినది నిజానికి నెగెటివ్ పాత్ర. కేంద్రంలో అప్పుడున్న పీవీ నరసింహారావు ప్రభుత్వం ఐటీలో హైదరాబాద్ ముందడుగు వేయడానికి అవసరమైన పూర్వరంగాన్ని సిద్ధం చేసింది. తనకూ, తన వాళ్లకూ లబ్ధి చేకూర్చుకోవడం కోసం ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కూ, రియల్ వ్యాపారానికీ పూనుకోవడంతో 'సైబర్ టవర్స్' నిర్మాణంలో జాప్యం జరిగింది. దాంతో బెంగళూరు ముందడుగు వేయగలిగింది. చేసిన ద్రోహానికి నిందించాల్సింది పోయి ఆయనకు వీరతాడు వేసి కూర్చోబెట్టాం. ఎల్లో మీడియా పోషించిన పాత్రే అందుకు కారణం. వైఎస్సార్ హయాంలో జరిగిన అభివృద్ధినీ, కేసీఆర్ హయాంలో జరుగుతున్న అభివృద్ధినీ కూడా తన ఖాతాలోనే వేసుకోవడానికి ఆయన ఏమాత్రం సంకోచించడం లేదు. చివరికి తెలంగాణ వాళ్లకు వరి అన్నం తినడం కూడా తామే నేర్పించామంటూ వదరుబోతుతనాన్ని ప్రదర్శించడం కూడా మొదలుపెట్టారు. కనీస చారిత్రక పరిజ్ఞానం లేకపోవడం వల్ల పట్టిన దౌర్భాగ్యం ఇది. ఇటువంటి దౌర్భాగ్యానికి విజనరీ అనే ముసుగేసి, ఎల్లో మీడియా తెలుగు రాష్ట్రాల ప్రజలను వంచనకు గురిచేసింది.

ఈ రెండు రోజులూ విశాఖలో జరిగిన ఇన్వెస్టర్ల సమ్మిట్‌ను చూసి బాబు కోటరీ, ఎల్లో మీడియా అధినేతలూ ఏమనుకుంటున్నారో... ఎలా ఉన్నారో? కడుపు నిండా భోంచేశారో లేదో? కంటి నిండా కునుకు తీశారో లేదో? ... ఇటువంటి సంశయాలు జనసామాన్యంలో తలెత్తుతున్నాయి. సహజం. వారి ట్రాక్ రికార్డ్ అలాంటిది మరి!

ఈ రెండు రోజులూ విశాఖలో జరిగిన ఇన్వెస్టర్ల సమ్మిట్‌ను చూసి బాబు కోటరీ, ఎల్లో మీడియా అధినేతలూ ఏమనుకుంటున్నారో... ఎలా ఉన్నారో? కడుపునిండా భోంచేశారో లేదో? కంటి నిండా కునుకు తీశారో లేదో? ... ఇటువంటి సంశయాలు జనసామాన్యంలో తలెత్తుతున్నాయి. సహజం. వారి ట్రాక్ రికార్డ్ అలాంటిది మరి! ఏమంటిరి.. ఏమంటిరి? పారిశ్రామికవేత్తలు చంద్రబాబు ముఖం చూసి పరుగెత్తుకొస్తారా? జగన్‌మోహన్‌రెడ్డిని చూస్తే పారిపోతారా? అరే భాయ్! జర దేఖో... నిన్నటి విశాఖ సభా వేదికను మరొక్కసారి రివైండ్ చేసి చూసుకోండి. అటువంటి దృశ్యాలను చూసి తట్టుకోవడం కొంచెం కష్టమే. అసలే గుండెపోటు ఉదంతాలు బాగా పెరిగిపోతున్నాయి. అయినా దిటవు చేసుకొని చూడాలి.

టాప్ మోస్ట్ బిజినెస్ హౌసెస్ ఆఫ్ ఇండియా, స్వయంగా వాటి అధిపతులు వరుసగా కూర్చున్న దృశ్యం అది. అభివృద్ధి పాలిటి అట్లకాడగా మీరు ప్రచారం చేసే చంద్రబాబు నిర్వహించినప్పుడు ఈ టాప్ సీఈఓలు ఎందుకు రాలేదు? చంద్రబాబు ఓ ఈవెంట్ మేనేజర్ అని అందరికీ తెలుసు కనుక. ఆయన చేస్తున్నది ఒక నాటక్‌బాజీ వ్యవహారమని తెలుసు కనుక! మరి జగన్‌మోహన్‌రెడ్డి పిలిస్తే ఎందుకు వచ్చారు? ఆయన రూపంలో నిలబడి ఉన్నది ఒక నిలువెత్తు విశ్వసనీయతగా వారు గుర్తించారు కనుక. వస్తే వచ్చారు. జగన్‌మోహన్‌రెడ్డిని అంతగా పొగడాలా? వాస్తవాలు చెబుతున్నామనుకున్నారే తప్ప ఇక్కడ కొన్ని ప్రాణాలు పిసుక్కు చస్తాయని వారికి తెలియదు కనుక!

వైఎస్ జగన్ దక్షత, దార్శనికత గల నాయకుడు కనుకనే సులభతర వాణిజ్యంలో ఏపీకి మొదటి ర్యాంకు దక్కిందని భారత వ్యాపార దిగ్గజం ముకేశ్ అంబానీ ప్రశంసించారు. ముఖస్తుతి కోసం మాట్లాడవలసిన అగత్యం అంబానీకి లేదనే సంగతి అందరికీ తెలిసిందే. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ వాటి ఆధారంగా అభివృద్ధి ప్రణాళికను రచించడం జగన్ ప్రత్యేకతగా కరణ్ అదానీ అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల స్వర్గధామంగా జగన్ మార్చారని నవీన్ జిందాల్ కొనియాడారు. సంక్షుభిత పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొన్న నాయకుడని కియా మోటార్స్‌కు చెందిన కబ్ డాంగ్‌లీ వ్యాఖ్యానించారు. దాల్మియా భారత్ గ్రూప్ ఎండీ పునీత్ దాల్మియా మాట్లాడుతూ 'జే ఫర్ జగన్, జే ఫర్ జోష్' అంటూ అభినందించారు. ఇంతమంది దిగ్గజాలను ఇక్కడికి రప్పించిన జగన్ సమర్థతను చూసి ఈ నేలతల్లి బిడ్డగా గర్వపడుతున్నానని జీఎమ్ఆర్ గ్రూప్ ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు చెప్పారు. పారిశ్రామికవేత్తల ప్రశంసల్లో ఇవి కొన్ని మాత్రమే.

జాతీయస్థాయిలో జగన్‌మోహన్‌రెడ్డి సంపాదించుకున్న విశ్వసనీయత ప్రచారం చేసుకోవడం వల్ల వచ్చింది కాదు. ఈవెంట్ మేనేజ్‌మెంట్లతో నిలబెట్టుకున్న నమ్మకం కాదిది. గడిచిన నలభై ఐదు మాసాలుగా అహరహం శ్రమించిన ఫలితం. సోనియా ప్రభ దుర్నిరీక్ష్యంగా ఉన్న రోజుల్లోనే ఇచ్చిన మాటకోసం ఒక యువకుడు ఆమెను ధిక్కరించినప్పుడే జాతీయ స్థాయిలో కొన్ని వేల జతల కళ్లు ఇటువైపు తిరిగాయి. దేశంలోనే అత్యంత ప్రమాదకర కూటమిగా పేరున్న ఎల్లో సిండికేట్‌ను పిండికొట్టి ఒంటిచేత్తో అపూర్వ విజయం అందుకున్నప్పుడు మరికొన్ని వేల జతల కళ్లు జత కలిశాయి. ఆ కళ్లు మరింత విప్పార్చి చూడటం మొదలైంది.

అధికారంలోకి వచ్చీ రాగానే శిథిలమైపోతున్న ప్రభుత్వ విద్యారంగంలోని బూజును దులపడం మొదలుపెట్టాడు. కొందరు చాదస్తం అన్నారు. ఇది సాధ్యమయ్యే పనేనా అని ముఖం చిట్లించారు. ప్రతి పేదబిడ్డ నాణ్యమైన చదువు ఆంగ్ల మాధ్యమంలో చదవాలని అభిలషించాడు. తానే స్వయంగా పిల్లల బట్టలు, బూట్లు, బెల్టు, పుస్తకాల నాణ్యతను ఎంపిక చేశాడు. ఉచితంగా పిల్లలకు అందజేయించాడు. పిల్లలను బడికి పంపినందుకు పారితోషికంగా అమ్మ ఒడి నింపుతున్నాడు. వైద్య రంగంలోనూ అంతే! 'నాడు-నేడు' కార్యక్రమంతో రూపురేఖలు మార్చాడు. దశాబ్దాలుగా ఉన్న ఖాళీలను భర్తీ చేశాడు. ప్రతి ఊరికీ ప్రతి ఇంటికీ వైద్యం అందే ఏర్పాటు చేశాడు. గ్రామ గ్రామాన సెక్రటేరియట్‌లు ఏర్పాటు చేశాడు. ఇంటింటికీ సంక్షేమాన్ని చేరవేర్చే వలంటీర్లు నియామకమయ్యారు. ఊరూరా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. కొమ్ములు తిరిగిన రాజకీయవేత్తలకు స్టోరీ బిగినింగ్ అర్థం కాలేదు. ఫ్లాప్

జాతీయస్థాయిలో జగన్‌మోహన్‌రెడ్డి సంపాదించుకున్న విశ్వసనీయత ప్రచారం చేసుకోవడం వల్ల వచ్చింది కాదు. ఈవెంట్ మేనేజ్‌మెంట్లతో నిలబెట్టుకున్న నమ్మకం కాదిది. గడిచిన నలభై ఐదు మాసాలుగా అహరహం శ్రమించిన ఫలితం. సోనియా ప్రభ దుర్నిరీక్ష్యంగా ఉన్న రోజుల్లోనే ఇచ్చిన మాటకోసం ఒక యువకుడు ఆమెను ధిక్కరించినప్పుడే జాతీయ స్థాయిలో కొన్ని వేల జతల కళ్లు ఇటువైపు తిరిగాయి. దేశంలోనే అత్యంత ప్రమాదకర కూటమిగా పేరున్న ఎల్లో సిండికేట్‌ను పిండికొట్టి ఒంటిచేత్తో అపూర్వ విజయం అందుకున్నప్పుడు మరికొన్ని వేల జతల కళ్లు జత కలిశాయి. ఆ కళ్లు మరింత విప్పారిచూడటం మొదలైంది.

అధికారంలోకి వచ్చీ రాగానే శిథిలమైపోతున్న ప్రభుత్వ విద్యారంగంలోని బూజును దులపడం మొదలు పెట్టాడు. కొందరు చాదస్తం అన్నారు. ఇది సాధ్యమయ్యే పనేనా అని ముఖం చిట్లించారు. ప్రతి పేదబిడ్డ నాణ్యమైన చదువు ఆంగ్ల మాధ్యమంలో చదవాలని అభిలషించాడు. తానే స్వయంగా పిల్లల బట్టలు, బూట్లు, బెల్టు, పుస్తకాల నాణ్యతను ఎంపిక చేశాడు. ఉచితంగా పిల్లలకు అందజేయించాడు. పిల్లలను బడికి పంపినందుకు పారితోషికంగా అమ్మ ఒడి నింపుతున్నాడు. వైద్యరంగంలోనూ అంతే!

బొమ్మే అనుకున్నారు. ఆనందపడ్డారు. ప్రభుత్వ వైద్యరంగం మౌలిక వసతులు లేక కుప్పకూలి ఉన్న దశలో కోవిడ్ సంక్షోభం ఆవరించింది. యుద్ధరంగంలో నిలబడిన సైన్యాధ్యక్షుడిగా ముఖ్యమంత్రి వ్యవహరించారు. సంక్షోభం ముగిసేలోగానే ఇంకో పెను సంక్షోభం వచ్చినా ఎదుర్కోగల స్థాయిలో మౌలిక సౌకర్యాలను ఏర్పాటు చేయగలిగాడు. సంక్షోభం తీవ్రంగా ఉన్నవేళ కోవిడ్‌తో సహజీవనం నేర్చుకోవలసిందేనని నిర్భయంగా ప్రకటించినప్పుడు చాలామంది నివ్వెర పోయారు. క్రమంగా అనేకమంది ప్రముఖులు, మేధావులు అంతర్జాతీయ స్థాయిలో ఈ గొంతుతో శ్రుతి కలిపారు. అదే నిజమైంది. జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికత బయటకు తెలియడం మొదలైంది.

మూడేళ్లు దాటేసరికి క్రమంగా జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన బయట ప్రపంచానికి అర్థం కావడం మొదలైంది. భారత రాజ్యాంగ లక్ష్యాలను చిత్తశుద్ధితో అమలుచేయడానికి పూనుకున్నాడని అర్థమైంది. ప్రపంచ మానవాళికి తక్షణావసరమైన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా పయనిస్తున్నామని స్వయంగా ప్రభుత్వమే ప్రకటించింది. ఒక్క రూపాయి లంచం లేకుండా లక్షల కోట్ల రూపాయలను నేరుగా ప్రజల చేతికి ప్రభుత్వం నగదు బదిలీ చేసింది. ఇలా చేస్తే రాష్ట్రం శ్రీలంక అవుతుందని ప్రతిపక్షం, ఎల్లో మీడియా గగ్గోలు పెట్టాయి. కానీ, ఇదే రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించింది. జీఎస్‌డీపీ వృద్ధి రేటులో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెట్టింది కూడా ఇదే! పరిపాలనా విభాగాల్లో అలసత్వానికి తావులేకుండా నిత్యం సమీక్షించి సమాయత్తం చేయడంతోబాటు ఎస్‌ఓపీ ప్రమాణాలను ఏర్పాటు చేసుకోవడం ఉపయోగపడింది. డెలివరీ మెకానిజంలో పేరుకుపోయిన మకిలి తొలగిపోయింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మూడేళ్లు వరసగా మొదటి ర్యాంకు రావడంతో ప్రతిష్ఠ పెరిగింది.

ముఖ్యమంత్రి స్వయంగా చెప్పినట్టు ఏపీలో పేదలకు, పెత్తందార్లకు మధ్యన యుద్ధం జరుగుతున్నది. పేద ప్రజలకు విద్య, ఉద్యోగ రంగాల్లో, రాజకీయ సామాజిక రంగాల్లో సమానావకాశాలు లభించాలంటే, వారు దీటుగా పోటీ పడాలంటే ప్రభుత్వం చేయూత అవసరమని జగన్ ప్రభుత్వం భావించింది. బలహీనవర్గాలతోపాటు మహిళల సాధికారతకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. దీన్ని సహజంగానే ఫ్యూడల్ భావజాలం కలిగిన పెత్తందార్లు అడ్డుకుంటారు. అందుకే అక్కడ యుద్ధం జరుగుతున్నది. ఫ్యూడల్ భావజాలాన్ని శాశ్వతంగా సమాధి చేయకుండా పెట్టుబడిదారీ వ్యవస్థ కూడా వేళ్లూనుకోలేదు. ఆర్థిక, రాజకీయ, సామాజిక, పాలనా సంస్కరణల్లో జగన్ ప్రభుత్వం చూపుతున్న చిత్తశుద్ధిని నిశితంగా గమనిస్తున్నారు కనుకనే విశాఖ సదస్సుకు పారిశ్రామిక దిగ్గజాలు స్వయంగా హాజరయ్యారు. గడచిన నాలుగేళ్లుగా నిర్విరామంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి శ్రమకు ఫలితం ఇది. లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రం తలుపు తట్టబోతున్నాయి.

vardhelli1959@gmail.com

ఆ రోజుల్లో పెళ్లిళ్లంటే... ఎన్ని ఆచారాలూ!

అభిప్రాయం



వనం జ్వాలా నరసింహారావు

వివాహాల సందర్భంగా అప్పటి రోజులకూ ఇప్పటి రోజులకూ సంప్రదాయాల విషయంలో తేడా కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. అర్ధ శతాబ్దం క్రితం చూసిన ఆచారాలు కూడా నాకింకా గుర్తున్నాయి. పాత రోజుల్లో వివాహ పూర్వరంగంలో సంప్రదాయబద్ధంగా వరుడి ఇంట్లో జరిగే మాటా–మంతీ అయిపోయి... ఒకరి వంశక్రమం గురించి మరొకరు అవగాహనకొచ్చిన తర్వాత జరగవలసిన కార్యక్రమాన్ని ఖరారు చేసుకునేవారు. వీలునుబట్టి ఒకటి–రెండు నెలల తరువాత మంచిరోజు చూసుకుని... ఆడపిల్ల వారింట్లో కలిసి, ముహూర్తాలు పెట్టుకోవాలని సూత్రప్రాయంగా నిర్ణయించుకునేవారు. పురోహితుడిని సంప్రదించి పెళ్లి ఎన్నడు, ఏ ముహూర్తాన జరిగితే మంచిగుంటుందో తుది నిర్ణయం తీసుకునేవారు.

అప్పట్లో, వివాహంలో ముఖ్యమైన ఘట్టాలలో మొదటిది వాగ్దానం. అంటే... పెళ్లి ఖాయపరచుకోవడం లేదా నిశ్చితార్థం. ఆ తర్వాత వర-వరణం. అంటే వరుడిని లాంఛన ప్రాయంగా అంగీకరించడం. నిశ్చితార్థానికే మరో పేరు 'నిశ్చయ తాంబూలం'. వైదిక మంత్రాల మధ్య వివాహ ప్రక్రియకు పెద్దల ఆశీస్సులు తీసుకోవడానికే ఈ కార్యక్రమం. అందరికీ ఆమోదయోగ్యమైన శుభ ముహూర్తంలో పురోహితుడు బంధుమిత్రుల సమక్షంలో పెళ్లి ముహూర్తాన్ని 'లగ్నపత్రిక'గా రాయించిన తదుపరి... వధూవరుల తల్లితండ్రులు లగ్నపత్రికలు, తాంబూలాలు మార్చుకునేవారు. పెళ్లి ఒప్పందం లాంటి ఈ వేడుక అప్పట్లో సర్వసాధారణంగా వధువు ఇంటిలోకాని, అరుదుగా వారు ఏర్పాటుచేసుకున్న చిన్నపాటి వసతి గృహంలోకాని, లేదా బంధువుల ఇంటిలో కాని జరిగేది. దీన్నే ఇప్పుడు 'ఎంగేజ్‌మెంట్' అంటున్నారు. కొందరు ఇటీవలి కాలంలో ఈ తంతును పెళ్లికంటే ఘనంగా జరుపుకొంటున్నారు. నిశ్చితార్థం రోజున అమ్మాయి, అబ్బాయి ఉంగరాలు మార్చుకోవటంతో సగం పెళ్లి జరిగినట్టుగానే భావిస్తారు. ఇప్పుడు దండల మార్పిడితో సహా ఈ దాదాపు ఒక పెళ్లిలాగా ఈ తంతు జరుగుతున్నది.

సంప్రదాయ బద్ధంగా, వధూవరుల తల్లిదండ్రుల మధ్యన ఇచ్చి, పుచ్చుకోవడాలు అందరి ఇళ్లల్లో ఒకే రకంగా



ఉంటాయి. తాహతును బట్టి కొంచెం మార్పులు, చేర్పులు ఉండొచ్చు. ఇరుపక్షాల వాళ్ళు మరిచిపోవడానికి ఆస్కారం లేకుండా, అరమరికలు లేకుండా ఒక కాగితం మీద... ఇచ్చి పుచ్చుకోవడాలకు సంబంధించిన వివరాలన్నీ రాసుకోవడం కూడా సంప్రదాయమే.

వధూవరుల తారా బలం, చంద్ర బలం చూసి ముహూర్తం నిశ్చయిస్తారు. 'పెళ్లినాటి ప్రమాణాలు' భవిష్యత్‌లో దంపతులు తు.చ. తప్పకుండా అమలు చేయాలంటే 'ముహూర్త బలం' ముఖ్యమని పాతరోజుల నాటి నమ్మకం. నిశ్చితార్థంలో ప్రధానంగా విఘ్నేశ్వరుడి పూజ ఉంటుంది. ఇదంతా 'ఆచారం, పద్ధతి'.


పెళ్లి ముహూర్తం దగ్గర పడుతుంటే, పెళ్లి సరంజామా కొనడం అనేది ఇరు పక్షాల వారికి కూడా పెద్దపని. అప్పట్లో ఇన్ని బంగారం దుకాణాలు ఉండేవి కావు. బంగారం వస్తువులు తయారుచేసే కంసాలితో పెళ్ళి ఆభరణాలన్నీ తయారు చేయించేవారు.

నిర్ణయించబడిన ముహూర్తానికి వరుని తరఫువారూ, వధువు తరఫువారూ వారివారి కులాచారానుసారం 'శుభలేఖలు'గా పిలువబడే ఆహ్వానపత్రికలు ముద్రించుకుంటారు. మంగళ సూచకంగా లేఖకు నాలుగు వైపులా పసుపు పూస్తారు. బంధుగణాన్ని పిలుచు కోవడం పెళ్లిళ్లలో సర్వసాధారణం. బంధువులందరూ కలుసుకోగలిగే 'సామాజిక ఏర్పాటు' పెళ్ళిళ్లు. ఆ కలయికలకు వేదికగా పెళ్ళివారి ఇల్లు (కల్యాణ మంటపం) మారిపోతుంది. స్వయంగా కలిసి శుభలేఖ ఇవ్వడమో, వ్యక్తులకు ఇచ్చి పంపడమో జరిగేది. ఇప్పటిలాగా ఫోన్ మెసేజులు లేవు. ఎంత శ్రద్ధ తీసుకుని, అందరికీ పంపించే ఏర్పాటుచేసినప్పటికీ, ఆఖరు నిమిషంలో, ఒక్కోసారి ముఖ్యమైన వారితో సహా కొందరిని మరిచిపోవడం సహజంగా జరిగేది. వాళ్లకు కోప-తాపాలు కూడా వచ్చేవి. కాకపోతే వచ్చినంత త్వరగా తగ్గిపోయేవి. ఇవన్నీ అప్పట్లో సర్వసాధారణంగా ప్రతి పెళ్లిలోనూ, ప్రతి వారింటిలోనూ జరిగే మామూలు విషయాలే. ఆ చిరు కోపాలు రాకుంటే పెళ్ళి శోభ రానట్లే. ఇప్పుడు కోపం వచ్చినా పట్టించుకునేవారు లేరు!!

వ్యాసకర్త తెలంగాణ సీఎం సీపీఆర్ఓ

కళాప్రపూర్ణకు జేజేలు

కళాప్రపూర్ణ గణపతిరాజు అచ్యుతరామరాజు శత జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. దాదాపు అయిదు దశాబ్దాల పాటు విశాఖ పట్టణం, విశాఖ నగరం స్థాయి వరకు జరిగిన సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలకు మార్గదర్శి అచ్యుతరామరాజు. కథా, నాటక రచయితగా, నటునిగా... విశేషించి ఆంగ్ల, చారిత్రక నాటకాలలో ప్రముఖ పాత్రలు ధరించి మెప్పించిన నటునిగా, విశాఖ సాంస్కృతిక రంగ చరిత్రలో వారిదొక ప్రత్యేక అధ్యాయం. అలాగే ఆ రోజులలో అనేకమంది యువకులు స్థాపించిన నాటక, సాహితీ సంస్థలకు ఆయన సూచనలు, సలహాలు అనివార్యం. ప్రముఖ న్యాయవాదిగా పేరు ప్రతిష్ఠలుండేవి. ఆరేళ్లపాటు సమగ్ర ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యునిగా, ఆంధ్రప్రదేశ్ సంగీత, నాటక అకాడమీ సభ్యునిగా వ్యవహరించారు.



గణపతిరాజు అచ్యుతరామరాజు

తక్కువ శక్తిమంతమైన మైకులో అయినా ఆయన ప్రసంగాలు వింటుంటే ఉత్తేజం కలిగేది. రెండు మూడు తరాల వారికి సానుకూల దృక్పథంతో, స్ఫూర్తిమంతమైన సందేశాలిచ్చి, వారిని కళారంగంలో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దిన కళాతపస్వి. పీవీ నరసింహారావు, తెన్నేటి విశ్వనాథం, డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి, దామోదరం సంజీవయ్య వంటి రాజకీయ సాహితీవేత్తలతోనూ, మారేపల్లి రామచంద్ర శాస్త్రి కవి, రావి శాస్త్రి, పురిపండా అప్పల స్వామి, ఆరుద్ర తదితర సుప్రసిద్ధ సాహితీవేత్తలతోనూ ఆయనకు సన్నిహిత సంబంధాలుండేవి. డా. కె.వి. గోపాల స్వామి, కె. వెంకటేశ్వరరావు, కొత్తుర్తి భాస్కర రావు, రుద్రరాజ్ కుమార్ రాజా, అబ్బూరి గోపాల కృష్ణ, చాట్ల శ్రీరాములు వంటి రంగస్థల దిగ్గజాలతో ఆయన ఆత్మీయ బంధం వెలకట్టలేనిది. 2024 మార్చి 5వ తేదీ శత జయంతి వరకు ప్రతి నెల సంస్మరణ సభలు; సాహితీ, నాటక ప్రముఖులకు గణపతిరాజు పేరిట పురస్కారాలు అందజేయడం జరుగుతుందని... 'గణపతిరాజు అచ్యుతరామరాజు స్మారక ట్రస్టు' వ్యవస్థాపక అధ్యక్షురాలు పెన్మత్స లలితా వాశిష్ఠ ప్రకటించారు.

క్లుప్తంగా...

తెప్పపై రుక్మిణీకృష్ణుల అభయం



భక్తులకు దర్శనమిస్తున్న రుక్మిణి సమేత శ్రీకృష్ణుల వారు

తిరుమల: తిరుమలలో శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం రుక్మిణీ సమేత శ్రీకృష్ణుడు తెప్పపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. విద్యుద్దీపాలు, పుష్పాలతో శోభాయమానంగా తెప్పను అలంకరించారు. సాయంత్రం 6 గంటలకు రుక్మిణీ సమేత శ్రీకృష్ణుడి ఉత్సవమూర్తులు ఆలయ నాలుగు మాడ వీధుల గుండా ఊరేగుతూ పుష్కరిణి వద్దకు చేరుకున్నారు. రుక్మిణీకృష్ణులు పుష్కరిణిలో తెప్పపై మూడు చుట్లు తిరిగి కనువిందుచేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ పాల్గొన్నారు. తెప్పోత్సవాల్లో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నంద, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ డాక్టర్ సమీర్‌శర్మ పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

శ్రీవారిని దర్శించుకున్న స్వరూపానందేంద్ర



తిరుమల/సింహాచలం: హరియాణాలోని కురుక్షేత్రలో లక్ష చండీయాగం విశేషంగా నిర్వహించామని విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి తెలిపారు. విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వాములు శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీరికి టీటీడీ ఈవో ధర్మారెడ్డి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ రంగనాయక మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. అనంతరం స్వామీజీ ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. రాజ శ్యామల అమ్మవారి శక్తి వల్లే లక్ష చండీ యాగం నిర్వహించే బాధ్యత శారదా పీఠానికే దక్కిందన్నారు. కాణిపాకంలో లక్ష మోదక లక్ష్మీ గణపతి హవనం నిర్వహిస్తున్న తరుణంలో స్వామివారిని దర్శించుకున్నామని తెలిపారు. కాగా, తిరుమలలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 58,137 మంది స్వామి వారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.30 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని వారికి 12 గంటల సమయం పడుతోంది.

సపరివార సమేతంగా..!

దేశంలో పెరుగుతున్న ఫ్యామిలీ టూర్స్



బీచ్‌లకు ప్రసిద్ధి చెందిన గోవాకు అగ్ర తాంబూలం

అంతర్జాతీయంగా దుబాయ్‌కు పెరిగిన ఆదరణ

సెలవుల్లో కుటుంబంతోనే గడిపేందుకు ఆసక్తి



కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాలు.. ఆధ్యాత్మిక క్షేత్రాల సందర్శనకు మాత్రమే అలవాటు పడిన భారతీయులు ఇప్పుడు పర్యాటక ప్రాంతాలను సైతం ఫ్యామిలీతో కలిసి చుట్టేసేందుకు ఇష్టపడుతున్నారు. దేశంలోనూ ఇప్పుడు ఫ్యామిలీ పర్యటనల ట్రెండ్ నడుస్తోంది. ఉరుకుల, పరుగుల జీవితంలో కొద్దిపాటి విరామం దొరికినా ఫ్యామిలీ టూర్లకు చెక్కేస్తున్నారు.

సాక్షి, అమరావతి: చారిత్రక, సాంస్కృతిక నగరాలతో పాటు అందమైన బీచ్‌ల ఒడ్డున కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా సేదతీరేందుకు భారతీయులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఇందులో భాగంగా కుటుంబ సభ్యులతో కలిసి దేశంలోని గోవా వెళ్లేందుకు ఇష్టపడుతుండగా.. అంతర్జాతీయంగా అత్యంత ప్రజాదరణ పొందిన పర్యాటక గమ్యస్థానంగా దుబాయ్ కొనసాగుతోంది. డిజిటల్ ట్రావెల్ ప్లాట్‌ఫామ్ 'అగోడా' సర్వే ప్రకారం పర్యాటకులు ప్రత్యేక థీమ్‌లతో కూడిన టూర్లను ఎంపిక చేసుకుంటున్నారు. సౌకర్యవంతమైన బస, ఆకట్టుకునే ప్రదేశాలు, సముద్రపు తీరంలో సేద తీరడం, ఎకో పర్యాటకంలో ప్రశాంతంగా గడిపేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలోనే బీచ్ పర్యాటకానికి ప్రసిద్ధి చెందిన గోవాను తొలి ఎంపికగా చేసుకుంటున్నారు. ఆ తర్వాత చారిత్రక దర్శనీయ స్థలాలైన ఢిల్లీ, ముంబై, సాంస్కృతిక నగరాలు జైపూర్, పుదుచ్చేరి నగరాలు ఉన్నాయి. అంతర్జాతీయంగా దుబాయ్‌తో పాటు ఆగ్నేయాసియా దేశాల్లో పర్యటించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. సింగపూర్, మాల్దీవులు, బాలి (ఇండోనేషియా), ఫుకెట్ (థాయ్‌లాండ్)కు క్యూ కడుతున్నారు. అగోడా ఫ్యామిలీ ట్రావెల్ ట్రెండ్ సర్వేలో ప్రపంచ వ్యాప్తంగా 14వేల కుటుంబాల నుంచి ప్రతిస్పందనలను సేకరించింది.

పర్యటనలు.. షాపింగ్ కోసమే ఎక్కువ ఖర్చు

అమెరికన్ ఎక్స్‌ప్రెస్ నివేదిక కూడా 88 శాతం మంది భారతీయులు ఫ్యామిలీ పర్యటనలు, షాపింగ్‌ల కోసం ఖర్చు చేసేందుకు వెనుకాడటం లేదని చెబుతోంది. 2023లోనూ టూర్లు, పర్యటనలకే ప్రాధాన్యత ఇస్తామని భారతీయులు స్పష్టం చేసినట్టు ఆ నివేదిక స్పష్టం చేసింది. 10 మంది పట్టణ భారతీయుల్లో 8 మంది సెలవుల సీజన్‌లో ప్రయాణాలకు సిద్ధమవుతున్నారు. కొందరు పని ఒత్తిడి నుంచి బయటపడేందుకు, కుటుంబంతో ఎక్కువ సమయం గడపాలని కోరుకుంటున్నట్టు తేలింది. ఈ విధానం 2021తో పోలిస్తే భారీగా పెరిగినట్టు అమెరికన్ ఎక్స్‌ప్రెస్ సర్వే పేర్కొంది.

కుటుంబ సమేత పర్యాటక ప్రదేశాల ఎంపిక ఇలా..

దేశీయంగా..	దేశం వెలుపల
గోవా	దుబాయ్
న్యూఢిల్లీ	సింగపూర్
ముంబై	మాల్దీవులు
పుదుచ్చేరి	బాలి
జైపూర్	ఫుకెట్
ఊటీ	బ్యాంకాక్
ఉదయ్‌పూర్	ప్యారిస్
బెంగళూరు	కౌలాలంపూర్
చెన్నై	లండన్
మున్నార్	పట్టాయ

ఘనంగా ప్రారంభమైన విటోపియా-2023



వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఐనవోలు (తాడికొండ): పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత యువతరంపై ఉందని పారా ఒలింపిక్స్ ఇండియా వాలీబాల్ ఫెడరేషన్ అధ్యక్షుడు హెచ్.చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం ఐనవోలు వీఐటీ- ఏపీ వర్సిటీలో శనివారం నుంచి ప్రారంభమైన విటోపియా-2023 వార్షిక క్రీడలు,సాంస్కృతిక ఉత్సవానికి ఆయన హాజరయ్యారు. వివిధ రాష్ట్రాల సంస్కృతీ, సంప్రదాయాలు మేళవించేలా 'వసుదైకం' పేరుతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంతర్జాతీయ పారా ఒలింపిక్స్‌కు వాలీబాల్ జట్టు ఎంపికలో పోటీలు నిర్వహించి అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులతో జట్టును ఎంపిక చేశారు. స్టాండ్ అప్ కమెడియన్స్ రాజశేఖర్ మ ఆమిదన్నా, ఆకాష్ గుప్తా నిర్వహించిన కార్యక్రమం అలరించింది. సాయంత్రం వివిధ పోటీలలో విజేతలకు జాతీయ స్థాయి అవార్డు గ్రహీత, కూచిపూడి కళాకారిణి సంధ్యారాజు, తెలుగు చిత్ర పరిశ్రమ మ్యూజిక్ డైరెక్టర్ అనిల్ కశ్యప్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. పద్మశ్రీ కిన్నెర మొగలయ్య గానం అందరినీ ఆకట్టుకుంది. దికిట్ బీట్ బాక్సింగ్ వీఐటీ-ఏపీ వర్సిటీ విద్యార్థుల గాన ప్రదర్శన, గిరిజన నృత్యాలు అలరించాయి. ఇండియన్ ఐడల్ కంటెస్టెంట్ షణ్ముక ప్రియ గానం విద్యార్థులలో హుషారు రేకెత్తించింది. కార్యక్రమంలో అర్జున అవార్డు గ్రహీత,పద్మశ్రీ హెచ్ఎన్ గిరీషా, ధ్యాన్ చంద్ అవార్డు గ్రహీత సుక్బీర్ సింగ్, వర్సిటీ వీసీ డాక్టర్ కోటారెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగిన గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలు

లక్షలాదిగా పాల్గొన్న భక్తులు



గీతాలు ఆలపిస్తున్న బ్రదర్. అబ్రహం, ఫాస్టర్లు జాన్‌వెస్లీ, ఫ్రెడ్డీపాల్, రమేష్, రాజు

గుంటూరు రూరల్: గుంటూరు నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలోని హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరుగుతున్న 46వ గుడారాల పండుగ ప్రత్యేక ప్రార్థనలు మూడో రోజు శనివారం కొనసాగాయి. కొలిమిగుండ్లకు చెందిన పాస్టర్ జేమ్స్ ప్రత్యేక ప్రార్థన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా నంద్యాలకు చెందిన పాస్టర్ అనిల్, హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు బ్రదర్ అబ్రహాం, హోసన్న మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, పాస్టర్ రాజు, పాస్టర్ ఫ్రెడిపాల్, పాస్టర్ రమేష్, తెనాలికి చెందిన పాస్టర్ జాన్‌వెస్లీ, మదనపల్లికి చెందిన పాస్టర్ రాజశేఖర్ ప్రత్యేక ప్రార్థనలు చేసి స్తుతి గీతాలు ఆలపించారు. వివిధ దేశాలనుంచి 5 లక్షల మందికిపైగా భక్తులు పాల్గొన్నారు. భక్తులకు భోజన వసతి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ, పోలీస్, రైల్వే, వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. హోసన్న మినిస్ట్రీస్ పాస్టర్‌లు, సిస్టర్‌ల స్తుతి గీతాలు భక్తులను అలరించాయి.

పాఠం చెబుతూనే ప్రాణం విడిచాడు!

తరగతి గదిలో గుండెపోటుకు గురై కుర్చీలోనే ఉపాధ్యాయుడి మృతి



కుర్చీలోనే ప్రాణాలు కోల్పోయిన వీరబాబు

చీరాల: రోజు మాదిరిగానే ఉదయం పాఠశాల ప్రారంభమైంది. ప్రార్థనా గీతం అనంతరం తరగతి గదిలో ఉపాధ్యాయుడు పాఠం మొదలు పెట్టాడు. ఇంతలోనే తరగతి గది నుంచి ఒక్కసారిగా విద్యార్థుల కేకలు వినబడ్డాయి. సహ ఉపాధ్యాయులు ఏం జరిగిందోనని ఆందోళనతో ఆ తరగతి గదిలోకి వెళ్లగా కుర్చీలో ఉపాధ్యాయుడు అచేతనంగా ఒరిగిపోయి ఉన్నాడు. 108కు సమాచారం అందించగా వారు పరీక్షించి ఉపాధ్యాయుడు మృతి చెందినట్లు చెప్పారు. ఈ విషాద ఘటన బాపట్ల జిల్లా వేటపాలెం మండలం వాకావారిపాలెం ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిగింది. వాకావారిపాలెంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జె.పంగులూరుకు చెందిన పాల వీరబాబు (45) ఉపాధ్యాయుడు. అతడి భార్య కూడా ఇదే మండలంలోని కొండముూరులో ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలు. శనివారం యథావిధిగా పాఠశాలకు వచ్చిన వీరబాబు విద్యార్థులకు పాఠాలు చెబుతూ ఒక్కసారిగా గుండెపోటుకు గురై కుర్చీలోనే మృతి చెందాడు. అప్పటివరకు తమతో మాట్లాడిన తోటి ఉపాధ్యాయుడు ఇకలేరని తెలియడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు కన్నీటిపర్యంతమయ్యారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

వైభవంగా లక్ష మోదక లక్ష్మీగణపతి హవనం



యాగశాలలో హోమాలు నిర్వహిస్తున్న ఆలయ అర్చక వేదపండితులు

యాదమరి(చిత్తూరు జిల్లా): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో రెండోరోజు లక్ష మోదక లక్ష్మీగణపతి హవనం వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం యాగశాలలో కొలువుదీరిన ఉత్సవ మూర్తులకు విశాఖ శారద పీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి ప్రత్యేక పూజలు జరిపి హోమాలు ప్రారంభించారు. ఆలయ అర్చకులు మండపారాధన, మోదక హవనం, మహా నివేదన, మంత్ర పుష్పం, వేదస్వస్తి నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి పుష్కరిణిలో వెలసిన వినాయకుడు, గంగకు శ్రీస్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి పూజలు చేసి హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్ రెడ్డి పాల్గొన్నారు.

సహస్రనామార్చన ఆర్జిత సేవ ప్రారంభం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో నూతనంగా సహస్రనామార్చన ఆర్జిత సేవను విశాఖ శారద పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి మొదటి టికెట్ కొనుగోలు చేసి ప్రారంభించారు. అలాగే ఆలయం వద్ద ఆదివారం పీఆర్వో కార్యాలయం ప్రారంభించనున్నారు.

ఆటో నుంచి రూ.500 నోట్ల వర్షం

మొత్తం రూ.88 వేలు స్వాధీనం చేసుకున్న పోలీసులు



టోల్‌గేట్ సిబ్బంది నుంచి డబ్బును స్వాధీనం చేసుకుంటున్న ఏఎస్ఐ, ఎస్ఐ

నరసన్నపేట: శ్రీకాకుళం జిల్లాలో జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం నోట్ల వర్షం కురిసింది. రోడ్డుపై వెళ్తున్న ఆటో నుంచి రూ.500 నోట్లు ఎగిరాయి. రోడ్డు మీద జలజలా రాలిపడ్డాయి. రోడ్డు మీద ఉన్న వారు కేకలు వేసినా ఆటోడ్రైవర్ ఆగకుండా వెళ్లిపోయాడు. దీంతో స్థానికులు ఆశ్చర్యపోయారు. మడపాం టోల్‌గేట్ వద్ద ఒక ఆటోలో నుంచి రూ.500 నోట్లు కిందకు పడ్డాయి. గమనించిన టోల్‌గేట్ సిబ్బంది ఆటోడ్రైవర్‌ను కేకలు వేశారు. అయినా అతడు వినిపించుకోకుండా వెళ్లిపోవడంతో టోల్‌గేట్ సిబ్బంది రోడ్డుపై పడిన నోట్లను తీసుకున్నారు. పోలీసులకు విషయం తెలియడంతో నరసన్నపేట ఎస్ఐ సింహాచలం టోల్‌గేట్ వద్ద సీసీ ఫుటేజీని పరిశీలించారు. శ్రీకాకుళం నుంచి నరసన్నపేట వైపు వస్తున్న పసుపురంగు ఆటోలో ఇద్దరు పురుషులు, ఒక మహిళ ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వీరిలో పురుషులు మద్యం మత్తులో ఉన్నట్లు సమాచారం. కరజాడ వద్ద నుంచే వీరు నోట్లు విసురుకుంటూ వస్తున్నట్లు తెలిసింది. టోల్‌గేట్ వద్దకు వచ్చే సరికి నోట్ల వర్షం పెరిగింది. ఈ నోట్లు ఎవరివి, ఆ ఆటో ఎవరిది అనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. సీసీ ఫుటేజీలో ఆటో నంబరును గుర్తించారు. ఇవి ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన నోట్లు అనే ప్రచారం జరుగుతోంది. ఒక్క టోల్‌గేటు వద్దే రూ.88 వేలు లభిస్తే.. కరజాడ నుంచి లెక్కిస్తే లక్షల్లో ఉంటుందని భావిస్తున్నారు. ప్రస్తుతానికి రూ.88 వేలను స్వాధీనం చేసుకున్నామని, సోమవారం తహసీల్దార్ కోర్టుకు పంపుతామని, ఎవరైనా క్లెయిమ్ చేయడానికి వస్తే ఆధారాలు చూసి విచారిస్తామని ఎస్ఐ తెలిపారు.

ప్రదీప్ కుటుంబానికి 'ఏఎన్‌యూ' ఆర్థిక సహాయం

రూ.1.10 లక్షలు బ్యాంకు ఖాతాలో జమ



విరాళం పంపిన ప్రతులు చూపిస్తున్న వీసీ ఆచార్య పి రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి కరుణ

ఏఎన్‌యూ: హైదరాబాద్‌లో ఇటీవల కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోయిన బాలుడు ప్రదీప్ కుటుంబానికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వర్గాలు ఆర్థిక సహాయం చేశాయి. యూనివర్సిటీ అధికారులు, సిబ్బంది సమకూర్చిన రూ. రూ.1,10,000/- శనివారం ప్రదీప్ కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య పి.రాజశేఖర్ మాట్లాడుతూ బతుకుదెరువు కోసం వచ్చి బిడ్డను కోల్పోయిన కుటుంబానికి వర్సిటీ అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా ఆర్థిక సాయం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఓఎస్డీ ఆచార్య కె.సునీత, సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, సీడీఈ డైరెక్టర్ ఆచార్య బి.నాగరాజు పాల్గొన్నారు. కాగా, ప్రదీప్ కుటుంబ సభ్యులకు ఏఎన్‌యూ అధికారులు, సిబ్బంది ఆర్థిక సహాయం చేయడంపై సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ ట్విట్టర్ ద్వారా అభినందించారు.

పుణె మెట్రో ప్రాజెక్ట్-3కి 'ఆల్‌స్టోమ్' రైళ్లు

శ్రీసిటీ ప్లాంట్‌లో లాంఛనంగా ఉత్పత్తి ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న పీఐటీసీఎంఆర్ఎల్, ఆల్‌స్టోమ్ ప్రతినిధులు

వరదయ్యపాళెం (తిరుపతి జిల్లా): ప్రయాణసాధనాల తయారీ రంగంలో అగ్రగామిగా ఉన్న శ్రీసిటీలోని ఆల్‌స్టోమ్ ట్రాన్స్‌పోర్ట్ ఇండియా లిమిటెడ్ మరోసారి పుణె ఐటీ సిటీ మెట్రో రైల్ లిమిటెడ్ (పీఐటీసీఎంఆర్ఎల్)తో ఒప్పందం కుదుర్చుకుంది. పుణె మెట్రో ప్రాజెక్ట్-3 కోసం ఆల్‌స్టోమ్ సంస్థ మెట్రో రైళ్లను సరఫరా చేయనుంది. ఈ మేరకు శనివారం శ్రీసిటీలోని ఫ్యాక్టరీలో పీఐటీసీఎంఆర్ఎల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అలోక్ కపూర్ పూజలు చేసి లాంఛనంగా ఉత్పత్తి ప్రారంభించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా పుణెలోని బాలేవాడి నుంచి రాజీవ్‌గాంధీ ఇన్ఫోటెక్ పార్క్‌ను కలుపుతూ శివాజీనగర్ వరకు 23.3 కిలో మీటర్ల దూరం మెట్రో కారిడార్ నిర్మిస్తున్నారు. ఈ మార్గంలో 23 స్టేషన్లు ఉంటాయి. ఈ ప్రాజెక్ట్ కోసం మూడు బోగీలతో కూడిన 66 మెట్రో రైళ్లను ఆల్‌స్టోమ్ సంస్థ తయారు చేస్తుంది. ఇప్పటికే పుణెలో మెట్రో ప్రాజెక్ట్-1, 2లకు ఆల్‌స్టోమ్ రైళ్లు, ఇతర పరికరాలను తయారు చేసి ఇచ్చింది. పీఐటీసీఎంఆర్ఎల్ డైరెక్టర్ నేహా పండిట్, బిజినెస్ సిస్టమ్స్ హెడ్ ఎల్ఎన్ ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ అనిల్‌కుమార్ సైనీ, ఆల్‌స్టోమ్ ట్రాన్స్‌పోర్ట్ ఇండియా అధికారులు పాల్గొన్నారు.

దేశం చూపు..ఆంధ్రా వైపు..

888వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: వికేంద్రీకరణ దిశగా అడుగులు వేస్తున్న ఏపీ ప్రభుత్వానికి విశాఖ కేంద్రంగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో వచ్చిన ఆదరణ చూసి.. నేడు దేశం మొత్తం మన రాష్ట్రం వైపే చూస్తుందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్‌యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 888వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శనివారం పలువురు మాట్లాడారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన పలు సంస్థలు రూ. లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందుచూపు, చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. అమరావతిని రాజధానిగా గుర్తించనందునే బాబు పాలనలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రాలేదని తెలిపారు. విశాఖ కేంద్రంగా ఎగ్జిక్యూటివ్ కేపిటల్ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్న జగనన్న ఉగాది నుంచి పాలన ప్రారంభించి రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తారనడంలో సందేహం లేదని, రాష్ట్ర ప్రజల ఆదరణ ఎప్పటికీ ఆయనకే ఉంటుందని స్పష్టం చేశారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

'రష్యా' నాట్యమయూరి



రష్యాకు చెందిన జూలియా గుసేవా కూచిపూడి నృత్య ప్రదర్శన

తిరుపతి జిల్లా పుత్తూరు పట్టణంలో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమంలో రష్యా దేశానికి చెందిన జూలియా గుసేవా కూచిపూడి నృత్యం ప్రదర్శించి అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆమెను విశ్రాంత ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. మన దేశ సంస్కృతిలో భాగమైన కూచిపూడి నృత్యం నేర్చుకుని ప్రదర్శించిన జూలియా గుసేవాను అభినందించారు.

-పుత్తూరు రూరల్(తిరుపతి జిల్లా)

ఏపీకి సీఎం జగనే బ్రాండ్ అంబాసిడర్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు హనుమంతు నాయక్

సాక్షి, అమరావతి: ఏపీకి సీఎం వైఎస్ జగన్ బ్రాండ్ అంబాసిడర్ అని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు, శ్రీశైలం బోర్డు సభ్యుడు మేరాజోత్ హనుమంతు నాయక్ అన్నారు. జీఐఎస్ ద్వారా రాష్ట్రానికి వెల్లువెత్తిన పెట్టుబడులను ఉద్దేశించి శనివారం ఆయన అమరావతిలోని సచివాలయం వద్ద మాట్లాడారు. ఏపీకి ఇన్ని భారీ పెట్టుబడులు సీఎం జగన్ చరిష్మాతోనే వచ్చాయని, త్వరలో రాష్ట్ర ముఖచిత్రం మారబోతుందన్నారు. ఈ పెట్టుబడులతో ఏపీలో కొత్త పరిశ్రమలు ఏర్పాటై యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. అంబానీ, అదాని, జిందాల్, ఒబెరాయ్, జీఎంఆర్, వంటి పారిశ్రామిక ప్రముఖులు చూపుతున్న శ్రద్ధ, అందిస్తున్న సహకారంపై ప్రశంసలు కురిపించడాన్ని తెలుగు ప్రజలంతా చూశారన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి ఇంత పెద్ద ఎత్తున పెట్టుబడులు గతంలో వచ్చిన దాఖలాలు లేవని ఆయన గుర్తు చేశారు. సీఎం జగన్ నాయకత్వాన్ని పారిశ్రామికవేత్తలు విశ్వసిస్తున్నారని, అందుకే పెట్టుబడుల వరద వచ్చిందన్నారు.

క్లుప్తంగా...

'అయోధ్య' మసీదు నిర్మాణానికి తుది అనుమతులు

అయోధ్య: బాబ్రీ మసీదు– రామ జన్మభూమి వివాదంలో సుప్రీంకోర్టు తీర్పుమేరకు అయోధ్య జిల్లాలో రామమందిరానికి 22 కిలోమీటర్ల దూరంలో ధన్నీపూర్ గ్రామంలో మసీదు నిర్మాణానికి సంబంధించిన తుది అనుమతులను అయోధ్య డివిజనల్ కమిషనర్ మంజూరుచేశారు. అయోధ్య డెవలప్‌మెంట్ అథారిటీ అధీనంలోని ఐదెకరాల ఆ స్థలాన్ని ఇండో–ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ (ఐఐసీఎఫ్)కు బదిలీచేసే అంశం రెండేళ్లుగా పెండింగ్‌లో ఉండటంతో మసీదు నిర్మాణం ఆలస్యమైంది. కొద్దిరోజుల్లో భూ బదిలీ పత్రాలను ఐఐసీఎఫ్‌కు అందిస్తామని అయోధ్య డివిజినల్ కమిషనర్ గౌరవ్ దయాళ్ శనివారం చెప్పారు. ఏప్రిల్ 21న నిర్మాణపనుల ప్రారంభ తేదీని ఖరారుచేస్తామని ఐఐసీఎఫ్ కార్యదర్శి అథర్ హుస్సేన్ చెప్పారు.

త్రిపురలో 8న కొత్త ప్రభుత్వం... ప్రమాణ స్వీకారానికి మోదీ

అగర్తలా: త్రిపుర రాజధాని అగర్తలాలో ఈ నెల 8న జరగనున్న బీజేపీ–ఐపీఎఫ్‌టీ ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరుకానున్నారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో 60 సీట్లకు గాను బీజేపీ 32, మిత్రపక్షం ఒకటి గెలుచుకున్న విషయం తెలిసిందే. మరోసారి సీఎంగా ప్రమాణం చేయనున్న మాణిక్ సాహా శుక్రవారం గవర్నర్‌కు లాంఛనంగా రాజీనామా సమర్పించారు.

రష్యా స్పుత్నిక్–5 టీకా సృష్టించిన సైంటిస్టు హత్య

మాస్కో: రష్యా కోవిడ్ టీకా స్పుత్నిక్–5 సృష్టికర్తల్లో ఒకరైన అగ్రశ్రేణి శాస్త్రవేత్త ఆంద్రీ బొటికోవ్ (47) హత్యకు గురయ్యారు. మాస్కోలోని అపార్టుమెంట్‌లోనే గురువారం గుర్తు తెలియని వ్యక్తులు బెల్టుతో గొంతు నులిమి చంపారు. గమలెయా నేషనల్ రీసెర్చ్ సెంటర్ ఫర్ ఎకాలజీ అండ్ మేథమేటిక్స్‌లో సీనియర్ పరిశోధకుడిగా ఉన్నారు. ఇక్కడే మరో 18 మంది శాస్త్రవేత్తలతో కలిసి 2020లో స్పుత్నిక్ వీ టీకాను రూపొందించారు. హత్యకు పాల్పడిన 29 ఏళ్ల వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు రష్యా ఫెడరల్ దర్యాప్తు కమిటీ శనివారం వెల్లడించింది. ఆంద్రీ బొటికోవ్‌తో చిన్న విషయమై తలెత్తిన తగాదాతోనే ఈ నేరానికి పాల్పడినట్లు అతడు అంగీకరించాడని కూడా తెలిపింది. నిందితుడికి నేర చరిత్ర ఉందని పేర్కొంది. కోవిడ్ వ్యాక్సిన్ కోసం ఎన్నదగిన పరిశోధనలు జరిపిన వైరాలజిస్ట్ ఆంద్రీ బొటికోవ్‌ను 2021లో అధ్యక్షుడు పుతిన్ 'ఆర్డర్ ఆఫ్ మెరిట్ ఫర్ ది ఫాదర్‌లాండ్' పురస్కారంతో సత్కరించారు.

మామా.. చందమామా మరింత దూరమా?

చంద్రునితో భూమికి అవినాభావ సంబంధం. భూమికి ఉపగ్రహమైతే మనకేమో ఏకంగా చంద'మామ'. భూమిపైనా, మనిషితో పాటు జంతుజాలం మీదా చంద్రుని ప్రభావమూ అంతా ఇంతా కాదు. సముద్రంలో ఆటుపోట్లు మొదలుకుని అనేకానేక విషయాల్లో ఆ ప్రభావం నిత్యం కనిపిస్తూనే ఉంటుంది. భూమిపై ప్రాణం ఆవిర్భావానికి చంద్రుడే కారణమన్న సిద్ధాంతమూ ఉంది. మన రోజువారీ జీవితాలను ఎంతగానో ప్రభావితం చేసే పలు కీలక వాతావరణ వ్యవస్థల్లో కూడా భూమి చుట్టూ చంద్రుని కక్ష్య తాలూకు నిర్మితి కీలక పాత్ర పోషిస్తుందని చెబుతారు. అలాంటి చంద్రుడు భూమిపై రోజు తాలూకు నిడివి రోజురోజుకూ పెరిగేందుకు కూడా ప్రధాన కారణమట...!

భూమికి క్రమంగా దూరంగా చంద్రుడు ● ఏటా 3.8 సెం.మీ. జరుగుతున్నాడు
అందుకే రోజు నిడివి పెరుగుతోందట ● ఒకప్పుడు రోజు నిడివి 13 గంటలే!

చాలాకాలం క్రితం. అంటే కొన్ని కోట్ల సంవత్సరాల క్రితం. భూమ్మీద రోజు నిడివి ఎంతుండేదో తెలుసా? ఇప్పుడున్న దాంట్లో దాదాపు సగమే! సరిగ్గా చెప్పాలంటే 13 గంటల కంటే కాస్త తక్కువ!! అప్పట్నుంచీ అది క్రమంగా పెరుగుతూ ఇప్పటికి 24 గంటలకు చేరింది. ఈ పెరుగుదల ఇంకా కొనసాగుతూనే ఉందట! చంద్రుడు క్రమంగా భూమికి దూరంగా జరుగుతుండటమే ఇందుకు కారణమని సైంటిస్టులు తేల్చారు!!


భూమికి చంద్రుడు దూరంగా జరుగుతున్న తీరును శాస్త్ర పరిభాషలో ల్యూనార్ రిసెషన్‌గా పిలుస్తారు. ఇది ఎంతన్నది అపోలో మిషన్లలో భాగస్వాములైన ఆస్ట్రోనాట్లు ఇటీవల దీన్ని కచ్చితంగా లెక్కించారు. చంద్రుడు భూమికి ఏటా 3.8 సెంటీమీటర్ల మేరకు దూరంగా జరుగుతున్నట్టు తేల్చారు. అందువల్లే భూమిపై రోజు నిడివి అత్యంత స్వల్ప పరిమాణంలో పెరుగుతూ వస్తోందట. మహాసముద్రాలతో, అలలతో చంద్రుని సంబంధమే ఇందుకు ప్రధాన కారణమని యూనివర్సిటీ ఆఫ్ లండన్ రాయల్ హోలోవేలో జియోఫిజిక్స్ ప్రొఫెసర్ డేవిడ్ వాల్థాం చెబుతున్నారు. ఆయన భూమి, చంద్రుని మధ్య సంబంధంపై చిరకాలంగా పరిశోధనలు చేస్తున్నారు. ''ఇటు భూమి, అటు చంద్రుడు ఎవరి కక్ష్యలో వారు తిరిగే క్రమంలో చంద్రుని ఆకర్షణ వల్ల మహాసముద్రాల్లో ఆటుపోట్లు (అలల్లో హెచ్చు, తగ్గులు) సంభవిస్తూ ఉంటాయి. సదు అలల ఒత్తిడి భూ భ్రమణ వేగాన్ని అత్యంత స్వల్ప పరిమాణంలో తగ్గిస్తుంటుంది. అలా తగ్గిన శక్తిని చంద్రుడు తన కోణీయ గతి కారణంగా గ్రహిస్తుంటాడు. తద్వారా చంద్రుడు నిరంతరం హెచ్చు కక్ష్యలోకి మారుతూ ఉంటాడు. మరో మాటల్లో చెప్పాలంటే భూమి నుంచి దూరంగా జరుగుతూ ఉంటాడన్నమాట'' అని ఆయన వివరించారు.

అప్పట్లో రోజుకు రెండు సూర్యోదయాలు

''అప్పట్లో, అంటే ఓ 350 కోట్ల ఏళ్ల క్రితం ఇప్పటి రోజు నిడివిలో ఏకంగా రెండేసి సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు జరిగేవి! ఎందుకంటే రోజుకు 12 గంటలకు అటూ ఇటుగా మాత్రమే ఉండేవి. ఈ నిడివి క్రమంగా పెరుగుతూ వచ్చింది, వస్తోంది'' అని జర్మనీలోని ఫ్రెడరిక్ షిల్లర్ యూనివర్సిటీ జెనాలో జియోఫిజిసిస్టుగా చేస్తున్న టామ్ ఈలెన్‌ఫెల్డ్ వివరించారు. మరో విశేషం ఏమిటంటే, భూమికి చంద్రుడు దూరం జరుగుతున్న వేగం కూడా ఎప్పుడూ స్థిరంగా లేదు. అది నిత్యం మారుతూ వస్తోందట. ఉదాహరణకు 60 కోట్ల ఏళ్ల కింద చూసుకుంటే ఆ వేగం ఇప్పటికి రెట్టింపుండేదట. అంటే అప్పుడు చంద్రుడు భూమికి ఏటా సగటున 7 సెంటీమీటర్లు దూరం జరిగేవాడట! అలాగే ఈ వేగంలో భవిష్యత్తులో కూడా మార్పులు చోటుచేసుకుంటాయని ఈలెన్‌ఫెల్డ్ చెబుతున్నారు. ''మహాసముద్రాల, ముఖ్యంగా అట్లాంటిక్ మహాసముద్రపు పరిమాణమే ఇందుకు కారణం కావచ్చు. అది గనక ఇప్పుడున్న దానికంటే కాస్త సన్నగా గానీ, వెడల్పుగా గానీ ఉంటే మూన్ రిసెషన్ వేగంలో పెద్దగా మార్పులుండేవి కావని నా అభిప్రాయం'' అని చెప్పారాయన.

కొసమెరుపు: ఏదెలా ఉన్నా, చంద్రుడు మాత్రం భూమికి ఎప్పటికీ శాశ్వతంగా దూరమైపోడంటూ సైంటిస్టులు భరోసా ఇస్తున్నారు! ''అలా జరిగేందుకు కనీసం మరో 500 నుంచి 1,000 కోట్ల ఏళ్లు పట్టొచ్చు. కానీ అంతకు చాలాముందే సౌర కుటుంబమంతటికీ మహారాజ పోషకుడైన సూర్యుడే లేకుండా పోతాడు! సూర్యునితో పాటే భూమి, మొత్తం సౌరకుటుంబమే ఆనవాలు లేకుండా పోతాయి'' అంటూ వారు చమత్కరించారు!!

– సాక్షి, నేషనల్ డెస్క్



శతాబ్దానికి 1.09 మిల్లీ సెకను పెరుగుతున్న రోజు...

చంద్రుడు క్రమంగా దూరం జరుగుతున్న కారణంగా భూమిపై రోజు నిడివి క్రీస్తుశకం 1,600 నుంచి ప్రతి శతాబ్దానికి సగటున 1.09 మిల్లీసెకన్ల మేరకు పెరుగుతూ వస్తోందని తాజా విశ్లేషణలు తేల్చాయి. ఇది 1.78 మిల్లీసెకన్లని మరికొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. చూట్టానికి మిల్లీసెకన్లే అయినా, 450 కోట్ల భూ పరిణామ క్రమంలో రోజు తాలూకు నిడివిని ఇది ఊహాతీతంగా పెంచిందని సైంటిస్టులు అంటున్నారు. చంద్రుడు ఒకప్పుడు భూమికి ఇప్పటికంటే చాలా చాలా దగ్గరగా ఉండేవాడని ఇప్పటికే నిరూపితం కావడమే ఇందుకు రుజువని చెబుతున్నారు. ఉదాహరణకు చంద్రుడు ప్రస్తుతం భూమికి 2,38,855 మైళ్ల దూరంలో ఉన్నాడు. కానీ 320 కోట్ల ఏళ్ల కింద ఈ దూరం కేవలం 1,70,000 మైళ్లే ఉండేదని పలు అధ్యయనాల్లో తేలింది!

ఢీకొంటున్న కృష్ణబిలాల జంటలు

కృష్ణబిలం. అనంత శక్తికి ఆలవాలం. దాని ఆకర్షణ పరిధిలోకి వెళ్లిన ఏ వస్తువూ తప్పించుకోవడమంటూ ఉండదు. దానిలో కలిసి శాశ్వతంగా కనుమరుగైపోవాల్సిందే. అలాంటి రెండు అతి భారీ కృష్ణబిలాల జంటలు త్వరలో పరస్పరం ఢీకొననున్నాయట! వీటిలో ఒకటి భూమికి 76 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలోని ఏ–బెల్133 అనే మరుగుజ్జు తారా మండల సమూహంలో, మరొకటి 32 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలోని ఏ–బెల్1758ఎస్ అనే మరో మరుగుజ్జు గెలాక్సీలో ఉన్నాయి. నాసా తాలూకు చంద్ర ఎక్స్‌రే అబ్జర్వేటరీ ఈ కృష్ణబిలాలను గుర్తించింది. అంతరిక్షంలో ఇలా భారీ కృష్ణబిలాలు ఢీకొట్టడానికి సంబంధించి మనకు నిదర్శనం లభించడం ఇదే తొలిసారి కానుంది. దీనిద్వారా తొలినాటి విశ్వంలో కృష్ణబిలాల వృద్ధి, మరుగుజ్జు గెలాక్సీల ఎదుగుదల తదితరాలకు సంబంధించి కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని నాసా భావిస్తోంది. ఆ రెండు మరుగుజ్జు గెలాక్సీల పరిమాణం 3 కోట్ల సూర్యుల సమష్టి ద్రవ్యరాశికి సమానం. అంటే మన పాలపుంత కంటే 20 రెట్లు తక్కువ! ఇలాంటి మరుగుజ్జు గెలాక్సీలు పరస్పరం కలిసిపోయి మనమిప్పుడు చూస్తున్న భారీ గెలాక్సీలుగా రూపొంది ఉంటాయని సైంటిస్టులు భావిస్తున్నారు.



శరవేగంగా విస్తరిస్తున్న తొలినాటి కృష్ణబిలం

తొలినాటి విశ్వానికి చెందినదిగా భావిస్తున్న ఓ భారీ కృష్ణబిలాన్ని అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ సైంటిస్టులు తాజాగా కనిపెట్టారు. ఇది ఊహాతీత వేగంతో విస్తరిస్తోందట. బహుశా అప్పట్లో అత్యంత భారీ కృష్ణబిలం ఇదే కావచ్చని వారు అభిప్రాయపడుతున్నారు. దీన్ని లోతుగా పరిశోధిస్తే విశ్వావిర్భావపు తొలి నాళ్లలో భారీ నక్షత్ర మండలాలతో పాటు అతి భారీ కృష్ణ బిలాల ఆవిర్భావంపై మరిన్ని కీలక వివరాలు తెలిసే వీలుందని చెబుతున్నారు. ఈ కృష్ణ బిలం సీఓఎస్–87259గా పిలుస్తున్న ఓ గెలాక్సీ తాలూకు కేంద్ర స్థానంలో నెలకొని ఉంది. చిలీలోని అటకామా లార్జ్ మిల్లీమీటర్ అరే (ఏఎల్ఎంఏ) రేడియో అబ్జర్వేటరీ ద్వారా ఈ కృష్ణ బిలం జాడ కనిపెట్టారు. ఇది మన పాలపుంత కంటే ఏకంగా వెయ్యి రెట్లు ఎక్కువ వేగంతో నక్షత్రాలకు జన్మనిస్తోందట! సూర్యుని వంటి వంద కోట్ల నక్షత్ర ద్రవ్యరాశులకు ఇది ఆలవాలమట. దీని తాలూకు ప్రకాశం వల్ల సీఓఎస్–87259 గెలాక్సీ అంతరిక్షంలో అత్యంత ప్రకాశవంతంగా వెలిగిపోతూ కనువిందు చేస్తోందట! ఈ అధ్యయన ఫలితాలను రాయల్ ఆస్ట్రనామికల్ సొసైటీ తాలూకు జర్నల్ మంత్లీ నోటీసెస్‌లో ప్రచురించారు.

రక్షణ బడ్జెట్ పెంపు దిశగా చైనా

బీజింగ్: అమెరికాకు దీటుగా సైనిక సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా చైనా మరో అడుగు ముందుకేసింది. 'దేశ రక్షణ బడ్జెట్‌ను పెంచుతున్నాం. ఆ మొత్తం ఎంత అనేది ఆదివారం జరగబోయే చైనా పార్లమెంట్ సమావేశాల్లో వెల్లడిస్తాం' అని ఆ దేశ పార్లమెంట్ అధికార ప్రతినిధి వాంగ్ చావో శనివారం చెప్పారు. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 7.1 శాతం అధికంగా గత ఏడాది చైనా రక్షణ బడ్జెట్ కోసం 230 బిలియన్ డాలర్లను కేటాయించింది. 777.1 బిలియన్ డాలర్ల రక్షణ బడ్జెట్‌తో ప్రపంచంలో అమెరికా అగ్రస్థానంలో కొనసాగుతున్న విషయం తెల్సిందే. మరోవైపు భారత రక్షణ బడ్జెట్ కంటే చైనా రక్షణ బడ్జెట్ మూడు రెట్లు మించి ఉండటం గమనార్హం. 'చైనా అంతర్జాతీయంగా చవిచూస్తున్న సంక్లిష్ట భద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు బడ్జెట్ పెంచడం అనివార్యం' అని వాంగ్ చావో వ్యాఖ్యానించారు. మరోవైపు శనివారం చైనా పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. వారంపాటు జరగబోయే ఈ సమావేశాల్లో జిన్‌పింగ్ నాయకత్వంలో కొనసాగే నూతన మంత్రివర్గాన్ని, ప్రధానమంత్రి లీ కెక్వియాంగ్ స్థానంలో నూతన ప్రధానిని ప్రకటిస్తారు. నాయకత్వ మార్పులో భాగంగా ప్రతి పదేళ్లకోసారి జరిగే ఈ 'రబ్బర్‌స్టాంప్' తంతులో కొలువుతీరే కొత్త వారంతా దాదాపు జిన్‌పింగ్ ఆజ్ఞలను శిరసావహించేవారే. రెండు సెషన్లుగా జరిగే పార్లమెంట్ భేటీలో దశలవారీగా మొత్తంగా 5,000 మంది పాల్గొంటారు. ప్రధానిగా లీ కెక్వియాంగ్ స్థానంలో లీ క్వియాంగ్‌ను ఎంపికచేసినట్లు వార్తలొచ్చాయి.

పులుల మరణాలపై నివేదిక ఇవ్వండి

కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: దేశంలో అభయారణ్యాల్లో పులుల మరణాలపై మూడు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. పెద్ద సంఖ్యలో పులులు చనిపోతున్నాయంటూ వచ్చిన వార్తా కథనాలపై జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్నల ధర్మాసనం ఈ మేరకు స్పందించింది. దేశవ్యాప్తంగా పులుల సంఖ్య తగ్గిపోతున్నందున వాటిని రక్షించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై ధర్మాసనం ప్రస్తుతం విచారణ జరుపుతోంది. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ(ఎన్‌టీసీఏ) గణాంకాల ప్రకారం..దేశంలో 2012 నుంచి ఇప్పటి వరకు 1,059 పులులు మరణించాయి. వీటిలో ఏకంగా 270 పులులు టైగర్ స్టేట్‌గా పేరున్న మధ్యప్రదేశ్‌లోనివే కావడం గమనార్హం.

టాప్ గేర్‌లో మౌలికాభివృద్ధి

- అప్పుడే 2047కల్లా సంపన్న భారత్
- బడ్జెట్ అనంతర వెబినార్‌లో మోదీ

న్యూఢిల్లీ: ఆర్థికవ్యవస్థకు చోదక శక్తి అయిన మౌలిక వసతుల అభివృద్ధిని శరవేగంగా కొనసాగించాలని ప్రధాని మోదీ అభిలషించారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టాక కొనసాగిస్తున్న వెబినార్ పరంపరలో శనివారం మోదీ ' ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్: ఇంప్రూవింగ్ లాజిస్టిక్ ఎఫిషియెన్సీ విత్ పీఎం గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్' అనే అంశంపై వర్చువల్‌గా మాట్లాడారు. ' దేశ ఆర్థికరంగ ప్రగతికి పటిష్ట మౌలిక వసతులే చోదక శక్తి. మౌలికాభివృద్ధి టాప్‌గేర్‌లో కొనసాగితేనే 2047 సంవత్సరంకల్లా భారత్ సంపన్న దేశంగా అవతరించగలదు' అని ఈ రంగం కోసం కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న పలు చర్యలను ఆయన ప్రస్తావించారు. ' 2013–14 బడ్జెట్ కేటాయింపులతో పోలిస్తే ఈసారి ఈ రంగం అభివృద్ధికి ఐదు రెట్లు ఎక్కువగా నిధులు కేటాయించాం. భవిష్యత్తులో రూ.110 లక్షల కోట్ల నిధులు కేటాయిస్తాం. ఈ రంగంలోని ప్రతీ భాగస్వామ్య పక్షం కొత్త బాధ్యతలు, కొత్త సానుకూలతలు, దృఢ నిర్ణయాలు తీసుకోవాల్సిన తరుణమిది. రోడ్లు, రైల్వేలు, నౌకాశ్రయాలు, విమానాశ్రయాల్లో అధునాతన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. దీంతో వ్యాపార అవకాశాలు ఊపందుకుంటాయి. రవాణా ఖర్చు దిగొస్తుంది. ఈ దేశమైనా వృద్ధిలోకి రావాలంటే మౌలికవసతుల కల్పన చాలా కీలకం. ఈ రంగంపై అవగాహన ఉన్నవారికి ఇది బాగా తెలుసు' అంటూ పలు భారతీయ నగరాల విజయాలను ఆయన ప్రస్తావించారు.

రెట్టింపు స్థాయిలో రహదారుల నిర్మాణం

'2014తో చూస్తే ఇప్పుడు సగటున ఏడాదికి నిర్మిస్తున్న జాతీయ రహదారుల పొడవు రెట్టింపైంది. 600 రూట్ల కిలోమీటర్లలో ఉన్న రైల్వే విద్యుదీకరణ ఇప్పుడు 4,000 రూట్ల కిలోమీటర్లకు అందుబాటులోకి వచ్చింది. 74 ఎయిర్‌పోర్టులుంటే ఇప్పుడు 150కి పెరిగాయి. నైపుణ్యాభివృద్ధి, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, ఆర్థిక నైపుణ్యాలు, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మరింతగా పెరగాలి'' అని మోదీ సూచించారు.

ప్రగతి పథంలో భారత్

బిల్‌గేట్స్ ప్రశంసల వర్షం

ఆరోగ్యం, అభివృద్ధి, వాతావరణం తదితర రంగాల్లో భారత్ సాధించిన ప్రగతిని కుబేరుడు, భూరి దాత బిల్ గేట్స్ పొగిడారు. భారత ప్రభుత్వం నూతన ఆవిష్కరణల కోసం పెద్ద ఎత్తున పెట్టుబడులను కేటాయిస్తే భవిష్యత్తులో భారత్ మరింతగా సర్వతోముఖాభివృద్ధిని సాధించగలదని ఆయన అభిలషించారు. 'సురక్షిత, ప్రభావవంతమైన, అందుబాటు ధరలో వందలకోట్ల వ్యాక్సిన్ డోస్‌లు తయారుచేసే సత్తాను భారత్ సాధించడం గొప్పవిషయం. కోవిడ్ విపత్తు కాలంలో కోవిడ్ టీకాలను అందించి ప్రపంచవ్యాప్తంగా లక్షల జీవితాలను భారత్ కాపాడగలిగింది. పలు రకాల వ్యాధుల బారిన పడకుండా ఇతర వ్యాక్సిన్లనూ సరఫరాచేసింది. 'శుక్రవారమే ప్రధాని మోదీని కలిశాను. సుస్థిర జగతి కోసం ఆయన చేస్తున్న కృషి కనిపిస్తోంది. సృజనాత్మకతతో నిండిన భారత్‌లో పర్యటించడం ఎంతో ప్రేరణ కల్గిస్తోంది' అని బిల్‌గేట్స్ ట్వీట్‌చేశారు. 'కోవిడ్ సంక్షోభ కాలంలో 30 కోట్ల మందికి భారత్ అత్యవసర డిజిటల్ చెల్లింపులు చేసింది. సమ్మిళిత ఆర్థికవ్యవస్థకు పెద్దపీట వేసింది. 16 కేంద్ర ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ గతి శక్తి కార్యక్రమం ద్వారా రైల్వే, జాతీయరహదారులు వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను సమీక్షిస్తూ ఇంజనీర్లు, శాస్త్రవేత్తలతో క్రియాశీలకంగా పనిచేయించడం డిజిటల్ టెక్నాలజీ వల్లే సాధ్యమైంది. కో–విన్, ఆధార్ సహా పలు కీలక ఆవిష్కరణలతో సాధించిన పురోగతిని ప్రపంచానికి చాటే అద్భుత అవకాశం భారత్‌కు జీ20 సారథ్య రూపంలో వచ్చింది. తృణధాన్యాలపై అవగాహన కోసం తీసుకుంటున్న చొరవ, చిరుధాన్యాల ఆహారం అమోఘం'' అని గేట్స్ అన్నారు.


మోదీతో బిల్‌గేట్స్

కేంద్ర ఉద్యోగుల్లో కొందరికి పాత పెన్షన్

న్యూఢిల్లీ: జాతీయ పెన్షన్ విధానం(ఎన్‌పీఎస్) అమల్లోకి వచ్చిన 2003 డిసెంబర్ 22వ తేదీకి ముందే ఉద్యోగంలో చేరిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 'పాత పెన్షన్' స్వీకరించే అవకాశం పొందారు. అంటే ఆ తేదీ కంటే ముందే రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్/అడ్వర్‌టైజ్ చేసిన పోస్టుల్లో చేరిన ఉద్యోగులు మాత్రమే పాత పెన్షన్ పథకంలో చేరడానికి అర్హులు. ఈ పథకంలో చేరేందుకు వన్–టైమ్ ఆప్షన్ ఎంచుకోవాలని సూచిస్తూ కేంద్ర సిబ్బంది శాఖ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. 'ఎన్‌పీఎస్ నోటిఫికేషన్‌కు ముందే ప్రకటించిన పోస్టులు/ఖాళీలకు అనుగుణంగా ఎంపికైనందున పాత పెన్షన్ స్కీమ్‌ను తమకు వర్తింపజేయాలని 2003 డిసెంబర్ 22కు ముందు కేంద్ర ఉద్యోగాల్లో చేరిన వారి వినతులు మాకు అందాయి. పలు రాష్ట్రాల హైకోర్టులు, కేంద్ర పరిపాలనా ట్రిబ్యూనళ్లు వెలువర్చిన తీర్పులు, ఆ ఉద్యోగుల అభ్యర్థనమేరకు ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఉత్వర్వులో కేంద్రం పేర్కొంది.

సిసోడియా కస్టడీ 2 రోజులు పొడిగింపు

న్యూఢిల్లీ: మద్యం విధానం కేసులో అరెస్టయిన ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా సీబీఐ కస్టడీని కోర్టు మరో రెండు రోజులు పొడిగించింది. సిసోడియాను సోమవారం తమ ఎదుట హాజరుపరచాలని సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి నాగ్‌పాల్ శనివారం ఆదేశించారు. సిసోడియాకు కోర్టు విధించిన మూడు రోజుల కస్టడీ శనివారంతో ముగిసింది. దీంతో సీబీఐ శనివారం ఆయన్ను రౌస్ అవెన్యూ కోర్టు ఎదుట హాజరు పరిచింది. సిసోడియాను మరో మూడు రోజుల కస్టడీకి అప్పగించాలని న్యాయమూర్తిని కోరింది. ఇందుకు సిసోడియా తరఫు న్యాయవాది అభ్యంతరం తెలిపారు. సిసోడియా బెయిల్ పిటిషన్‌పై ఈ నెల 10వ తేదీన విచారణ చేపడతామని, ఆలోగా ఈ అంశంపై సమాధానం ఇవ్వాలని జడ్జి సీబీఐని ఆదేశించారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కోర్టు ఆవరణ వెలుపల ఆప్ కార్యకర్తలు సిసోడియా అరెస్టును నిరసిస్తూ నినాదాలు చేశారు.

కర్ణాటకలో ఒక్క ఛాన్సివ్వండి: కేజ్రీవాల్

దావణగెరె: అవినీతి రహిత పాలన అందించే ఆమ్ ఆద్మీ పార్టీకి ఒక్క అవకాశమివ్వాలని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కర్ణాటక ప్రజలను కోరారు. తాము అధికారంలోకి వస్తే ఉచిత విద్య, విద్యుత్తు, ప్రభుత్వ పాఠశాలలు, మంచి ఆరోగ్య వసతులు ప్రజలకు కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని మార్చేందుకు అవకాశమివ్వాలని కోరారు. శనివారం దావణగెరెలో జరిగిన బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. అవినీతిపై కఠినంగా వ్యవహరిస్తామని, పంజాబ్‌లోని తమ ప్రభుత్వం ఒక ఎమ్మెల్యేను, ఒక మంత్రిని అవినీతి ఆరోపణలపై జైలుకు పంపించిందని చెప్పారు. రాష్ట్రంలో 40% కమీషన్ ప్రభుత్వం పనిచేస్తోందంటూ బీజేపీ పాలనపై విరుచుకుపడ్డారు. మళ్లీ అధికారమిస్తే అవినీతి లేకుండా చేస్తామంటున్న హోం మంత్రి అమిత్ షా.. తన నాలుగేళ్లలో ఆ పని ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. లోకాయుక్త అధికారులు రెండు రోజుల క్రితం బీజేపీ ఎమ్మెల్యే కుమారుడి ఇంట్లో కోట్లాది రూపాయలను స్వాధీనం చేసుకోవడంపై ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఆ ఎమ్మెల్యేను, అతడి కుమారుడిని అరెస్ట్ చేయలేదు. కానీ, ఢిల్లీలో మా నేత సిసోడియాను అరెస్ట్ చేశారు'అంటూ బీజేపీ తీరుపై మండిపడ్డారు. కర్ణాటకలో డబుల్ ఇంజిన్ సర్కారుతో అవినీతి కూడా రెట్టింపయ్యిందని ఎద్దేవా చేశారు.

అన్యాయంపై పోరాటానికి 'ఇన్సాఫ్'

నూతన వేదికను ఏర్పాటు చేసిన ఎంపీ కపిల్ సిబల్

న్యూఢిల్లీ: దేశంలో అడుగడుగునా జరుగుతున్న అన్యాయాలపై పోరాడేందుకు 'ఇన్సాఫ్'అనే వేదికను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రముఖ లాయర్, రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ ప్రకటించారు. తన ప్రయత్నానికి ప్రతిపక్ష పార్టీలకు చెందిన ముఖ్యమంత్రులు, నేతలు సహా ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరారు. తనకు ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు లేవని స్పష్టం చేశారు. దేశంలో పౌరులకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ప్రభుత్వం అధికారంలో ఉందని ఆయన ఆరోపించారు. ప్రధాని మోదీని సంస్కరించడమే తప్ప, విమర్శించడం తమ ఉద్దేశం కాదని చెప్పారు. ప్రతి ఒక్కరికీ ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం సమకూరాలని రాజ్యాంగం చెబుతున్నా, అన్ని చోట్లా అన్యాయమే జరుగుతోందన్నారు.



మంచు గుప్పెట్లో కాలిఫోర్నియా

కాలిఫోర్నియా రాష్ట్రంలోని క్రిస్ట్‌లైన్ పట్టణంలో మంచుతో నిండిపోయిన ఒక వ్యాపార సముదాయం. టెక్సాస్, లూసియానా, కెంటకీ రాష్ట్రాల్లో మంచు తుపాను బీభత్సం కొనసాగుతోంది. టెన్నిసీలో దాదాపు 2లక్షల మంది రాత్రిళ్లు విద్యుత్‌లేక అంధకారంలో ఉండిపోయారు.

బిహార్ కార్మికులూ మా కార్మికులే

బిహార్ సీఎం నితీశ్‌కు తెలిపిన తమిళనాడు సీఎం స్టాలిన్

సాక్షి, చెన్నై: తమిళనాడులోని వలస కార్మికులంతా సురక్షితంగా ఉన్నారని ఆ రాష్ట్ర సీఎం స్టాలిన్ బిహార్ సీఎం నితీశ్ కుమార్‌కు తెలిపారు. తమిళనాడు అభివృద్ధికి తోడ్పాటునిస్తున్న కార్మికులంతా తమ వాళ్లేనని, వారికి ఎటువంటి హాని జరగనివ్వబోమని హామీ ఇచ్చారు. అదేవిధంగా, రాష్ట్ర అభివృద్ధికి ఆటంకం కలుగనివ్వమన్నారు. వదంతులు వ్యాప్తి చేస్తూ భయాందోళనలు సృష్టించే వారిపై తక్షణమే చర్యలు తీసుకుంటామని చెప్పారు. తమిళనాడులో బిహార్, జార్ఖండ్ వలస కార్మికులపై దాడులు జరుగుతున్నాయంటూ సోషల్ మీడియాలో వస్తున్న కథనాల నేపథ్యంలో స్టాలిన్ శనివారం నితీశ్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గౌరవనీయ సోదరుడు నితీశ్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు అందులో చెప్పారు. బిహార్ సహా ఉత్తరాది వలస కార్మికుల భద్రతపై ఆయనకు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. బిహార్‌కు చెందిన ఒక జర్నలిస్ట్ తమిళనాడులో వలసకార్మికులపై దాడులపై ఒక ఫేక్ వీడియోను మొదట ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. వలస కార్మికులు పేర్లు నమోదు చేసుకునేందుకు వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు.


సేలం రైల్వే స్టేషన్‌లో రిజర్వేషన్ బోగీల్లో ఎక్కిన వలస కార్మికులను కిందికి దించుతున్న పోలీసులు

కార్మికులకు నచ్చజెప్పిన పోలీసులు

ఉత్తరాది వలస కార్మికులపై దాడుల పుకార్ల నేపథ్యంలో పెద్ద సంఖ్యలో వలస కార్మికులు భయంతో స్వస్థలాలకు బయలు దేరారు. దీంతో బస్, రైల్వే స్టేషన్లు నిండిపోయాయి. రిజర్వేషన్ రైలు బోగీల్లో కార్మికులు పెద్దఎత్తున ఎక్కడంతో శనివారం వారికి పోలీసులు నచ్చజెప్పి కిందికి దించివేశారు. కాగా, ఈ వ్యవహారంపై బిహార్, జార్ఖండ్ ప్రభుత్వాలు తమిళనాడు అధికారులతో సంప్రదింపులు జరిపాయి. అలాగే ఉన్నతాధికారులతో కూడిన ప్రత్యేక బృందాలు తమిళనాడుకు శనివారం చేరుకుని క్షేత్ర స్థాయిలో పరిస్థితులను పరిశీలించాయి. కాగా, వదంతుల వీడియోలకు సంబంధించి పోలీసులు బీజేపీ అధికార ప్రతినిధులు తదితరులపై కేసులు నమోదు చేశారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

ఆదివారం । 5 । మార్చి । 2023



రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు

గుడివాడలో రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే కొడాలి నాని తెలిపారు. టిడ్కో ఇళ్ల పనులను ఆయన శనివారం కృష్ణా జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాతో కలిసి పరిశీలించారు. ▸8లో




తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు

పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ చిన్న తిరునాళ్లకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని డీసీపీ మేరీ ప్రశాంతి తెలిపారు. పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు గ్రామాల్లో ఆమె శనివారం పర్యటించారు.

నేడు సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి: సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం ఉదయం 9 గంటలకు సూర్యోపాసన సేవ జరుగుతుంది. ఈ ఆర్జిత సేవలో భక్తులు పాల్గొనవచ్చు.



న్యూస్‌రీల్

ఏప్రిల్ 2న జీతే రన్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విశ్వశాంతిని కాంక్షిస్తూ జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ రెండో తేదీన జీతే రన్ (అహింస మారథాన్) నిర్వహిస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అహింస మారథాన్ వాల్ పోస్టర్‌ను శనివారం తన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ విశ్వశాంతిని కోరుతూ ప్రపంచ వ్యాప్తంగా పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఆర్గనైజేషన్ విజయవాడ చాప్టర్ చీఫ్ సెక్రటరీ మనీష్ దోషి మాట్లాడుతూ.. అహింస రన్‌లో పాల్గొనదలచిన ఔత్సాహికులు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94402 80906 సెల్ నంబరులో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ చైర్మన్ అశోక్ గోలీఛా, మహిళా విభాగం చైర్మన్ తృప్తి జైన్, చీఫ్ సెక్రటరీ సంగీత సీనావర్త్, మీడియా కోఆర్డినేటర్ ప్రవీణ్ రంత, జైన్ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ హుండీ ఆదాయం రూ.1.13 కోట్లు

పెనుగంచిప్రోలు(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి హుండీ కానుకల ద్వారా నగదు రూపంలో సుమారు రూ.1.13 కోట్ల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ జి.వి.డి.ఎన్.లీలాకుమార్ తెలిపారు. హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను ఆలయ ఆవరణలో శనివారం లెక్కించారు. రూ.1,12,92,200 నగదు, విదేశీ నగదు 248 డాలర్లు, 87 గ్రాముల బంగారం, 900 గ్రాముల వెండి వచ్చిందని ఈఓ తెలిపారు. 95 రోజులకు గాను ఈ ఆదాయం సమకూరిందని పేర్కొన్నారు. కానుకల లెక్కింపులో ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, దేవదాయ శాఖ నందిగామ డివిజన్ తనిఖీదారు కె.అనురాధ పాల్గొన్నారు.

98.88 శాతం మందికి పింఛన్ కానుక



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో మొదటి నాలుగు రోజుల్లో వైఎస్సార్ పెన్షన్ కానుక 98.88 శాతం మంది లబ్ధిదారులకు అందింది. జిల్లాలో మొత్తం 2,29,358 మంది లబ్ధిదారులు ఉన్నారు. శనివారం సాయంత్రానికి 2,26,778 మందికి పింఛన్లు అందాయి. అత్యధికంగా జి.కొండూరు మండలంలో 99.21 శాతం మేర పింఛన్ల పంపిణీ జరిగింది. ఇబ్రహీంపట్నం మండలంలో 99.15 శాతం, రెడ్డిగూడెంలోఓ 99.11 శాతం, వీరులపాడు మండలం 99.11 శాతం మేర పింఛన్ల పంపిణీ జరిగింది.

నెమలి ఆలయానికి రూ.8.29 లక్షల ఆదాయం

గంపలగూడెం(తిరువూరు): మండలంలోని నెమలి గ్రామంలో వేంచేసిన శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానంలో హుండీ కానుకలను శనివారం లెక్కించారు. జనవరి నుంచి ఇప్పటి వరకు రూ.8,29,274 ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ డి.శ్రీరామవర ప్రసాదరావు తెలిపారు. కానుకల లెక్కింపు కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ చైర్మన్ కావూరి శశిరేఖ, ధర్మకర్తల మండలి సభ్యులు నూకల నాగలక్ష్మణరావు, తోటకూర వీరప్రసాద్, కుంభగిరి వెంకటకృష్ణ, తిరువూరు గ్రూపు దేవాలయాల మేనేజరు జున్ను వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌కు తుది మెరుగులు

- రూ.1,373 కోట్లతో వీఎంసీ బడ్జెట్
- రెవెన్యూ ఆదాయం రూ.859 కోట్లు
- క్యాపిటల్ ఆదాయం రూ.444.43 కోట్లు
- రెవెన్యూ ఖర్చు రూ.697.76 కోట్లు
- 9న బడ్జెట్ సమావేశం నిర్వహణకు కసరత్తు



విజయవాడ నగరపాలక సంస్థ కార్యాలయం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు పాలకులు ప్రణాళిక రచించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 64 డివిజన్లలో అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా రూ.1,373.26 కోట్లతో 2023–24 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను అధికారులు రూపొందించారు. ఫిబ్రవరి 28వ మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వీఎంసీలో 2023–24 వార్షిక బడ్జెట్‌పై స్థాయీ సంఘ సభ్యులతో సమీక్షించి ఆమోదించారు. ఈ నెల తొమ్మిదో తేదీన మునిసిపల్ కౌన్సిల్‌లో బడ్జెట్ సమావేశం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

బడ్జెట్‌లో ముఖ్యాంశాలు ఇవీ..

విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ (వీఎంసీ)కు 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,373.26 కోట్ల ఆదాయం సమకూరుతుందని బడ్జెట్ అంచనాలు రూపొందించారు. రెవెన్యూ ఆదాయం రూ.859.12 కోట్లు, క్యాపిటల్ ఆదాయం రూ.444.43 కోట్లు, డిపాజిట్లు అడ్వాన్సుల రూపంలో రూ.69.71 కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నారు. మొత్తం రెవెన్యూ ఆదాయం రూ.859.12 కోట్లు. అందులో పన్నుల రూపేణా రూ.303 కోట్లు, అసైన్డ్ రెవెన్యూ రూ.44.32 కోట్లు వస్తుందని భావిస్తున్నారు. పట్టణ ప్రణాళిక, ఇతర ఆదాయాల్లో రూ.63.12 కోట్లు, లైసెన్స్ ఫీజులు, అడ్మినిస్ట్రేటివ్ చార్జీల రూపంలో రూ.22.62 కోట్లు, వీఎంసీ ఆస్తుల అద్దెల ద్వారా రూ.12.07 కోట్లు, మార్కెటింగ్, రెమ్యునరేటివ్‌తో రూ.40.37 కోట్లు, తాగునీటి పన్ను, యూజీడీ చార్జీల ద్వారా రూ.66.22 కోట్లు, ఇతర మార్గాల్లో రూ.308.40 కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా వేశారు. క్యాపిటల్ ఆదాయం రూ.444.43 కోట్లతో అంచనాలు రూపొందించగా, అందులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యల పరిష్కారానికి రూ.52.16 కోట్లు జీజీఎంపీ గ్రాంట్ నుంచి వస్తుందని అధికారులు పొందుపరిచారు. ఎయిర్‌పోర్టు కారిడార్ నిర్మాణానికి గత ఏడాది రూ.10.57 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాగా ఈ ఏడాది మరో రూ.9 కోట్లు రావొచ్చని అంచనాలు రూపొందించారు.

డిస్ట్రిక్‌మినరల్ ఫౌండేషన్ నుంచి రూ.6.10 కోట్లు, రిటైనింగ్ వాల్ బ్యూటిఫికేషన్‌కు రూ.6.23 కోట్ల నిధులు ప్రభుత్వం నుంచి సమకూరనున్నాయి. జగనన్న కాలనీల్లో మౌలిక వసతులకు ఏపీఎస్‌హెచ్‌సీఎల్ నుంచి గత ఏడాది రూ.6.65 కోట్లు రాగా ఈ ఏడాది రూ.20 కోట్లు సమకూరుతాయని అధికారులు బడ్జెట్ అంచనాల్లో పొందుపరిచారు.

మరి కొన్ని ప్రధానాంశాలు

- ఖాళీస్థలాల పన్నులపై గత ఏడాది రూ.16 కోట్లు వస్తాయని అంచనాలు రూపొందించగా రూ.22 కోట్ల మేర ఆదాయం వచ్చింది. ఈ ఏడాది రూ.24 కోట్లు వచ్చే అవకాశం ఉందని బడ్జెట్‌లో పొందుపరిచారు.
- జనరల్ పన్నుల్లో గత ఏడాది రూ.164.65 కోట్లు కాగా ఈ ఏడాది పన్నులు వసూళ్లు మరింత సమర్థవంతంగా నిర్వహిస్తున్నందున రూ.197.59 కోట్లు వస్తాయని అంచనాలు వేశారు.
- భవన నిర్మాణాలతో లైసెన్స్ ఫీజులు, ఇతర అధనపు ఫీజుల్లో 2022–23 ఏడాదికి రూ.36.78 కోట్లు రాగా ఈ ఏడాది రూ.50.39 కోట్లు వస్తాయని అంచనాలు రూపొందించారు.
- షాపింగ్ కాంప్లెక్స్‌లు, భవనాలు, క్యాంటీన్ల అద్దెల నుంచి గత ఏడాది వార్షిక బడ్జెట్‌లో రూ.24 కోట్లు ఆదాయం సమకూరగా ఈ ఏడాది రూ.27 కోట్లు రావచ్చని అధికారులు అంచనాలు రూపొందించారు.
- వీధి దీపాల నిర్వహణకు గత ఏడాది రూ.7.5 కోట్లు ఖర్చు చేస్తే ఈ ఏడాది రూ.10 కోట్లు ఖర్చు చేయటానికి బడ్జెట్‌లో అంచనాలు చేశారు.
- బ్రిడ్జిలు, సబ్‌వేలు, ఫ్లై ఓవర్ల నిర్వహణకు 2022–23 ఏడాదికి రూ.50 లక్షలు మాత్రమే వెచ్చించగా ఈ ఏడాది రూ.2.16 కోట్లు ఖర్చు చేసేందుకు బడ్జెట్‌లో అంచనాలు రూపొందించారు.

ఖర్చులు ఇలా..

2023–24 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ ఖర్చు రూ.697.76 కోట్లుగా అంచనా వేశారు. క్యాపిటల్ ఖర్చు రూ.634.31 కోట్లు, లోన్ రీపేమెంట్లకు రూ.18.12 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్స్‌ల రూపంలో రూ.69.71 కోట్లు ఖర్చు చేయడానికి అంచనాలు రూపొందించారు.

నేడు సైకిల్ ర్యాలీలు

- వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహణ
- మహిళల మానసిక ఆరోగ్యమే లక్ష్యం



డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడ తూర్పు): మహిళల మానసిక ఆరోగ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాల్లో భాగంగా మహిళల మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించాయి. అందులో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మహిళల మానసిక ఆరోగ్యం నినాదంతో ఆదివారం సైకిల్ ర్యాలీలు నిర్వహించనున్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిలాల్లోని ప్రతి పట్టణ, గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఈ సైకిల్ ర్యాలీలు జరుగుతాయి. విజయవాడలో పాత ప్రభుత్వాస్పత్రి నుంచి రైల్వే స్టేషన్ జంక్షన్ వరకూ సైకిల్ ర్యాలీ కొనసాగుతుంది. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల ఒకటో తేదీ నుంచి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని తెలిపారు. అందులో భాగంగా ఆదివారం సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

మాదక ద్రవ్యాల కట్టడి లక్ష్యం కావాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక

చిలకలపూడి(మచిలీపట్నం): మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక సూచించారు. మాదక ద్రవ్యాల కట్టడి ప్రతిఒక్కరి లక్ష్యం కావాలన్నారు. జిల్లా పరిషత్ కన్వెన్షన్‌హాలులో జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కృష్ణాజిల్లా పరిపాలనా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో మాదక ద్రవ్య బాధితులకు న్యాయసేవలు, మాదకద్రవ్య ముప్పు నివారణ, పిల్లల రక్షణ కోసం స్నేహపూర్వక న్యాయసేవలపై నూతన తరహా న్యాయసేవా శిబిరాన్ని శనివారం నిర్వహించారు. తొలుత ఈ కార్యక్రమాన్ని ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పలు పథకాలను వివరించేందుకు ఇటువంటి న్యాయసేవల శిబిరాలు దోహదపడతాయన్నారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, బాల్యవివాహాల కట్టడికి తీసుకోవాల్సిన చర్యలను తెలపడం ఈ శిబిరం ముఖ్య ఉద్దేశమన్నారు. మొదటి అదనపు న్యాయమూర్తి చెన్నంశెట్టి రాజు మాట్లాడుతూ.. మత్తు పదార్థాలను ఉక్కుపాదంతో నివారించకుంటే యువత చెడు మార్గంలోకి పయనిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణా డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు శిశుగృహాల ద్వారా జిల్లాలో 270 మందికి ఆశ్రయం కల్పించామన్నారు. జిల్లాలో 54 బాల్యవివాహాలను అడ్డుకున్నామని పేర్కొన్నారు. కోవిడ్ కారణంగా తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన పిల్లలకు ప్రభుత్వం ద్వారా రూ.10 లక్షల ఆర్థిక సాయం అందజేసి వారికి విద్యాసహాయం కూడా చేస్తున్నామన్నారు. పలు పాఠశాలల విద్యార్థులు నృత్యప్రదర్శన చేయటంతో పాటు మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టం, బాలికలపై లైంగిక దాడులు జరిగే విధానంపై నాటిక ప్రదర్శించారు. అనంతరం న్యాయమూర్తి వివిధ శాఖల ద్వారా ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, టచ్‌ఫోన్లను అందజేశారు. పదో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎ.నరసింహమూర్తి, దిశా డీఎస్పీ జి.రాజీవ్‌కుమార్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చీలి మునలయ్య, సాంఘిక సంక్షేమశాఖ డీడీ కె.సరస్వతి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీతాబాయి, ఐసీడీఎస్ పీడీ ఎస్.సువర్ణ, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, తహసీల్దార్ డి.సునీల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో ఆకస్మిక తనిఖీలు

గుడ్లవల్లేరు(గుడివాడ): మండలంలోని అంగలూరు జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (డైట్)ను ఏపీ సమగ్ర శిక్ష రాష్ట్ర విద్య పర్యవేక్షకురాలు కల్పన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డైట్‌లోని అన్ని విభాగాల్లో పర్యటించి జరుగుతున్న వివిధ వినూత్న కార్యక్రమాలను పరిశీలించి అధ్యాపకులకు కితాబిచ్చారు. లైబ్రరీలో వివిధ రకాల పుస్తకాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. టీవీ ప్రాజెక్టర్ ద్వారా ఛాత్రోపాధ్యాయుల్లో సాంకేతిక విద్యా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే విధానాలను ఆమె పరిశీలించారు. సమగ్ర శిక్ష రాష్ట్ర మానటరింగ్ సెల్ సభ్యురాలు మాధవీలత, జిల్లా విద్యా పర్యవేక్షకుడు బట్టు సురేష్‌కుమార్, ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న కల్పన

వైభవంగా మహా రుద్రయాగం





యాగాన్ని నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు (ఇన్‌సెట్‌లో) ప్రత్యేక పూజలు అందుకున్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో నిర్వహిస్తున్న శత చండీ సహిత మహా రుద్రయాగం మూడో రోజుకు చేరుకుంది. శనివారం మూడో రోజున ఉదయం రుద్రహవనం, చండీ హోమం, మూల మంత్ర హవనం, నిత్యార్చనలు నిర్వహించారు. ఆలయ వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝుల శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో రుత్వికులు చండీహోమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం మల్లేశ్వర స్వామి వారికి పంచామృత అభిషేకాలు చేశారు. యాగశాలలో దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగాన్ని వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. భక్తులు యాగాన్ని వీక్షించేలా దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, బచ్చు మాధవీకృష్ణ, మారం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

• నోరూరించే ఫ్యాషన్ ఫ్రూట్



శివనాగిరెడ్డి ఇంటి పెరట్లో అల్లుకున్న ఫ్యాషన్ ఫ్రూట్ మొక్క

స్ట్రాబెర్రీ.. డ్రాగన్ ఫ్రూట్.. అందరికీ తెలుసు. అయితే ఫ్యాషన్ ఫ్రూట్ గురించి కొందరికే తెలుసు. నగరవాసులకు ఇవి పరిచయమే. అయితే గ్రామీణ ప్రాంతంలో చాలా మందికి ఫ్యాషన్ పండ్లు అంటే తెలియదు. కంకిపాడు మండలం చలివేంద్రపాలెం సర్పంచ్, రైతు బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి ఇంటి ముంగిట ప్రత్యేకంగా అల్లిన పందిరికి పసుపు, వంగ పండు రంగుల్లో ఫ్యాషన్ పండ్లు నోరూరిస్తూ, కమ్మటి వాసనతో సాదరంగా స్వాగతం పలుకుతున్నాయి. ఎనిమిది నెలల క్రితం ఫ్యాషన్ ఫ్రూట్ మొక్క తెచ్చి నాటానని బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి తెలిపారు. నాటిన ఆరు నెలల నుంచి పండ్ల దిగుబడి వస్తోందన్నారు. తీపి, పులుపుతో కూడిన రుచితో ఉండే ఈ పండ్లను నేరుగా తినొచ్చని, జ్యూస్ చేసుకోవచ్చని వివరించారు. ఈ పండులో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఏ, సీ తదితర పోషకాలు అధికంగా ఉంటాయని తెలిపారు.

\- కంకిపాడు(పెనమలూరు)



పక్వానికి వచ్చిన ఫ్యాషన్ ఫ్రూట్స్



ఫ్యాషన్ ఫ్రూట్స్ చూపుతున్న సర్పంచ్ బొమ్మారెడ్డి శివనాగిరెడ్డి

సమాజానికి మహిళలే వెన్నెముక

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



ఎగ్జిబిషన్‌లో మహిళలతో కలెక్టర్ ఢిల్లీరావు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సమాజానికి మహిళలే వెన్నెముకని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. స్థానిక మధుచౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాలులో జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా ఉత్సవ్ – 2023ను శనివారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. అనంతరం మహిళలు తయారు చేసిన వివిధ వస్తువులను పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ తీసుకున్న మహిళలు తమ సృజనాత్మక శక్తిని జోడించి వస్తువులు, అలంకరణ సామగ్రి తయారు చేసి విక్రయిస్తే మంచి డిమాండ్ ఉంటుందన్నారు. వృత్తి విద్యా కోర్సులు నేర్చుకున్న వారు ప్రభుత్వ సహకారంతో చిన్నస్థాయి పరిశ్రమలను స్థాపించొచ్చని సూచించారు. మహిళలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. మహిళలు తయారు చేసిన వస్తువులను పొరుగు రాష్ట్రాల్లో విక్రయించేందుకు జిల్లా యంత్రాంగం సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లాలో డ్వాక్రా బజార్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఢిల్లీరావు ప్రకటించారు. మహిళలు తయారు చేసిన వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించడానికి ఏటా మార్చి నెలలో మహిళా ఉత్సవ్‌ను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. మహిళ, శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ ఉమాదేవి మాట్లాడుతూ.. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ మహిళలు అభివృద్ధి చెందాలని సూచించారు. వీఎంసీ యూసీడీ విభాగం ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.శకుంతల మాట్లాడుతూ.. మహిళలు స్వయం ఉపాధి కోర్సులు నేర్చుకోవడం వల్ల వారు ఉపాధి పొందడమే కాకుండా పరిశ్రమల స్థాపన ద్వారా మరికొంత మందికి ఉపాధి కల్పించొచ్చని సూచించారు. జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ విద్యాకన్న మాట్లాడుతూ.. మహిళల్లో ఆత్మ విశ్వాసంతోపాటు వృత్తి నైపుణ్యాలు పెంచి స్వయం ఉపాధి చేపట్టేలా తీర్చిదిద్దేందుకే ఈ మహిళా ఉత్సవ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ మాట్లాడుతూ ఈ నెల 12 తేదీ వరకు రోజూ మధ్యాహ్నం రెండు నుంచి రాత్రి తొమ్మిది గంటలకు ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. మహిళలు తయారు చేసిన వస్తువులనే ప్రదర్శనలో ఉంచి విక్రయిస్తామని స్పష్టంచేశారు.

క్లుప్తంగా

గజావాహనాధీశా... పాహిమాం...



మంగళగిరి: పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ, భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శ్రీవారు శనివారం ఉదయం హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి గజవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీవారు గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమివ్వగా అశేషసంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకుని ముగ్ధులయ్యారు. ఉత్సవాలను ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించగా హంసవాహన సేవ కై ంకర్యపరులుగా వేదాంత గోపాల సత్యవతి, వేణు గోపాల వాసుదేవ భట్టర్‌లు, గజ వాహన సేవ కైంకర్యపరులుగా పాతమంగళగిరి శ్రీ పద్మశాలీయ సంఘం వారు వ్యవహరించారు.

రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే కొడాలి నాని



కలెక్టర్ రంజిత్‌బాషాతో కలిసి టిడ్కో ఇళ్ల సముదాయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడటౌన్ : పట్టణంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) తెలిపారు. టిడ్కో ఇళ్ల పనులు శనివారం ఆయన కలెక్టర్ రంజిత్‌బాషాతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. గుడివాడలో రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. జగనన్న కాలనీల్లో మెయిన్ రోడ్ల అభివృద్ధికి రూ. 9.40 కోట్లు, పట్టణ శివారు కాలనీల్లో అభివృద్ధి పనులకు రూ. 26 కోట్లు, చేపల చెరువులు కారణంగా తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్న నందివాడ, గుడివాడ రూరల్ ప్రజల తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రతి గ్రామంలోనూ పంప్ హౌస్ నిర్మాణాలకు రూ.160 కోట్లతో టెండర్లు పూర్తి చేశామని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. రూ.320 కోట్లతో పట్టణ ప్రజల చిరకాల వాంఛ అయిన రైల్వే గేట్‌ల వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు చేపట్టామని వివరించారు. ఫ్లై ఓవర్ నిర్మాణానికి భూసేకరణ కోసం రూ.47 కోట్లు చెల్లించామని తెలిపారు. సోమవారం నుంచి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. రెండేళ్లలో నిర్మాణం పూర్తవుతుందని స్పష్టం చేశారు. త్వరలో గుడివాడకు రానున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తామన్నారు. వాటర్ స్కీమ్‌కు రూ.200 కోట్లు, టిడ్కో ప్లాట్లకు రూ.600 కోట్లు, జగనన్న కాలనీ నిర్మాణాలకు రూ.450 కోట్లు, బస్టాండ్ ఆధునికీకరణకు రూ.22 కోట్లు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి రూ.12 కోట్లు నిధులను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద మనస్సు చేసుకుని మంజూరు చేశారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు పాలేటి చంటి, మట్టా జాన్ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాదికి టిడ్కో ఇళ్లు ప్రారంభిస్తాం...

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని 16 వేల కుటుంబాలకు సకల వసతులతో ఇళ్లను ఉగాది నాటికి అందిస్తామని కలెక్టర్ రంజిత్‌బాషా తెలిపారు. మల్లాయిపాలెం లే-అవుట్‌లో గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని)తో కలిసి టిడ్కో ఇళ్ల మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది మంది లబ్దిదారులతో మినీ గుడివాడగా మారుతుందని చెప్పారు. ఆర్డీఓ పి.పద్మావతి, టిడ్కో డైరెక్టర్‌లు పత్తివాడ రాఘవరావు (చిన్నారి), కె.నాగేశ్వరి, పీడీ చిన్నోడు, హౌసింగ్ డీఈ రామోజీ నాయక్, మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, తహసీల్దార్ ఆంజనేయులు తదితరులున్నారు.

కిరణ్ మృతదేహం లభ్యం



కిరణ్ మృతదేహం పరిశీలిస్తున్న పోలీసులు

పెనమలూరు: చోడవరం వద్ద కృష్ణానది ఏటిపాయలో గల్లంతైన తాళ్లూరి కిరణ్ (37) మృతదేహాన్ని ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గాలించి శనివారం బయటకు తీశారు. గురువారం రాత్రి విజయవాడకు సింగ్‌నగర్‌కు చెందిన రెస్టారెంట్ వ్యాపారి రహీంబాషా, అయన మిత్రులు షేక్.ఖలీషా, తాళ్లూరి కిరణ్ కొత్తగా కొన్న కారులో వచ్చి మద్యం తాగారు. అనంతరం కృష్ణానదిలో ఈతకు దిగి గల్లంతయ్యారు. శుక్రవారం ఉదయం మత్స్యకారులు నది వద్దకు రాగా ఒడ్డున కారు కనిపించింది. నదిలో ఖలీషా మృతదేహం కనబడింది. పోలీసులకు సమాచారం ఇవ్వటంతో రంగంలోకి దిగారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది, గజ ఈతగాళ్లు నదిలో గాలించగా రహీంబాషా మృతదేహం కూడా కనిపించటంతో రెండు మృతదేహాలు స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గాలింపులో కిరణ్ మృతదేహం సైతం దొరికింది. పోస్టుమార్టంకు ఉయ్యూరు తరలించారు.

ముగ్గురూ చిన్ననాటి మిత్రులు...

నదిలో మరణించిన ముగ్గురు చిన్ననాటి మిత్రులేనని పోలీసులు తెలిపారు. వీరు కలిసే ప్రాణాలు వదలటంతో కుటుంబ సభ్యుల్లో విషాదం నెలకొంది. అయితే వీరు గతంలో కూడా నది వద్దకు వచ్చి మద్యం తాగి స్నానాలు చేసేవారని తమ విచారణలో తెలిసిందని పోలీసులు తెలిపారు. కిరణ్, రహీంబాషాకు ఈత వచ్చని కుటుంబ సభ్యులు తెలిపారని ఎస్ఐ రాజేష్ అన్నారు. అయితే మరి ముగ్గురూ నదిలోకి దిగి ఎలా చనిపోయారనేది ప్రశ్నగా ఉంది. ఈత రాని ఖలీషాను కాపాడపోయి ప్రమాదంలో చిక్కుకుని మిగతా ఇద్దరు కూడా చనిపోయారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటన పై పోలీసులు అన్ని కోణాల నుంచి విచారణ చేపట్టారు.

చదువుతోనే ఉన్నత శిఖరాలకు చేరువ

జర్మనీ మాజీ మేయర్ డాక్టర్ రవీంద్ర



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ రవీంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): చదువుతో సాధ్యం కానిదేదీ లేదని, ఉన్నత శిఖరాలకు చేరువయ్యే సాధనమని జర్మనీ దేశ మాజీ మేయర్ డాక్టర్ గుజ్జుల రవీంద్ర తెలిపారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం నిర్వహణలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్య అకాడమీ హైస్కూల్‌ను జర్మనీ దేశ బృందం శనివారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇక్కడే పుట్టి పెరిగి జర్మనీ దేశ ప్రజాప్రతినిధిగా పని చేశానంటే అందుకు చదువే కారణమన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించేందుకు పేదరికం, సామాజిక అసమానతలు అడ్డంకులు కాదని తెలిపారు. ఏకాగ్రతతో తమ లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేయాలని సూచించారు. అందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. పాఠశాల అభివృద్ధి కోసం రూ.3 లక్షలు విరాళంగా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయన సతీమణి, డెప్యూటీ మేయర్ (జర్మనీ అట్లాండ్స్‌బర్గ్) గాబ్రియేల్, అంద్రియాస్-నీలి దంపతులు, టీవీఎస్ ఆంజనేయరాజు, బి. జమిందార్, సాంబశివరాజు, పాఠశాల కరస్పాండెంట్ ఆర్. సత్యనారాయణ, సంఘం వైస్ ప్రెసిడెంట్ ఆర్ గోపాలం, సెక్రటరీ ఎం. నరసింహారావు, కోశాధికారి డి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ సమ్మిట్ విజయం ప్రతిపక్షాలకు చెంపపెట్టు

ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ షేక్ ఆసిఫ్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ విజయవంతం కావటం ప్రతిపక్షాలకు చెంపపెట్టు వంటిదని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ షేక్ ఆసిఫ్ తెలిపారు. వించిపేటలోని తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగటం లేదంటూ చంద్రబాబు అండ్ కంపెనీ చేస్తున్న దుష్ప్రచారానికి చెక్ పెడుతూ దేశవిదేశాల నుంచి పారిశ్రామికవేత్తలు విశాఖపట్నంకు తరలివచ్చారని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వేలాది మంది పారిశ్రామికవేత్తలు తరలిరావటం జగన్‌మోహన్ రెడ్డి పట్ల, ఆయన ప్రభుత్వం మీద ఉన్న నమ్మకానికి నిదర్శనమని తెలిపారు. సుమారు రూ.13 లక్షల కోట్లకు సంబంధించి 352 ఒప్పందాలను కుదుర్చుకోవటం గొప్ప విషయమన్నారు. వీటి వలన సుమారు ఆరు లక్షల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుందని పేర్కొన్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం యావత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావటమే కాకుండా ప్రజల అభివృద్ధి పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని సైతం తెలియజేసిందన్నారు.

- కృష్ణా జిల్లాలో ఆలయాల భూముల రీ-సర్వే సక్రమంగా జరిగేలా చూడాలని ఆ శాఖ డీసీ ఎం.విజయరాజు, ఆర్‌జేసీ సురేష్‌బాబు సూచించారు.

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం

- ఏపీఐఐసీ కాలనీలో కల్వర్టు నిర్మాణానికి రూ.14 లక్షల మంజూరు
- టెండరు పూర్తి..వారంలో పనులు ప్రారంభించనున్న అధికారులు
- పూర్తయిన రోడ్ల పనులు



ఏపీఐఐసీ కాలనీలో నిర్మించిన రోడ్డు



కొద్దిపాటి వర్షానికే ముంపునకు గురైన కాలనీ (ఫైల్ ఫొటో)

ఆటోనగర్(విజయవాడతూర్పు): స్థానిక 11వ డివిజన్‌లో ఏపీఐఐసీ కాలనీలో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికింది. కొన్నేళ్లుగా ఇక్కడ ముంపు సమస్య స్థానికులను వెంటాడుతోంది. గత ప్రభుత్వం కాలనీ వాసుల ఇబ్బందులను పట్టించుకోలేదు. రోడ్లు కూడా అధ్వానంగా ఉండేవి. గోతులు పడటంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కాలనీలో సుమారు వెయ్యి కుటుంబాలు, నాలుగు వేల మంది జనాభా నివసిస్తున్నారు. ప్రధాన రహదారితోపాటు 8 అంతర్గత రోడ్లు ఉన్నాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక కాలనీలో ప్రధాన రోడ్లు నిర్మించారు. రహదారి ఇబ్బందులు తొలగినా ముంపు సమస్య స్థానికులను వెంటాడుతోంది. వీరి ముంపు ఇబ్బందులు తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు.

వారంలో పనుల మొదలు

వానాకాలమొస్తే కొద్దిపాటి వర్షానికే ఈ కాలనీ ముంపునకు గురవుతోంది. ఈ ప్రాంతం పల్లంగా ఉండటంతో సమస్య ఎదురవుతోంది. ఈ ఇబ్బందిని తొలగించడానికి వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి అవినాష్.. కార్పొరేషన్ అధికారులతో మాట్లాడారు. ఇక్కడ కల్వర్టు నిర్మాణానికి రూ.14 లక్షల నిధుల మంజూరు చేశారు. టెండరు ప్రక్రియ పూర్తైంది. వారంలో కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు ఏఈ 2 శాస్మిన్ చెప్పారు.

తొలగనున్న ఇబ్బందులు

చాలా ఏళ్లగా కాలనీలో మౌలిక వసతులు కరువయ్యాయి. రోడ్లు సరిగా ఉండేవి కావు. ప్రధాన రహదారి అధ్వానంగా కనిపించేది. వానాకాలమొస్తే కాలనీ అంతా నీటి మునిగేది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాలనీలో ప్రధాన రోడ్డు నిర్మించారు. ముంపు సమస్య పరిష్కారానికి కల్వర్టు ఏర్పాటుచేయనున్నారు. దీంతో ఇబ్బందులు తొలగనున్నాయి.

– త్రిపురనేని నాగచంద్, స్థానికుడు

■ గగన కాంతలు



ఏ మేఘవీణ మీటిందో ఉత్తుంగ తరంగమై గగనవేదికపై నర్తిస్తున్నాయి. నగరంలోని రెడ్‌సర్కిల్‌లో శనివారం సాయంత్రం ఆకాశ వీధిలో సాక్షాత్కరించిన దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– కందుల చక్రపాణి, సాక్షి ఫొటోగ్రాఫర్

వేసవిలో మెట్రో లగ్జరీ ఏసీ బస్సులో ప్రయాణించండి



గుంటూరు వెళ్లనున్న ఆటోనగర్ డిపోకు చెందిన నాన్ స్టాప్ ఏసీ లగ్జరీ బస్సు ఇదే

ఆటోనగర్(విజయవాడతూర్పు): విజయవాడ నుంచి గుంటూరు వెళ్లే ఆర్టీసీ నాన్‌స్టాప్ మెట్రో లగ్జరీ ఏసీ బస్సులను వేసవిలో ప్రత్యేకంగా నడుపుతారు. ఆటోనగర్ డిపోకు చెందిన ఈ బస్సును ఏటా మార్చి, ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో నడుపుతారు. డిపో నుంచి 9 బస్సు సర్వీసులను తిప్పుతున్నారు. గుంటూరు నుంచి విజయవాడకు కేవలం 45 నిమిషాల్లో వెళ్తారు. విజయవాడ నుంచి ప్రతి 45 నిమిషాలకు ఒక బస్సు ఉంటుంది. టిక్కెట్ ధర రూ.100 .

రెండేళ్లల్లో వచ్చిన ఆదాయమిది

2022- 23 ఫిబ్రవరి నెలలో రూ. 4.61 కోట్లు ఆదాయం వచ్చిందని ఆటోనగర్ డీఎం ప్రవీణ్‌కుమార్ చెప్పారు. 2021-22లో 2.44 కోట్లు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది అధికంగా ఆదాయం వస్తుందని డీఎం పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



గుణదల(విజయవాడతూర్పు): బాధితులకు దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. దేవినేని అవినాష్ ఆదేశాల మేరకు గుణదలలోని వైఎస్సార్ సీపీ తూర్పు కార్యాలయంలో శనివారం ట్రస్ట్ ద్వారా 5వ డివిజన్‌కు చెందిన శ్యాంసుందర్‌కు రూ.15వేలు, 3వ డివిజన్‌కు చెందిన ఎనిమిది సంవత్సరాల యశ్వంత్‌కుమార్‌కు రూ.20వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా యూత్ ప్రెసిడెంట్ కొరివి చైతన్య, 3వ డివిజన్ కార్పొరేటర్ భీమిశెట్టి ప్రవల్లిక, 5వ డివిజన్ కార్పొరేటర్ కలపాల అంబేద్కర్, వైఎస్సార్ సీపీ నాయకులు సొంగా రాజ్‌కమల్, ఎం.ప్రసాద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 38 మంది ఎంపిక



లబ్బీపేట(విజయవాడతూర్పు): రాజ్ గ్రూప్ టెక్నో సొల్యూషన్స్ శనివారం నలంద డిగ్రీ కళాశాలలో ప్రాంగణ ఇంటర్వ్యూలు నిర్వహించింది. 120 మంది విద్యార్థులు హాజరవ్వగా, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూల అనంతరం 38 మంది ఉద్యోగార్హత సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. అనురాధ తెలిపారు. వారికి పదిహేను రోజుల శిక్షణ అనంతరం విజయవాడలోనే పోస్టింగ్ ఇస్తారని పేర్కొన్నారు. ఎంపిక కార్యక్రమాన్ని ప్లేస్‌మెంట్ అధికారి బి.చంద్రగిరి, కమ్యూనికేషన్ స్కిల్స్ హెచ్‌ఓడీ రజనీప్రదీప పర్యవేక్షించారు.

స్టెల్లా కాలేజీతో తక్షశిల ఐఏఎస్ అకాడమీ ఒప్పందం



పటమట(విజయవాడతూర్పు): ఇంటిగ్రేటెడ్ ఐఏఎస్ ప్రోగ్రాంలో భాగంగా స్టెల్లా కళాశాల.. సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ కోచింగ్ ఇన్‌స్టిట్యూటైన తక్షశిల ఐఏఎస్ అకాడమీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జసింతా క్వాడ్రస్, తక్షశిల అకాడమి మేనేజింగ్ డైరెక్టర్ బీఎస్ఎన్ దుర్గాప్రసాద్ తెలిపారు. స్టెల్లా కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వీరు మాట్లాడుతూ బాలికలకు అపారమైన సామర్థ్యం, ప్రతిభ ఉందని, వారు అనుకున్న లక్ష్యాలను సాధించడానికి తాము ఇంటిగ్రేటెడ్ ఐఏఎస్ ప్రోగ్రాంతో విద్యార్థులకు విద్యావిషయ జ్ఞానంతో పాటు ఆచరణాత్మక నైపుణ్యాల్లో బలమైన పునాదిని అందిస్తామని తెలిపారు.

విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటించాలి



గుణదల: విధి నిర్వహణలో విద్యుత్ ఉద్యోగులు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎ. మురళీ మోహన్ అన్నారు. గుణదల కార్యాలయంలో శనివారం లైన్‌మెన్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించి విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన లైన్‌మెన్లను సన్మానించారు. లైన్‌మెన్లు సుశీల్‌కుమార్, అప్పలస్వామి, రాంబాబు, ఉమామహేశ్వరరావు తదితర సిబ్బందిని సన్మానించి అవార్డులు అందజేశారు. మురళీమోహన్ మాట్లాడుతూ విద్యుత్ కార్మికులు అంకిత భావంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజినీరు హరిబాబు, ఏడీఈ బాలాజీ, పూర్ణచంద్రరావు, ఏఈ దుర్గాప్రసాద్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

11 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాడుతున్న 11 మందిని పటమట పోలీసులు అరెస్ట్ చేశారు. రామలింగేశ్వరనగర్‌లోని ఓ ఇంట్లో శనివారం రాత్రి పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారమందింది. వారు ఆ ఇంటిపై దాడి చేయగా 11 మంది పేకాడుతున్నట్లు గుర్తించారు. వారిని అరెస్ట్ చేసి రూ.25,070 నగదును స్వాధీనం చేసుకున్నారు. పటమట సీఐ కాశీవిశ్వనాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదల నడ్డి విరుస్తున్న కేంద్రం



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచి పేదల నడ్డి విరుస్తోందని, పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను వెంటనే ఉపసంహరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. రాణిగారితోటలో గ్యాస్ ధర పెంపునకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డి.కాశీనాథ్ మాట్లాడుతూ గ్యాస్ ధర రూ.50, కమర్షియల్ సిలిండర్ ధర రూ.350 పెంచి ఒకేసారి బీజేపీ గ్యాస్ బాంబ్ పేల్చిందన్నారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యాన ఈ నెలంతా క్యాంపెయిన్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పుప్పాల కృష్ణ, చంద్రశేఖర్, వరప్రసాద్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యతో జీవితంలో మార్పు



ఎగ్జామ్స్ కిట్లు అందజేస్తున్న ఎస్‌బీఐ డీజీఎం రంగరాజన్, ప్రధానోపాధ్యాయుడు నాగరాజు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్యతో జీవితంలో మార్పు సాధ్యమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం రంగరాజన్ చెప్పారు. స్థానిక జమ్మిచెట్టు సెంటర్‌లో బోయపాటి శివరామకృష్ణయ్య మున్సిపల్ (బీఎస్ఆర్‌కే) హైస్కూల్‌లో శనివారం విద్యార్థినులకు ఎస్‌బీఐ ఆధ్వర్యాన ఎగ్జామ్స్ కిట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో విద్యార్థి దశ కీలకమన్నారు. మార్చి 8వ తేదీ మహిళా దినోత్సవం సందర్భంగా తమ బ్యాంక్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. తమ బ్యాంక్ పరిధిలోని 18 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసుకుని కొన్ని స్కూళ్లలో ఎగ్జామ్ కిట్లను, మరికొన్ని పాఠశాలల్లో శానిటరీ న్యాప్‌కిన్ కిట్లను అందజేస్తున్నామన్నారు. గతంలో చదువుకునే మహిళల సంఖ్య చాలా తక్కువగా ఉండేదని, ఇప్పుడు ఉన్నత విద్యతో.. పురుషులతో సమానంగా ఉద్యోగాలు చేయడం, దేశ రక్షణ రంగంలో, ఇస్రో వంటి పరిశోధనా కేంద్రాల్లో కూడా సత్తా చాటుతున్నారని చెప్పారు. పాఠశాలకు అవసరమైన ఫర్నిచర్‌ను వారంలో అందజేస్తామని రంగరాజన్ చెప్పారు. 6 నుంచి 10 తరగతి వరకు చదువుతున్న 460 మంది విద్యార్థినులకు ఎగ్జామ్ కిట్లను అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు నాగరాజు మాట్లాడుతూ ఎస్‌బీఐ సిబ్బంది విద్యార్థినులకు ఎగ్జామ్స్ కిట్లతో పాటుగా పాఠశాలకు ఫర్నిచర్‌ను అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.

విద్యార్థులకు ఉచితంగా బ్యాంకు ఖాతాలను ప్రారంభిస్తే వారికి విద్యార్థి దశ నుంచే డబ్బు పొదుపు చేయడం అలవాటవుతుందన్నారు. ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్లు ఎం.బద్రీనాథ్, పి.నాగేశ్వరరావు, పీఆర్వో రమణమూర్తితో పాటుగా బీఎస్ఆర్‌కే హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులకు బ్యాంక్ సిబ్బంది పెన్ సెట్లు ఇచ్చారు.

వ్యాక్సినేషన్ పక్కాగా నిర్వహించాలి



కృష్ణలంక యూపీహెచ్‌సీలో వ్యాక్సినేషన్ తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): చిన్నారులకు వేసే వ్యాధి నిరోధక టీకాలను ప్రణాళికాబద్ధంగా పక్కాగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఆమె శనివారం కృష్ణలంకలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్న మీజిల్స్–రూబెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీకాలు వేసే సమయంలో నియమ నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని తనిఖీ చేశారు. అక్కడే ఉన్న మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలోడాక్టర్ పద్మావతి, కృష్ణలంక యూపీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.

ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్ల తనిఖీ

ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకుని బేటీ బచావో బేటీ పడావో.. ఆడపిల్లలను రక్షించండి, ఆడపిల్లలను కాపాడండి అనే నినాదంతో వైద్యశాఖ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం నగరంలోని పలు లేబొరేటరీలు, స్కానింగ్ సెంటరను తనిఖీ చేశారు. రిజిస్టర్ కాని సంస్థలకు నోటీసులు ఇచ్చారు. డయాగ్నోస్టిక్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలపై తనిఖీలు జరిగాయి.

వివక్ష రూపుమాపాలి



ఆర్ట్ గ్యాలరీని తిలకిస్తున్న ఆలిండియా రేడియో మాజీ డైరెక్టర్ కృష్ణకుమారి తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): మహిళలపై వివక్ష రూపుమాపి సమాజంలో చైతన్యం తీసుకురావాలని ఆలిండియా రేడియో మాజీ డైరెక్టర్ మంజులూరి కృష్ణకుమారి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఎం.బి.విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన శనివారం మహిళా సాంస్కృతిక సమ్మేళనం జరిగింది. ఎం.బి.విజ్ఞాన కేంద్రం బాధ్యులు కె.స్వరూపరాణి అధ్యక్షత వహించారు. కృష్ణకుమారి మాట్లాడుతూ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించామనుకుంటున్నా కంప్యూటర్ యుగంలో సైతం మహిళలపై పలు రూపాల్లో నిత్యం వివక్ష కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఏడాది మహిళల్లో 'డిజిటల్ ఇనోవేషన్ ఇన్ ఈక్వాలిటీ' తీసుకురావాలని ఐక్యరాజ్యసమితి పిలుపునిచ్చిన నేపథ్యంలో మహిళల్లో సమానత రావాలంటే ఇప్పుడున్న వాతావరణంలో ఇంకా ఎంత కాలం పయనించాలో అని ఆలోచించక తప్పడం లేదన్నారు. స్వరూపరాణి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని హక్కుగా, దీక్షా దినంగా చేసుకొని మహిళల సమానతపై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.

ఆర్ట్ గ్యాలరీ

వివిధ రూపాల్లో మహిళలపై జరుగుతున్న వివక్ష, అత్యాచారాలు, హత్యలు వంటి చిత్రాలతో ప్రదర్శించిన ఆర్ట్ గ్యాలరీ ఆకట్టుకుంది. 50 చిత్రాల వరకు ఏర్పాటు చేసిన ఈ ఆర్ట్ గ్యాలరీని కృష్ణకుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో జాషువా సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు సునీల్ కుమార్, ఎం.బి.విజ్ఞాన కేంద్రం బాధ్యులు పి.విజయ, రత్నమాల, ఝాన్సీ, కె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కవచం.. దిశ



ఏసీపీ వీవీ నాయుడిని సత్కరిస్తున్న కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టీఎస్ రవికిరణ్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మహిళలకు రక్షణ కవచం దిశ యాప్ అని 'దిశ' ఏసీపీ వీవీ నాయుడు చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం, స్నేహాస్తి చారిటబుల్ ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ సంయుక్తంగా శనివారం సిద్ధార్థ కళాశాల సెమినార్ హాలులో దిశ యాప్, దిశ చట్టంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ నాయుడు మాట్లాడుతూ మహిళలు ఒంటరిగా వెళ్లేటప్పుడు అనుకోని సంఘటన జరిగినప్పుడు స్మార్ట్‌ఫోన్‌లో దిశ యాప్‌ను ఉపయోగిస్తే ప్రమాదకర పరిస్థితుల నుంచి తప్పించుకోవచ్చని చెప్పారు. దిశ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ రేవతి మాట్లాడుతూ దిశ యాప్‌ను స్మార్ట్ ఫోన్‌లో ఎలా ఇన్‌స్టాల్ చేయాలి, ఉపయోగించే విధానాలను తెలియజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.మనోరంజని, సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రవికిరణ్ మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. స్నేహాస్తి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు వి.భారతి, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ వైస్ ప్రెసిడెంట్ మురళీకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. సదస్సు అనంతరం వీవీ.నాయుడిని కళాశాల ప్రతినిధులు సత్కరించారు.

గ్లకోమాను నిర్లక్ష్యం చేయొద్దు

డాక్టర్ ఇండ్ల స్వప్న



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఇండ్ల స్వప్న, వేదికపై డాక్టర్ సమరం, డాక్టర్ మారు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నీటికాసులు(గ్లకోమా)ను నిర్లక్ష్యం చేస్తే శాశ్వతంగా అంధత్వం కలుగుతుందని నేత్ర వైద్య నిపుణురాలు ఇండ్ల స్వప్న అన్నారు. తొలిదశలోనే గుర్తిస్తే అంధత్వ నివారణ సులువుగా ఉంటుందన్నారు. బెంజిసర్కిల్ సమీపంలోని వాసవ్య నర్సింగ్ హోంలో శనివారం నీటికాసులు అంశంపై ఆరోగ్య సదస్సు జరిగింది. డాక్టర్ స్వప్న మాట్లాడుతూ దేశంలో 50 లక్షల మంది అంధత్వంతో బాధపడుతున్నారని, ఇంకో 70 మిలియన్లు దృష్టి దోషంతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. అంధత్వం కలిగించే వాటిల్లో గ్లకోమా ప్రధాన వ్యాధిగా పేర్కొన్నారు. ఇది వంశపారంపర్యంగా సంక్రమించడం ఎక్కువ అన్నారు. కొందరు పిల్లల్లో పుట్టుకతోనే గ్లకోమా ఉంటుందని తెలిపారు. గ్లకోమాకు మందులు, లేజర్‌చికిత్స, శస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. సదస్సుకు డాక్టర్ సమరం అధ్యక్షత వహించగా, డాక్టర్ మారు పాల్గొన్నారు.

పాతశివాలయం హుండీ ఆదాయం రూ.3.55 లక్షలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం (పాతశివాలయం)లో జరిగిన హుండీల లెక్కింపు ద్వారా రూ.3,55,629 ఆదాయం లభించినట్లు ఈఓ హేమలతాదేవి తెలిపారు. దేవదాయ ధర్మదాయ శాఖ జిల్లా అధికారి ఆదేశాల మేరకు హుండీల్లో కానుకల లెక్కింపు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో వివిధ ఉపాలయాల వద్ద భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను లెక్కించగా ఈ ఆదాయం లభించినట్లు పేర్కొన్నారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఈఓ సుబ్బరావు పరిశీలకునిగా హాజరైనట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

కృష్ణలంక(విజయవాడ తూర్పు): విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ జె.ఆంజనేయులు అన్నారు. కృష్ణలంకలోని వీఎం రంగా నగరపాలక సంస్థ పాఠశాలలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యాన శనివారం ఆయన మత్తు పదార్థాల దుర్వినియోగంపై ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆంజనేయులు మాట్లాడుతూ తాత్కాలిక సంతోషానికి విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు గమ్యం కాదని, మాదక ద్రవ్యాలు తీసుకోవడం నిప్పుతో చెలగాటంలాంటిదన్నారు. మత్తుకు బానిసలైన వారిని డీ–ఎడిక్షన్ చికిత్సతో సాధారణ స్థితికి తీసుకురావచ్చని చెప్పారు. వ్యసనానికి బానిసలైన విద్యార్థులు, యువతకు విముక్తి కలిగించేందుకు డాన్ బాస్కో నవ జీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో పెజ్జోనిపేటలో ఏర్పాటు చేసిన నీతోడు మానసిక వికాస కేంద్రాన్ని ఉచితంగా సంప్రదించవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 94904 92020 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ప్రధానోపాధ్యాయురాలు ఎం.గ్రేసమ్మ, బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్స్ జె.వాణి, పాఠశాల ఉపాధ్యాయులు అంజనేశ్వరీ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మత్స్య పరిశ్రమలో ఉపాధి అవకాశాలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మత్స్య పరిశ్రమలో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి పరసా అఖిల అన్నారు. జాతీయ సైన్స్ వారోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల జంతు, మత్స్య సాంకేతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యాన సదస్సు నిర్వహించారు. అఖిల మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇన్‌స్టిట్యూట్స్‌లో మత్స్యశాఖ శిక్షణ కోర్సుల ద్వారా నైపుణ్యాన్ని పొందవచ్చన్నారు. లేబొరేటరీలు, ప్రాసెసింగ్ యూనిట్స్, మార్కెటింగ్, హేచరీస్, ఫీడ్ మిల్స్, ఆక్వా కన్సల్టెంట్లు ఉద్యోగ అవకాశాలున్నాయని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కల్పన, జంతుశాస్త్ర విభాగ అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గోరుముద్ద, అంగన్‌వాడీలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ లక్ష్మీరెడ్డి



అంగన్‌వాడీ కేంద్రంలో రిజిస్టర్ పరిశీలిస్తున్న లక్ష్మీరెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): జిల్లాలో జగనన్న గోరుముద్ద పథకం, రేషన్ బియ్యం పంపిణీ, అంగన్‌వాడీ కేంద్రాలను మరింత సమర్థంగా నిర్వహించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ లక్ష్మీరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతంలో రేషన్ షాపులు, ఏఎండీయూ వాహనాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీ, అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు పాఠశాలల్లో గోరుముద్ద పథకం అమలు తీరును ఆయన శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో 5. 63లక్షలు పైగా తెల్లకార్డులు, 23వేల మంది అంత్యోదయ కార్డుదారులకు బియ్యం పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారాన్ని నిర్దేశించిన సమయంలో సరైన పద్ధతిలో అందించాలన్నారు. మార్పు ట్రస్ట్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న న్యూట్రిషన్ పాడిని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. వాంబే కాలనీలోని డాక్టర్ దక్షిణామూర్తి పాఠశాలలో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని పరిశీలించి, మధ్యాహ్న భోజన తయారీలో నాణ్యత, పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి కోమలి పద్మ, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉమాదేవి, సీడీపీఓ నాగమణి తదితరులు పాల్గొన్నారు.


మానవ అక్రమ రవాణా నివారణపై అవగాహన

భవానీపురం(విజయవాడపశ్చిమ): మానవ అక్రమ రవాణా నివారణలో పోలీసులు ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా ఉంటూ ప్రజ్వల వంటి స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేయాలని అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు అన్నారు. మానవ అక్రమ రవాణా శిబిరాలపై దాడులు నిర్వహించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసులు అవగాహన కలిగి ఉండాలని పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. మానవ అక్రమ రవాణా వంటి నేరాలకు అడ్డుకట్ట వేయాలన్న ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు డీసీపీ మోకా సత్తిబాబు శనివారం పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో పోలీస్ అధికారులకు, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు మానవ అక్రమ రవాణాను నియంత్రించేందుకు తీసుకోవల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. సత్తిబాబు మాట్లాడుతూ శ్రమ దోపిడి, అవయవాల మార్పిడి, లైంగిక దోపిడీకి మానవ అక్రమ రవాణా చేస్తున్నారన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు బలరామకృష్ణ, చంద్రయ్య, చెన్నయ్య, శ్రావణ్‌లు మానవ అక్రమ రవాణా నిర్మూలనపై ప్రజలను ఎలా చైతన్యవంతులను చేయాలి అనే అంశంపై సంస్థ డైరెక్టర్ పద్మశ్రీ, డాక్టర్ సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో తయారు చేసిన వీడియోలను ప్రదర్శించారు. కార్యక్రమంలో దిశ ఏసీపీ వీవీ నాయుడు, కంట్రోల్ రూమ్ ఏసీపీ రాజశేఖర్ రాజు, దిశ ఇనస్పెక్టర్ వాసవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఉన్నత విద్యలో ఏపీ ఆదర్శం

జీఐఎస్‌లో విద్యారంగ నిపుణుల వెల్లడి



సాక్షి, విశాఖపట్నం: ఏపీలో అమలు చేస్తున్న విద్యా విధానం పొరుగు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని విద్యా రంగ నిపుణులు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో తీసుకొస్తున్న సంస్కరణలు ప్రశంసనీయమని చెప్పారు. నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ప్రభుత్వం ముందుందని తెలిపారు. విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్)లో రెండో రోజు శనివారం ఉన్నత విద్యపై ఏపీ స్టేట్ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏపీఎస్‌సీహెచ్‌ఈ) చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి అధ్యక్షతన ప్యానల్ చర్చ జరిగింది. 'ఇంపాక్ట్ ఆఫ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్' అనే అంశంపై విద్యా రంగ నిపుణులు చర్చించారు. హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ వృత్తి నైపుణ్య కేంద్రంగా మారిందని చెప్పారు. నాస్కాం, మైక్రోసాఫ్ట్, స్కిల్ ఫోర్స్, టీం లీడ్స్, టీసీఎస్ వంటి కంపెనీలతో ఏపీఎస్‌సీహెచ్‌ఈ ఒప్పందాలు కుదుర్చుకుంటోందన్నారు. ఇంజినీరింగ్, ప్రొఫెషనల్, డిగ్రీ, ఫార్మసీ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో అడ్వాన్స్‌డ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ కోర్సులను అందిస్తూ ఉద్యోగ కల్పనలో ఇతర రాష్ట్రాలకు ఏపీ ఆదర్శంగా నిలుస్తోందని వివరించారు.

ఏపీలో విద్యా విధానం భేష్

విట్ ఫౌండర్, చాన్సలర్ జి.విశ్వనాథన్ మాట్లాడుతూ ఏపీలో ఉన్నత విద్యా బోధన, విధానం చాలా బాగున్నాయని, ప్రభుత్వం దీనిపై అధిక శ్రద్ధ పెట్టిందని చెప్పారు. ఏఐసీటీఈ సీవోవో బుద్దా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉన్నత విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయాన్ని కల్పించడం వల్ల చాలా కుటుంబాల్లో ఇంజినీర్లు తయారవుతున్నారని చెప్పారు. చర్చలో ఐఐఎస్‌సీ (బెంగళూరు) ప్రొఫెసర్ ఎన్.బాలకృష్ణన్, ఐఐటీ హైదరాబాద్ ఫౌండర్ ఉదయ్ దేశాయ్, ఐఐఎం విశాఖ డైరెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఫార్మా, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో

ఏపీకి అపార అవకాశాలు

- రాష్ట్రాభివృద్ధికి కేంద్రం తోడ్పాటు
- కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్ రెడ్డి

(విశాఖపట్నంలోని గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ప్రాంగణం నుంచి సాక్షి ప్రతినిధి)



ఆత్మనిర్భర్ భారత్ విధానంలో భాగంగా కేంద్రం 14 కీలక రంగాల్లో ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకాలను అమలు చేస్తోందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. మొబైల్స్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, ఆహార ఉత్పత్తులు, వైద్య పరికరాలు మొదలైనవి వీటిలో ఉన్నాయని చెప్పారు. శనివారం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ..ఏపీకి ఉన్న సానుకూలతల దృష్ట్యా మెరైన్ ఉత్పత్తులు, ఔషధాలు, ఎలక్ట్రానిక్స్, పెట్రోలియం, ఇంజినీరింగ్ ఉత్పత్తులు మొదలైన విభాగాల్లో వృద్ధి చెందడానికి రాష్ట్రానికి పుష్కలంగా అవకాశాలు ఉన్నాయన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం పూర్తి తోడ్పాటునందిస్తుందని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడంలో, మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్రాలు ఒకదానితో మరొకటి పోటీ పడుతున్న నేపథ్యంలో ఈ తరహా సహకారం కీలకంగా ఉంటుందన్నారు. 2014లో 45 బిలియన్ డాలర్లుగా ఉన్న ఎఫ్‌డీఐలు 2021–22 నాటికి రెట్టింపై 85 బిలియన్ డాలర్లకు చేరాయన్నారు. వ్యాపారాలను సులభతరం చేసే విధానాల్లో భారత్ ర్యాంకింగ్‌ను గణనీయంగా మెరుగుపర్చుకుందన్నారు. పన్నుల విధానాల్లో, కార్పొరేట్ చట్టాల్లోనూ సంస్కరణలు చేపట్టినట్లు తెలిపారు. యూనికార్న్‌ల (1 బిలియన్ డాలర్ల వేల్యుయేషన్ గల అంకుర సంస్థలు)కు సంబంధించి ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉన్నామని చెప్పారు.

పోర్టు ఆధారిత అభివృద్ధికి ప్రాధాన్యం

- స్వయం సమృద్ధి లక్ష్య సాధనలో ఏపీ పాత్ర కీలకం
- రవాణా మార్గాల అభివృద్ధిలో ఏపీ ముందుంది
- కేంద్ర పోర్టులు, షిప్పింగ్ శాఖ మంత్రి సోనోవాల్ వెల్లడి
- అంతర్జాతీయ వాణిజ్యంలో వైజాగ్ పోర్టు కీలకం

(విశాఖపట్నంలోని గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ప్రాంగణం నుంచి సాక్షి ప్రతినిధి)



పోర్టు ఆధారిత అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని కేంద్ర పోర్టులు, షిప్పింగ్ శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ చెప్పారు. ఈ నేపథ్యంలో అన్ని విభాగాల్లో స్వయం సమృద్ధి సాధనలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. శనివారం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమిట్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పీఎం గతిశక్తి పథకంతో మౌలిక సదుపాయల కల్పన వేగవంతం కావడంతో పాటు ప్రాజెక్టుల వ్యయాలూ తగ్గుతున్నాయని చెప్పారు. వివిధ రవాణా మార్గాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెడుతోందని చెప్పారు. సుదీర్ఘ తీర ప్రాంతం గల ఆంధ్రప్రదేశ్ ఈ విషయంలో ముందంజలో ఉంటుందని అన్నారు. సాగర్‌మాలా కార్యక్రమం కింద ఆంధ్రప్రదేశ్‌లో రూ. 1.1 లక్షల కోట్ల విలువ చేసే 110 ప్రాజెక్టులను గుర్తించినట్లు సోనోవాల్ చెప్పారు. ఇప్పటికే రూ. 32,000 కోట్ల విలువ చేసే 32 ప్రాజెక్టులు పూర్తయినట్లు పేర్కొన్నారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన వైజాగ్ పోర్టు అంతర్జాతీయ వాణిజ్యంలో కీలకంగా ఉందని తెలిపారు. వైజాగ్ పోర్టు కార్గో విభాగం ఆరోగ్యకరమైన వృద్ధి సాధిస్తోందని తెలిపారు. మత్స్యకారులకు ప్రయోజనకరంగా ఉండేలా ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధి జరుగుతోంద అన్నారు. దాదాపు రూ. 97 కోట్లతో చేపట్టిన అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ పనులు పూర్తి కావొస్తున్నాయని చెప్పారు. ఇది ఈ ఏడాది ఏప్రిల్‌లోనే అందుబాటులోకి రావొచ్చని చెప్పారు.

ఆరోగ్య రంగంలో ఆదర్శ రాష్ట్రం

డాక్టర్ రెడ్డీస్ చైర్మన్ సతీష్‌రెడ్డి

- పారిశ్రామికంగా, సామాజికంగా ఏపీ పురోగమనం
- సీఎం జగన్ కృషి అభినందనీయం
- ఇక విశాఖ మరింత ఎదుగుతుంది

(విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ప్రాంగణం నుంచి సాక్షి ప్రతినిధి)



హెల్త్‌కేర్ విభాగంలో దేశానికి ఆదర్శంగా నిలిచే సామర్థ్యం ఆంధ్రప్రదేశ్‌కు ఉందని ఔషధ రంగ దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్ చైర్మన్ సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ ద్వారా ఎంతో మంది ప్రయోజనం పొందారని గుర్తు చేశారు. శనివారం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పలు సానుకూలాంశాలతో పెట్టుబడులకు ఏపీ అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తోందని చెప్పారు. పారిశ్రామికంగానే కాకుండా రాష్ట్రం సామాజికంగా పురోగమించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి జగన్ నాయకత్వంలో రాష్ట్రం వివిధ రంగాల్లో పటిష్టంగా ముందుకెళుతోందని ప్రశంసించారు.

లైఫ్ సైన్సెస్‌లో అపార అవకాశాలు

లైఫ్ సైన్సెస్ (జీవ శాస్త్రాలు) రంగంలో భారత్‌కు అపార వ్యాపార అవకాశాలున్నాయని సతీష్‌రెడ్డి తెలిపారు. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ విజయవంతంగా నిర్వహణ ద్వారా ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టి మనవైపు మళ్లుతుందన్నారు. మెడ్‌టెక్ జోన్‌తో మరిన్ని పెట్టుబడుల రాకకు అవకాశాలున్నాయని 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ప్రస్తుతం 45 బిలియన్ డాలర్లుగా ఉన్న దేశీయ ఫార్మా రంగం 2030 నాటికి 130 బిలియన్ డాలర్లకు చేరనుందని తెలిపారు.

విశాఖ మరింత వృద్ధి

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, మౌలిక సదుపాయాలు, వ్యాపారాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ద్వారా పెట్టుబడులకు ఏపీ అత్యంత అనువైన ప్రాంతంగా మారిందని తెలిపారు. విశాఖలో తమకు 5 ఫార్ములేషన్ యూనిట్లు, 2 బల్క్ డ్రగ్ యూనిట్లు ఉన్నాయని, పెట్టుబడులను కొనసాగిస్తున్నామన్నారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు ద్వారా కీలక మౌలిక సదుపాయాల కల్పన జరుగుతుందన్నారు. మరిన్ని పెట్టుబడులు రావడానికి ఇది దోహదపడుతుందన్నారు. పునరుత్పాదక విద్యుత్ విభాగంలో ఏపీలో భారీగా పెట్టుబడులు వస్తున్నాయని, వీటివల్ల మౌలిక సదుపాయాలు మెరుగుపడి పరిశ్రమలకు ఊతం లభిస్తుందన్నారు. విశాఖ పటిష్టంగా ఎదుగుతోందని, ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా సీఎం ప్రకటించిన నేపథ్యంలో విశాఖ మరింత వృద్ధి చెందడానికి ఆస్కారముంటుందన్నారు.

చైనా ప్లస్ వన్‌తో మనకు మేలు..

కోవిడ్ అనంతరం నెలకొన్న పరిస్థితులతో ఇతర దేశాలు తమ అవసరాల కోసం చైనా ప్లస్ వన్ (చైనాతో పాటు మరో దేశం) విధానాన్ని పరిశీలిస్తున్నాయని సతీష్‌రెడ్డి తెలిపారు. ఫార్మాకు సంబంధించి భారత్ అవకాశాలను అందిపుచ్చుకుంటుందన్నారు.

పెట్టుబడులకు అత్యుత్తమం

దేశ ఆర్థిక ప్రగతిలో ఏపీ కీలక పాత్ర

- ఈవోడీబీలో మూడేళ్లుగా నంబర్‌వన్ సామాన్య విషయం కాదు
- విజనరీ లీడర్‌షిప్‌తోనే ఆ ఘనత సాధ్యం
- అనుమతుల మంజూరులో అత్యుత్తమం
- దిగ్గజ ఫార్మా కంపెనీలన్నీ రాష్ట్రంలో ఉన్నాయి
- ప్రముఖ పారిశ్రామికవేత్తల ప్రశంసలు

సాక్షి, విశాఖపట్నం: అక్షర క్రమంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ముగింపు సదస్సులో పలువురు పారిశ్రామికవేత్తలు ప్రశంసించారు. విజనరీ లీడర్‌షిప్‌తో అన్ని రంగాల్లో ఏపీ దూసుకెళుతోందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపు రాష్ట్ర భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తుందని కొనియాడారు. పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్‌ను తమ తొలి ప్రాధాన్యతగా ఎంపిక చేసుకుంటామని స్పష్టం చేశారు.





హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ డాక్టర్ బండి వంశీ కృష్ణ, భారత్ బయోటెక్ ఎండీ సుచిత్రా ఎల్లాకు జ్ఞాపికను అందజేస్తున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఒక్క ఫోన్ కాల్ చాలు..



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పట్ల పరిశ్రమల యాజమాన్యాలన్నీ పూర్తి విశ్వాసంతో ఉన్నాయి. 11.47 శాతం వృద్ధితో ఏపీ అగ్రభాగంలో ఉండటం గర్వకారణం. దూరదృష్టి కలిగిన నాయకత్వం ఆధ్వర్యంలో రూపొందించిన పారిశ్రామిక పాలసీ అద్భుతమని అందరి మాటగా చెబుతున్నా. రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములుగా మారినందుకు సంతోషంగా ఉంది. రెండు రోజుల పాటు ఉత్సాహంగా సాగిన సదస్సులో ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలన్న సీఎం వైఎస్ జగన్ భరోసా అందర్నీ ఆకట్టుకుంది. ఆయన చెప్పిన మాట నిజంగా వాస్తవం. ఫోన్ చేస్తే ఏ సమస్యనైనా పరిష్కరిస్తున్నారు.

– గజానన్ నబర్, నోవా ఎయిర్ సీఈవో, ఎండీ

అసాధారణ ఘనత..



ప్రపంచమంతా పునరుత్పాదక ఇంధనం వైపు పయనిస్తోంది. ఈ రంగంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తోంది. ఏపీలో పంప్డ్ హైడ్రో ప్రాజెక్టులకు అనువైన స్థలాలను గుర్తించగలిగాం. సోలార్, విండ్, పంప్డ్ హైడ్రో పవర్ ఉత్పత్తిలో ఏపీ ప్రపంచంలోనే నంబర్1గా ఎదిగే అవకాశాలున్నాయి. దీని వెనుక సీఎం జగన్ అకుంఠిత దీక్ష ఉంది. గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులతో పాటు సోలార్, విండ్, హైడ్రో ప్రాజెక్ట్‌లలో ఇంటిగ్రేటెడ్ ఎనర్జీ రంగంలో ఏపీలో భారీగా పెట్టుబడులు పెడతాం. కర్బన రహిత పర్యావరణం కోసం ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేస్తోంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో మూడేళ్లుగా తొలి స్థానంలో నిలవడం సాధారణ విషయం కాదు. పారిశ్రామిక వాతావరణం అద్భుతంగా ఉండటం వల్లే ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్నాం. దేశ ఆర్థిక ప్రగతిలో ఏపీ కీలక పాత్ర పోషిస్తోంది.

– వినీత్ మిట్టల్, అవాదా గ్రూప్ చైర్మన్

చురుకైన ప్రభుత్వం..



రాష్ట్ర విభజన తర్వాత బల్క్ డ్రగ్ క్యాపిటల్‌గా ఏపీ మారింది. రాష్ట్రంలో కొన్ని అతిపెద్ద ఏపీఐ యూనిట్లు పని చేస్తున్నాయి. మేం 2007లో ఒక ఉద్యోగి స్థాయి నుంచి 8 వేల మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగామంటే సీఎం జగన్ అందించిన సహకారమే కారణం. ఇక్కడి పర్యావరణ వ్యవస్థ, చురుకైన ప్రభుత్వం, నిపుణులైన అధికారులు, నాయకులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటం వల్లే అది సాధ్యమైంది. ఏపీకి ప్రత్యేకంగా మార్కెట్ అవసరం లేదు. పారిశ్రామిక ప్రాంతాలు ఎక్కువగా పెడితే పెట్టుబడులు వస్తాయి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే డ్రగ్ కంట్రోలర్ అనుమతులతో సహా ప్రక్రియను వేగంగా నిర్వహించేలా డిజిటల్ డ్రైవ్‌లోనూ రాష్ట్రం అగ్రగామిగా ఉంది. ప్రపంచానికి కావాల్సిన ఔషధాలు ఏపీలో తయారవుతున్నాయి.

– సూర్యనారాయణ చావా, లారస్ ల్యాబ్స్ ఫౌండర్, సీఈవో

పరిశ్రమలు కోరుకునే సుస్థిర వాతావరణం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమర్థ నాయకత్వం కారణంగా సమ్మిట్‌లో అనూహ్యరీతిలో పెట్టుబడులు వచ్చాయి. పరిశ్రమలు కోరుకునే సుస్థిర విధానాలు, ఆహ్లాదకరమైన వాతావరణం రాష్ట్రంలో ఉంది. ఏపీలో పెట్టుబడులు పెట్టి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములైనందుకు ఆనందంగా ఉంది. పెట్టుబడుల్ని క్రమంగా ఇక్కడ విస్తరిస్తాం. నాణ్యమైన మానవ వనరులను అందించడం, పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేయడంలో రాష్ట్రం నంబర్‌వన్‌గా ఉంది. ఏ సమస్య వచ్చినా ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి పరిష్కరిస్తున్నారు. ఇచ్చిన హామీల్ని నెరవేరుస్తున్న చేతల ప్రభుత్వం ఏపీలో ఉన్నందున నిరభ్యంతరంగా పెట్టుబడులు పెట్టవచ్చు.

– సంతానం, సెయింట్ గోబెన్ సీఈవో

96 సేవలు ఒకే చోట



ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల స్థాపనకు అనువైన వాతావరణాన్ని రాష్ట్ర ప్రభుత్వం సృష్టించింది. కొత్తగా వచ్చే పరిశ్రమలకు 21 రోజుల్లో అన్ని అనుమతులను మంజూరు చేస్తున్నాం. 24 ప్రభుత్వ శాఖలకు చెందిన 96 సేవల్ని ఒకే చోట చేర్చి సింగిల్ విండో సిస్టమ్ ద్వారా అనుమతులను మంజూరు చేస్తున్నాం. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే ప్రతి సంస్థకు పూర్తి స్థాయి మద్దతిస్తూ ప్రతి విషయంలోనూ సహకరిస్తాం.

– డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

రెండేళ్లలో రూ.రెండు వేల కోట్లు

కోవిడ్ తర్వాత ఫార్మా రంగం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. భారత్‌ను ఫార్మాస్యూటికల్ రంగంలో భాగస్వామిగా చేసుకునేందుకు అనేక దేశాలు పోటీ పడుతున్నాయి. ఇది ఆంధ్రప్రదేశ్‌కు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. ఇప్పటికే ఫార్మా రంగంలో ఏపీ తనదైన ముద్ర వేసింది. ఇక్కడి పర్యావరణ వ్యవస్థ ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎంతో అనుకూలంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, చూపిస్తున్న చొరవ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారం కారణంగా ఏపీ వైపు చూస్తున్నాం. రాబోయే రెండేళ్లలో ఏపీలో రూ.2 వేల కోట్లు పెట్టుబడులు పెడతాం. దీని ద్వారా కనీసం 3,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

– వంశీకృష్ణ, హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ

మహిళా సాధికారతపై మరింతగా దృష్టి

సీఐఐ సదరన్ రీజియన్ చైర్‌పర్సన్ సుచిత్రా ఎల్లా

(విశాఖపట్నంలోని గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ప్రాంగణం నుంచి సాక్షి ప్రతినిధి)



మహిళా వ్యాపారవేత్తల సాధికారతపై భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) మరింతగా దృష్టి పెడుతోందని భారత్ బయోటెక్ ఎండీ, సీఐఐ సదరన్ రీజియన్ చైర్‌పర్సన్ సుచిత్రా ఎల్లా తెలిపారు. ఇందుకోసం మరిన్ని సీఐఐ చాప్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆమె వివరించారు. శనివారం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆమె ఈ విషయాలు చెప్పారు. స్వల్ప వ్యవధిలోనే ఆంధ్రప్రదేశ్ వివిధ రంగాల్లో అత్యంత వేగవంతమైన అభివృద్ధి సాధిస్తోందని సుచిత్రా ఎల్లా తెలిపారు. ఈ నేపథ్యంలో పలు అంతర్జాతీయ కంపెనీలు రాష్ట్రం వైపు చూస్తున్నాయని పేర్కొన్నారు. సమ్మిళిత అభివృద్ధి సాధన దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అభినందించారు. ఏపీలో పారిశ్రామిక ప్రగతికి సీఐఐ నుంచి పూర్తిస్థాయిలో తోడ్పాటు అందిస్తామని సుచిత్రా ఎల్లా చెప్పారు.

ఏపీకి శుభ పరిణామం



విశాఖ వేదికగా ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సు 2023 విజయవంతంగా జరిగింది. అనుకున్నదాని కన్నా ఎంతో స్పందన లభించింది. రెండురోజులు నిర్వహించిన సదస్సులో మొత్తం ఆరులక్షల మందికిపైగా ఉపాధి అవకాశాలు రావడం శుభపరిణామం. దేశంలో ఉన్న వివిధ దేశాల ప్రతినిధులు, అంబాసిడర్లు ఈ సదస్సుకు హాజరై పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడం మంచి నిర్ణయంగా భావిస్తున్నాం. ఇంత స్పందన వస్తుందని ఎవరు ఊహించలేదు.

– ఓబుల్‌రెడ్డి, చైర్మన్, హనీ గ్రూప్ కంపెనీ

నైపుణ్య మానవ వనరులకు ఏపీ చిరునామా

- రాష్ట్రంలో వనరులు అపారం, అవకాశాలు పుష్కలం
- జీఐఎస్‌లో చివరిరోజు ఆరురంగాల్లో సెమినార్లు
- పాల్గొన్న ఆర్థిక మంత్రి బుగ్గన, ప్రముఖ వ్యాపారవేత్తలు



ఆడిటోరియం-3లో 'స్కిల్లింగ్ ఏపీ ఫర్ సెర్వింగ్ గ్లోబల్ ఎకానమీ' రంగంలో చర్చా కార్యక్రమంలో పాల్గొన్న నైపుణ్య శాఖ ముఖ్య కార్యదర్శి సౌరభ్ గౌర్, ప్రముఖులు

సాక్షి, విశాఖపట్నం: 'ఆంధ్రప్రదేశ్‌లో సమృద్ధిగా సహజ వనరులున్నాయి.. సన్నద్ధంగా నైపుణ్య మానవవనరులు ఉన్నాయి.. నైపుణ్యవనరులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిరునామాగా నిలుస్తుంది..' అని రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చెప్పారు. విశాఖలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఎస్ఐ)లో రెండోరోజు శనివారం ఆరు సెక్టార్లలో సెమినార్‌లు నిర్వహించారు. వీటిలో ప్రధానంగా స్కిల్ డెవలప్‌మెంట్, ఫార్మాస్యూటికల్ అండ్ లైఫ్‌సైన్సెస్, పెట్రోలియం–పెట్రోకెమికల్స్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, హయ్యర్ ఎడ్యుకేషన్, టెక్స్‌టైల్స్ రంగాల్లో సెమినార్‌లు నిర్వహించారు. పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్న ఇన్వెస్టర్లకు ఏపీ ప్రభుత్వం అందించే అవకాశాలతో పాటు ఇక్కడ సమృద్ధిగా ఉన్న వనరులు, నైపుణ్యం కలిగిన యువత, పుష్కలంగా నీటివనరులు, నిరంతర విద్యుత్ సరఫరా, విస్తారంగా భూమి లభ్యత గురించి ఆయన వివరించారు.

స్కిల్లింగ్ ఏపీ ఫర్ సర్వింగ్ గ్లోబల్ ఎకానమీ

సదస్సు సెమినార్ హాల్లో జరుగుతున్న ప్యానల్ డిస్కషన్‌లో ముఖ్య అతిథిగా మంత్రి బుగ్గన హాజరయ్యారు. నైపుణ్యశాఖ ముఖ్య కార్యదర్శి సౌరభ్ గౌర్ అధ్యక్షతన 'స్కిల్లింగ్ ఏపీ ఫర్ సర్వింగ్ గ్లోబల్ ఎకానమీ' అనే అంశంపై వారు చర్చించారు. టాటా స్ట్రైవ్, సీఈవో అనితా రాజన్, ఈడీ4ఆల్ చైర్మన్ సంజయ్ విశ్వనాథన్, బెస్ట్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ వ్యవస్థాపకుడు భరత్‌లాల్ మీనా ఐఏఎస్ (విశ్రాంత), నాస్కామ్ ఫ్యూచర్ స్కిల్స్ సీఈవో కీర్తి సేథ్, సునీల్ దహియా (మాడరేటర్), నైపుణ్యాభివద్ధి, శిక్షణసంస్థ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి చర్చలో పాల్గొన్నారు. ముందుగా సౌరభ్ గౌర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 175 స్కిల్ హబ్‌లు, 26 స్కిల్ కాలేజీలు, ఒక స్కిల్ యూనివర్సిటీ, 55 స్కిల్ స్పోక్ ట్రైనింగ్ సెంటర్లు, స్కిల్ ఇంటర్నేషనల్ ఎకోసిస్టం ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 1,87,932 మందికి నిరుద్యోగులకు స్కిల్ ట్రైనింగ్ ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. 100కిపైగా జాబ్‌మేళాలు, 1,030 పూల్ డ్రైవ్స్ నిర్వహించినట్లు తెలిపారు. సీఎం ఎక్సలెన్స్ సెంటర్ల ద్వారా 102 ఇంజినీరింగ్ కాలేజీల్లో 1.72 లక్షల మందికి ట్రైనింగ్, ఎంప్లాయిబిలిటీ స్కిల్ సెంటర్ల ద్వారా 498 డిగ్రీ, పీజీ కాలేజీల్లో 2.27 లక్షలమందికి నైపుణ్య శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. స్కిల్స్ స్పోక్స్-ఇండస్ట్రీ కస్టమైజ్‌డ్ స్కిల్ ట్రైనింగ్‌లో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగాలు కల్పించాలనేది ఎంవోయూలో ప్రధానంగా ఉందన్నారు. ఇప్పటివరకు 21,411 మందికి శిక్షణ ఇచ్చామని, వీరిలో 18,043 మందికి ప్లేస్‌మెంట్ కల్పించామని చెప్పారు.

ఏపీఎస్ఎస్‌డీసీ రంగంలో 40 ఎంవోయూలు

టాటా స్ట్రైవ్, ఈడీ4ఆల్, సాని భారత్, ద టైమ్స్ గ్రూప్, జేబీఎం గ్రూప్, జేసీబీ ఇండియా లిమిటెడ్, ప్రకార్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఆరెంజ్ క్రాస్, ఎకొహామా ఇండియా, గ్రీన్‌కో గ్రూప్, ఈ–ప్యాక్ కాంపోనెట్స్, డైకిన్ ఇండియా, ష్నైదర్ ఎలక్ట్రిక్, వింగ్‌టెక్ ఇండియా, బొల్లినేని మెడ్‌స్కిల్స్, అపోలో మెడ్‌స్కిల్స్, ఎడ్యునెట్ ఫౌండేషన్, విహాన్ ఎలక్ట్రిక్స్, టెక్‌నోడోమ్ ఇండియా, రమ్యశ్రీ ఎలక్ట్రికల్ ఆటోమేషన్, ఇండస్ ఇన్‌ఫోటెక్, బ్రాండెక్స్, నాస్కామ్ ఫ్యూచర్ స్కిల్స్, లాజిస్టిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్, కాపిటల్ గూడ్స్ స్కిల్ కౌన్సిల్, కన్‌స్ట్రక్షన్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఎలక్ట్రానిక్ సెక్టార్ స్కిల్ ఇండియా, ఆటోమేటివ్ సెక్టార్, డొమెస్టిక్ వర్కర్స్ సెక్టార్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎక్విప్‌మెంట్, లెథర్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, హైడ్రోకార్బన్స్, టెక్స్‌టైల్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ తదితర సంస్థలు ఏపీఎస్ఎస్‌డీసీ రంగంలో 40 ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ ఎంవోయూలను మంత్రి బుగ్గన చేతుల మీదుగా అందజేశారు.



నేను వ్యాపారవేత్తగా మారతా



ప్రస్తుతం నేను ఎంబీఏ చివరి సంవత్సరం చదువుతున్నాను. విభిన్న దేశాల నుంచి వచ్చిన వ్యాపారవేత్తలతో మాట్లాడే అవకాశం లభించింది. బిజినెస్ వరల్డ్‌లో పనిచేసే మాకు ఈ సదస్సు ఎంతో ఉపయుక్తంగా నిలిచింది. భవిష్యత్తులో నేను కూడా సొంత సంస్థను ప్రారంభించాలని భావిస్తున్నాను. దీనికి అవసరమైన స్ఫూర్తి ఇక్కడ లభించింది.

– గొఫానా, విద్యార్థిని, బోట్స్‌వానా

ఏఐ, పునరుత్పాదక రంగాల్లో అవకాశాలు



భవిష్యత్తును నిర్దేశించిన రంగాలను తెలుసుకోడానికి ఈ సదస్సుకు వచ్చాను. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన జీఐఎస్‌తో అనేక విషయాలను గ్రహించాను. భారీ పారిశ్రామికవేత్తలు ఏయే రంగాలపై ఎక్కువగా పెట్టుబడులు పెడుతున్నారో తెలుసుకున్నాను. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో ముున్ముందు ఉద్యోగావకాశాలు ఎక్కువగా లభించే అవకాశాలున్నాయి.

– శ్రేయాశర్మ, విద్యార్థిని, నేపాల్

ప్రభుత్వానికి హ్యాట్సాఫ్



ఆంధ్రప్రదేశ్‌లో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ఇటువంటి సమ్మిట్‌లు చాలా అవసరం. దేశంలో ఉన్న పెద్దపెద్ద పారిశ్రామికవేత్తలను ఒకే వేదికపైకి తీసుకురావడం అంత తేలికైన విషయం కాదు. ఇంతటి భారీపరిశ్రమలు రాష్ట్రానికి వస్తే ఇక్కడ ఉన్న లక్షలాదిమందికి ఉద్యోగాలు లభిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వానికి హ్యాట్సాఫ్. భవిష్యత్తులో కూడా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించాలి.

– దావా జర్గల్, విద్యార్థిని, మంగోలియా

అంచనాలకు మించి సదస్సు



ఇన్వెస్టర్స్ సమ్మిట్ మా అంచనాలకు మించి నిర్వహించారు. మేము వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ రంగంలో పనిచేస్తున్నాం. యూరప్ ఖండంతో ప్రధానంగా ఫిన్లాండ్ దేశంతో అనుసంధానం చేసేదిశగా పనిచేస్తున్నాం. ఈ సదస్సుకు వచ్చిన అనేకమంది పారిశ్రామికవేత్తలను కలిసే అవకాశం కలిగింది. ప్రభుత్వంతో అధికారికంగానే కాదు.. ఇక్కడికి వచ్చేవారితో అనేక అనధికార ప్రైవేటు ఒప్పందాలు కూడా జరిగాయి. సదస్సు ఏర్పాట్లు చాలా బాగున్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు విధానాలు చాలా సరళంగా ఉన్నాయి.

– రెతా మోచెర్ల, ప్రాజెక్ట్స్ వైస్‌ప్రెసిడెంట్, పాంగియా, ఫిన్లాండ్ పారిశ్రామికవేత్త

వైవిధ్యమైన సంస్థలు వచ్చాయి



ఈ సదస్సుకు వైవిధ్యత కలిగిన సంస్థలు వచ్చాయి. రూ.13 లక్షల కోట్లు పెట్టుబడుల ప్రతిపాదనలు కార్యరూపం దాలిస్తే లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇంతటి భారీ ప్రాజెక్టులు పూర్తయి కమర్షియల్ ప్రొడక్షన్ ప్రారంభమైతే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూడా మెరుగుపడుతుంది. రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు మరింత మేలు చేసే అవకాశం ఏర్పడుతుంది.

– డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్, చీఫ్ కో–ఆర్డినేటింగ్ ఆఫీసర్, ఏఐసీటీఈ

బ్రిటిష్ సంస్థలు ఆసక్తి చూపాయి



ఎగ్జిబిషన్‌లో మేం పెట్టిన స్టాల్స్‌ను కేంద్ర విద్యాశాఖ అధికారులు సందర్శించారు. బ్రిటిష్ హై కమిషనర్ మమ్మల్ని ఆహ్వానించారు. తమ దేశంలో ఈ సాంకేతికతను అమలు చేయాలని కోరారు. మేం అభివృద్ధి చేసిన భారత బాలశిక్ష విభిన్న భారతీయ భాషల్లో అభ్యసనానికి ఉపయుక్తంగా ఉంది. ఎగ్జిబిషన్‌లో అనేక మంది దీన్ని సందర్శించారు. ప్రభుత్వం మాకు మంచి వేదికను ఏర్పాటు చేసి అవకాశం కల్పించింది.

– గోపీకుమార్ బులుసు, డ్రీమ్ చిప్ ఎలక్ట్రానిక్స్

విశాఖ నుంచి సేవలు ప్రారంభిస్తాం



సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్న మా సంస్థ విద్యార్థులకు అవసరమైన శిక్షణ, ఉపాధి కల్పన రంగాల్లో కూడా పనిచేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు అవసరమైన శిక్షణ అందించే కార్యక్రమం చేపట్టాం. విశాఖ నుంచి కూడా త్వరలో మా సేవలు ప్రారంభిస్తాం.

– విశ్వనాథ్ తంగిరాల, మేనేజింగ్ డైరెక్టర్, టెక్ బుల్స్

ఇంటర్న్‌షిప్‌లకు అనుకూలం



ఇటువంటి సమ్మిట్‌లు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తాయి. విద్యార్థులకు అవసరమైన ఇంటర్న్‌షిప్‌లు, ప్లేస్‌మెంట్ కల్పనకు అవసరమైన వనరులు ఇక్కడ ఉన్నాయి. విభిన్న సంస్థల ప్రతినిధులతో మాట్లాడాం. పారిశ్రామిక రంగాల్లో అవకాశాలను దక్కించుకోడానికి కావాల్సిన నైపుణ్యాలపై వారిచ్చిన సలహాలు, సూచనలను విద్యార్థులకు తెలియజేస్తాం. తద్వారా విద్యార్థుల కెరీర్ బిల్డింగ్‌కు అది దోహదపడుతుంది.

– వి.ఆర్.రెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి, ఏయూ

ఉపాధి అవకాశాలు పెరుగుతాయి



రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఇన్వెస్టర్స్ సమ్మిట్‌తో కొత్తగా భారీ పరిశ్రమలు రాష్ట్రానికి రావడం ద్వారా విద్యార్థులకు మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అలాగే ఇటువంటి సమ్మిట్‌లకు పారిశ్రామికవేత్తలు పెద్దసంఖ్యలో రావడంతో విద్యార్థులు వారిని కలిసి వారి సలహాలు, సూచనలు తెలుసుకునే అవకాశం కలిగింది. కొంతమంది స్టార్టప్‌లు ప్రారంభించి పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఇది దోహదపడుతుంది.

– ఆచార్య ఎస్.రజని, ప్రిన్సిపాల్, గాయత్రి విద్యాపరిషత్

– ఏయూ క్యాంపస్

ఏపీ ఓ బంగారు గని

రాష్ట్రంలో పుష్కలంగా గ్రీన్ అమ్మోనియా.. పునరుత్పాదక ఇంధనంపై ప్రభుత్వ చర్యలు భేష్

- సీఎం జగన్ దార్శనికుడు
- వాణిజ్య, ఆర్థిక సంబంధాలపై రాష్ట్రంతో కలిసి పనిచేయడానికి సిద్ధం
- జీఐఎస్‌లో ఫార్టెస్క్యూ ఫ్యూచర్ ఇండస్ట్రీస్ సౌత్, సౌత్‌ఈస్ట్ అధ్యక్షుడు అలార్డ్



మాట్లాడుతున్న ఫార్టెస్క్యూ ఫ్యూచర్ ఇండస్ట్రీస్ సౌత్ అండ్ సౌత్ ఈస్ట్ అధ్యక్షుడు అలార్డ్ ఎం.నూయ్

దొండపర్తి (విశాఖ దక్షిణ): పునరుత్పాదక ఇంధన ఉత్పత్తికి అవసరమయ్యే గ్రీన్ అమ్మోనియా ఏపీలో పుష్కలంగా ఉందని, రాష్ట్రం ఒక బంగారు గని అని ఫార్టెస్క్యూ ఫ్యూచర్ ఇండస్ట్రీస్ సౌత్ అండ్ సౌత్‌ఈస్ట్ అధ్యక్షుడు అలార్డ్ ఎం.నూయ్ అభివర్ణించారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్) రెండోరోజైన శనివారం ఆడిటోరియం–4లో పశ్చిమ ఆస్ట్రేలియా, వియత్నాం దేశాల ప్రతినిధులతో సెషన్స్ నిర్వహించారు. ఇందులో పశ్చిమ ఆస్ట్రేలియా ప్రతినిధిగా పాల్గొన్న అలార్డ్ ముందుగా ఆ దేశంలో పునరుత్పాదక ఇంధన ఉత్పతికి అనుసరిస్తున్న మార్గాలు, అందుకు అవసరమయ్యే ఖనిజాలను వెలికితీసేందుకు చేపడుతున్న చర్యలను వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టిసారించడం ప్రశంసించదగ్గ విషయమన్నారు. రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ద్వారా పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి ప్రాజెక్టులకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం శుభపరిణామమన్నారు. భవిష్యత్తులో గ్రీన్ హైడ్రోజన్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిపైనే దేశాలన్నీ దృష్టిసారిస్తాయని అలార్డ్ అభిప్రాయపడ్డారు. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల ఏర్పాటుకు కొన్ని ప్రైవేటు పరిశ్రమలతో ఏపీ ప్రభుత్వం ఇప్పటికే ఒప్పందాలు చేసుకుందని గుర్తుచేశారు. ఇది రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతకు నిదర్శనమని కొనియాడారు. దీని ఫలితంగానే రాష్ట్రం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో వరుసగా మూడో ఏడాది కూడా ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రస్తుతించారు.

ఆక్వా ఉత్పత్తుల ఎగుమతుల్లో ఏపీ టాప్

దేశంలో ఆక్వా ఉత్పత్తుల ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ కీలక భూమిక పోషిస్తోందని మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ టీఆర్ గిబిన్ కుమార్ తెలిపారు. జీఐఎస్‌లో జరిగిన మరో సెషన్‌లో రాష్ట్రంలో ఆక్వా, మెరైన్ ఉత్పత్తులు, ఇక్కడున్న వ్యాపార అవకాశాలను వియత్నాం ఎంబసీ ప్రతినిధులకు ఆయన వివరించారు. ఈ సందర్భంగా గిబిన్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్త పోర్టులతోపాటు ప్రతీ 50 కిలోమీటర్లకు ఒక హార్బర్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. ఒకవైపు సముద్ర ఉత్పత్తులతోపాటు రిజర్వాయర్లు, చెరువులు, ఇతర ఆక్వా ఉత్పత్తులను ప్రోత్సహించే విషయంపై ప్రభుత్వం దృష్టిసారించిందని చెప్పారు. అలాగే.. మెరైన్, ఆక్వా రంగానికి అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు ఉత్పత్తుల ఎగుమతులపై కూడా దృష్టి సారించాలని వియత్నాం ఎంబసీ ట్రేడ్ ఆఫీస్ ఫస్ట్ సెక్రటరీ డూ డుయ్ ఖాన్, ఎంబసీ పొలిటికల్ కౌన్సిలర్ థి ఎన్‌జాగ్ డెంగ్ ఎన్‌గుయెన్‌లను కోరారు. అలాగే, వియత్నాం మెరైన్ రంగంలో ఉన్న వాణిజ్య, వ్యాపార అవకాశాలను ఎంబసీ అధికారులు వివరించారు. ఈ సెషన్‌లో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ అడిషినల్ డైరెక్టర్ పి. కోటేశ్వరరావు, మ్యాట్రిక్స్ సీ ఫుడ్స్ ఇండియా లిమిటెడ్ సీఈఓ శివప్రసాద్ వెంపులూరు పాల్గొన్నారు.

ఏపీతో కలిసి పనిచేస్తాం..

గత కొన్నేళ్లుగా పశ్చిమ ఆస్ట్రేలియా.. భారత్‌తో, ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో కలిసి వాణిజ్య, ఆర్థిక కార్యకలాపాలను కొనసాగిస్తోందని అలార్డ్ గుర్తుచేశారు. భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులను ఆహ్వానించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చొరవను ఆయన అభినందించారు. అయితే, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలు, ప్రాజెక్టులకు కల్పించే మౌలిక సదుపాయాలపై పాలసీ ప్రకటిస్తే విదేశీ పెట్టుబడులు ఆంధ్రాకు పెద్దఎత్తున వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. ఇక రాష్ట్రంతో మరిన్ని వాణిజ్య, ఆర్థిక సంబంధాల మెరుగుకోసం ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

త్వరలో కొత్త ఇండస్ట్రీ పాలసీ

దేశంలో ఉన్న పారిశ్రామిక దిగ్గజ సంస్థలే కాకుండా విదేశాల నుంచి పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించడంపై ప్రభుత్వం దృష్టిసారించిందని రాష్ట్ర ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె. విజయానంద్ తెలిపారు. ఇందులో భాగంగా త్వరలోనే ప్రభుత్వం కొత్త ఇండస్ట్రియల్ పాలసీని ప్రవేశపెట్టనుందన్నారు. దేశం నుంచే కాకుండా విదేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షించేలా ఈ పాలసీని రూపొందించినట్లు వివరించారు. రాష్ట్రంలో అవలంబిస్తున్న మైనింగ్ విధానాలు, అందుబాటులో ఉన్న వనరులను మైన్స్ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి వివరించారు. ఈ సమావేశానికి పశ్చిమ ఆస్ట్రేలియా ప్రతినిధులకు, రాష్ట్ర అధికారులకు సమన్వయకర్తగా ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ నషీద్ చౌదరి వ్యవహరించగా, హెచ్‌ఏఎస్ హోల్డింగ్స్ డైరెక్టర్ అక్షయ్ పాల్గొన్నారు.

‘దివీస్’ మరో రెండు ప్లాంట్లు

సుమారు రూ.1,500 కోట్ల పెట్టుబడి

- బల్క్ డ్రగ్ పార్క్‌తో రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు
- ‘సాక్షి’ ఇంటర్వ్యూలో దివీస్ వైస్ ప్రెసిడెంట్ మధుబాబు

(విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ప్రాంగణం నుంచి సాక్షి ప్రతినిధి)



ఫార్మా దిగ్గజం దివీస్ ల్యాబరేటరీస్ ఏపీలో మరో రెండు యూనిట్లు నెలకొల్పనుంది. ఇందుకు దాదాపు రూ.1,480 కోట్లు వెచ్చిస్తోంది. ఇప్పటికే రూ.780 కోట్ల ప్రతిపాదన ఆమోదం పొందగా కొత్తగా మరో రూ.700 కోట్ల ప్రతిపాదనలకు ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో అదనంగా 22 వేల ఉద్యోగాల కల్పన జరుగుతుందని దివీస్ వైస్ ప్రెసిడెంట్ మధుబాబు వెల్లడించారు. శనివారం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ‘సాక్షి’ ప్రతినిధికి ఇంటర్వ్యూ ఇచ్చారు. కాకినాడలో రెండో దశ కింద ఒక యూనిట్, కృష్ణపట్నం దగ్గర మరొక దివీస్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇవి ఎగుమతి ఆధారిత యూనిట్లుగా ఉంటాయని వివరించారు. కొన్ని సమస్యల వల్ల కాకినాడ యూనిట్ పనులు గతంలో ముందుకు సాగలేదని, అవి పరిష్కారం కావడంతో రెండోదశ పనులు చేపట్టడానికి మార్గం సుగమమైందని చెప్పారు. మిగతా ప్రక్రియ పూర్తయితే రెండేళ్లలో అందుబాటులోకి వస్తుందన్నారు.

బల్క్‌డ్రగ్ పార్కుతో పరిశ్రమకు ప్రయోజనం..

బల్క్ డ్రగ్ పార్కు రాకతో ఫార్మా పరిశ్రమకు గణనీయమైన ప్రయోజనం చేకూరుతుంది. పెట్టుబడులు పుష్కలంగా వచ్చేందుకు ఇది దోహదం చేస్తుంది. అనువైన స్థలం అందుబాటులో ఉంటే సంస్థలకు మూడేళ్ల సమయం కలసి వస్తుంది.

దిగుమతులు తగ్గించుకుని..

కాకినాడ యూనిట్ ఎగుమతుల ఆధారితమైనదిగా ఉంటుంది. చైనా నుంచి దిగుమతులను తగ్గించుకుని ఇక్కడే ఉత్పత్తి చేయాలన్నది లక్ష్యం. ఇక్కడ తయారు చేసే ఉత్పత్తులను మా సొంత అవసరాలకు వినియోగంతో పాటు ఇతర వినియోగదారులకు అందచేస్తాం. మరి కొంత ఎగుమతి చేస్తాం. కృష్ణపట్నం యూనిట్ ద్వారా కొంత దిగుమతి చేసుకుని దానికి విలువ జోడించి ఎగుమతి చేస్తాం. కోవిడ్ అనంతరం మార్కెట్‌లో కొంత ఒడిదుడుకులు ఏర్పడ్డాయి. చైనా నుంచి దిగుమతులు తగ్గడం, ధరలపరంగా మార్పులు రావడం తదితర పరిణామాలు చోటు చేసుకున్నాయి. దిగుమతులను తగ్గించుకునే దిశగా డ్రగ్ సెక్యూరిటీ విధానం కింద ఫార్మా సంస్థలు కలిసి దేశీయంగా ఇంటర్మీడియరీలు మొదలైన వాటి విషయంలో స్వయం సమృద్ధిపై దృష్టి పెడుతున్నాయి.

‘అపాచీ’ మరో 100 మిలియన్ డాలర్లు

- 10 వేల ఉద్యోగాల కల్పన
- ఏపీలో ప్లాంటే అతి పెద్దది

(విశాఖపట్నంలోని గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ప్రాంగణం నుంచి సాక్షి ప్రతినిధి)



అపాచీ ఇండియా డైరెక్టర్ సెర్గియో లీని సన్మానిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, సీఎం జగన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టనున్నట్లు అపాచీ ఇండియా డైరెక్టర్ సెర్గియో లీ వెల్లడించారు. మరో 100 మిలియన్ డాలర్లు (రూ.820 కోట్లు) పెట్టుబడుల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. తద్వారా 10 వేల ఉద్యోగాలను కల్పించనున్నట్లు చెప్పారు. శనివారం గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అపాచీకి చైనా, భారత్, వియత్నాంలో ప్లాంట్లు ఉండగా ఆంధ్రప్రదేశ్ ప్లాంటే అతి పెద్దదని వివరించారు. ఏపీలో ప్లాంట్‌పై ఇప్పటిదాకా 100 మిలియన్ డాలర్లు వెచ్చించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల ద్వారా వ్యాపారాల నిర్వహణ సులభతరంగా మారిందనేందుకు తమ సంస్థే ప్రత్యక్ష ఉదాహరణ అని తెలిపారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అత్యంత తక్కువ వ్యవధిలోనే తమకు అనుమతులు లభించినట్లు గుర్తు చేసుకున్నారు. సింగిల్ విండో క్లియరెన్స్‌తో పాటు సంస్థ ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల తోడ్పాటును ప్రభుత్వం అందించిందన్నారు. వైఎస్సార్ దార్శనికతను సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం కొనసాగిస్తోందని ప్రశంసించారు.

క్రియాశీలకంగా ప్రభుత్వం..

పారిశ్రామిక వర్గాల అభిప్రాయాలను తెలుసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత క్రియాశీలకంగా వ్యవహరిస్తోందని లీ తెలిపారు. రాష్ట్రంలో మానవ వనరులు, మౌలిక సదుపాయాలు మొదలైన వాటి లభ్యత పుష్కలంగా ఉందన్నారు. ఈ సానుకూలతలవల్లే రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని అపాచీ గ్రూప్ నిర్ణయించుకున్నట్లు చెప్పారు.

అపారెల్, టెక్స్‌టైల్స్ అవకాశాలు అపారం

- ఆంధ్రప్రదేశ్‌లో వనరులు పుష్కలం
- ఈ రంగంలో వియత్నాంకు ఏమాత్రం తీసిపోదు
- జీఐఎస్ రెండో రోజు టెక్స్‌టైల్స్, అపారెల్ సెషన్‌లో నిపుణులు



ప్యానెల్ చర్చలో మాట్లాడుతున్న సుచిర సురేంద్రనాథ్

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో అపారెల్, టెక్స్‌టైల్స్ రంగాలకు అపార అవకాశాలున్నాయని ఆ రంగ నిపుణులు పేర్కొన్నారు. పెట్టుబడులకు అవసరమైన అన్ని వనరులు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. విశాఖలో జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ (జీఐఎస్) రెండో రోజు శనివారం ‘టెక్స్‌టైల్స్ అండ్ అపారెల్స్’ అనే అంశంపై ప్యానెల్ చర్చ జరిగింది. ఈ సందర్భంగా వజీర్ అడ్వైజర్స్ కో ఫౌండర్ అండ్ జేఎండీ ప్రశాంత్ అగర్వాల్ మాట్లాడుతూ.. టెక్స్‌టైల్స్ రంగానికి ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానమని తెలిపారు. టెక్స్‌టైల్స్‌తో పాటు ఇతర రంగాలకు రాష్ట్రం ఎంతో అనువైందన్నారు. టెక్స్‌టైల్స్, అపారెల్స్‌లో అగ్రగామిగా ఉన్న వియత్నాంకు ఏపీ ఏమాత్రం తీసిపోదని చెప్పారు. మౌలిక సదుపాయాలతోపాటు పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం సత్వరమే అన్ని అనుమతులు ఇవ్వడం పెట్టుబడిదార్లకు కలిసొచ్చే అంశమని తెలిపారు. బ్రాండిక్స్ స్ట్రాటజీ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ డైరెక్టర్ సుచిర సురేంద్రనాథ్ మాట్లాడుతూ 2007లో ఆంధ్రప్రదేశ్‌లో తమ ప్రాజెక్టులు ప్రారంభించామన్నారు. అప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని చెప్పారు. ఈ రంగంలో ఏపీకి ఉజ్వల భవిష్యత్ ఉందన్నారు. రేయాన్ గ్లోబల్ ఆసియా– పసిఫిక్ సేల్స్ హెడ్ సచిన్ మాలిక్ మాట్లాడుతూ.. ఏపీలో టెక్స్‌టైల్స్ రంగ పెట్టుబడులకు అనుకూల పరిస్థితులున్నాయని వెల్లడించారు. రాష్ట్ర టెక్స్‌టైల్స్ అండ్ హ్యాండ్లూమ్స్ ముఖ్య కార్యదర్శి కె.సునీత మాట్లాడుతూ.. అపారెల్, టెక్స్‌టైల్స్ రంగంలో పెట్టుబడులకు ముందుకొచ్చే వారిని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తోందని తెలిపారు. విద్యుత్, భూములు, నీటి సదుపాయం వంటివి అందుబాటులో ఉన్నాయన్నారు. పారిశ్రామిక పాలసీలోనూ టెక్స్‌టైల్స్ రంగానికి సానుకూల అంశాలున్నాయని వివరించారు. ఇతర రాష్ట్రాలకంటే తక్కువ ధరకే విద్యుత్ ఇస్తున్నామని, భూ బదలాయింపు చార్జీలు కూడా తక్కువేనన్నారు. ఎర్లీబర్డ్ విధానంలో ఆరు నెలల్లోపు యూనిట్‌ను ఏర్పాటు చేస్తే ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీలు ఇస్తుందని తెలిపారు. ఇన్ని అనుకూలతలున్న రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు రావాలని ఆమె కోరారు. ప్యానెల్ చర్చలో టెక్స్‌టైల్స్ అండ్ హ్యాండ్లూమ్స్ కమిషనర్ ఎంఎం నాయక్ కూడా పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది



పరిశ్రమలు స్థాపించిన వారికి ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది. గుంటూరు జిల్లా రాజుపాలెంలో 2012లో స్పిన్నింగ్ మిల్లు ఏర్పాటు చేశాను. గతంలో ప్రతి మూడేళ్లకోసారి పర్యావరణ అనుమతులు పునరుద్ధరించుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు వాటిని ఐదేళ్లకు, అగ్నిమాపక అనుమతుల పునరుద్ధరణను ఏడాదికి బదులు మూడేళ్లకు పెంచారు. ఏదైనా సమస్యపై స్పందనలో ఫిర్యాదు చేస్తే 15 రోజుల్లోనే పరిష్కరిస్తున్నారు. ఇవన్నీ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్నాయి.

– పి.చలపతిరావు, ఎండీ, పచ్చల స్పింటెక్స్ ప్రైవేటు లిమిటెడ్

వేగంగా అనుమతులు



ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల స్థాపనకు అనుమతులు వేగంగా లభిస్తున్నాయి. వీటిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. వైఎస్సార్ జిల్లాలో రూ.65 కోట్లతో గార్మెంట్స్ పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నాను. దీని ద్వారా రెండు వేల మందికి ఉపాధి కల్పించబోతున్నాం. ప్రభుత్వం ఈ ఫ్యాక్టరీ భూమికి రాయితీ ఇచ్చింది. ప్రభుత్వ ప్రోత్సాహంతో పరిశ్రమ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేస్తున్నాం. డిసెంబర్ నుంచి వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభిస్తాం.

– శశిశేఖర్, ఎండీ, టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, బెంగళూరు

హైడ్రోజన్ ప్రాజెక్టులోకి గ్రీన్ కో

- కొత్త అడుగులు వేస్తున్న తెలుగు రాష్ట్రాలకు చెందిన సంస్థ
- రాష్ట్ర ప్రభుత్వంతో నాలుగు ఒప్పందాలు
- రూ.34,500 కోట్ల పెట్టుబడులు, 7,050 మందికి ఉపాధి కల్పన



రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో ఎంవోయూ కుదుర్చుకుంటున్న గ్రీన్ కో ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం: పునరుత్పాదక ఇంధన వనరుల విభాగంలో దేశంలోనే మొదటిసారిగా కర్నూలులో భారీ పంప్డ్ స్టోరేజీని అభివృద్ధి చేస్తున్న తెలుగు రాష్ట్రాలకు చెందిన సంస్థ గ్రీన్ కో సరికొత్త అడుగులు వేస్తోంది. గ్రీన్ హైడ్రోజన్ హబ్‌ని సృష్టించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వంతో నాలుగు భారీ ఒప్పందాలు చేసుకుంది. విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ఇందుకు వేదికైంది. సోలార్ మాడ్యూల్స్, ఆల్కలీన్ ఎలక్ట్రోలైజర్‌ల తయారీ, 3 గిగావాట్ల సోలార్ మాడ్యూల్స్ తయారీ సామర్థ్యంతో గ్రీన్ స్పెషాలిటీ కెమికల్స్‌ని రూపొందించడం, 2 గిగావాట్ల ఎలక్ట్రోలైజర్, ఓవర్‌టీపీ 0.5 తయారీ ప్లాంట్‌ను కాకినాడలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతో గ్రీన్ కో ఎంవోయూ చేసుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.15 వేల కోట్ల పెట్టుబడులతోపాటు 4వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించనుంది. నంద్యాలలో ఇప్పటికే మంజూరైన ఐఆర్‌ఈపీ ప్రాజెక్టులో పంప్డ్ స్టోరేజీ సామర్థ్యాన్ని 1,200మెగావాట్ల నుంచి 1,680 మెగావాట్లు, సోలార్ పవర్ ప్రాజెక్టు సామర్థ్యాన్ని 1,000 నుంచి 2,300 మెగావాట్లకు పెంచేందుకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సమక్షంలో గ్రీన్ కో ఐఆర్‌ఈపీ గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బరాజు పెన్మత్స శనివారం ఎంవోయూపై సంతకాలు చేశారు. దీని ద్వారా గ్రీన్ కో రూ.6,500 కోట్లు పెట్టుబడులు పెట్టనుంది. అలాగే 1,300 మందికి ఉపాధి కల్పించనుంది. ఏపీలో కర్బన ఉద్గారాల సేకరణకు సంబంధించి కూడా గ్రీన్ కో ఎంవోయూ కుదుర్చుకుంది. ఏపీ జెన్‌కోతో కలిసి థర్మల్ పవర్ స్టేషన్లలో ఏడాదికి 500 కిలో టన్నుల కార్బన్ క్యాప్చర్ ప్రాజెక్టుని ఏర్పాటు చేయనుంది. రూ.2,000 కోట్ల పెట్టుబడులతో 250మందికి ఉపాధి కల్పించనుంది. ఏడాదికి ఒక మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేసేందుకు గ్రీన్ కో సీఈవో, ఎండీ అనిల్ చలమలశెట్టి, విజయానంద్ ఎంవోయూ కుదుర్చుకున్నారు. కాకినాడలో ఏర్పాటుచేయనున్న ఈ ప్లాంట్ కోసం గ్రీన్ కో రూ.11 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. 1,500 మందికి ఉపాధి లభిస్తుంది.

కర్నూలులో హెచ్‌ఏఎల్ టెస్ట్ రేంజ్

- ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం
- మంత్రి బుగ్గనకు వివరించిన హెచ్‌ఏఎల్ జీఎం అరుణ్ జే సర్కటే

సాక్షి, విశాఖపట్నం: హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) ఆధ్వర్యాన కర్నూలులో టెస్ట్ రేంజ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని హెచ్‌ఏఎల్ జనరల్ మేనేజర్ అరుణ్ జే సర్కటే తెలిపారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో భాగంగా ఏపీ పెవిలియన్ పారిశ్రామిక ప్రదర్శనలో హెచ్‌ఏఎల్ స్టాల్ ఏర్పాటు చేసింది. ఈ స్టాల్‌ను ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ శనివారం సందర్శించారు. హెచ్‌ఏఎల్ కార్యక్రమాలు, సైనిక దళాల అవసరాల కోసం తమ సంస్థ తయారు చేస్తున్న యుద్ధ హెలికాప్టర్లు తదితర అంశాలను అరుణ్ జే సర్కటే వివరించారు. ఏపీలో ఏదైనా యూనిట్ ఏర్పాటు చేయాలని మంత్రి బుగ్గన సూచించగా... ఇప్పటికే కర్నూలులో టెస్ట్ రేంజ్ యూనిట్ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. ఈ మేరకు ప్రతిపాదనలు కూడా సిద్ధం చేస్తున్నామని చెప్పారు. మంత్రి వెంట సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ టి.విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
ఆదివారం ॥ 5-3-2023



సుజలాం సుఫలాం

వీరు సు'జల'శక్తిమంతులు



స్వచ్ఛ్ సుజల శక్తి సమ్మాన్ పురస్కార గ్రహీతలు

ఇంట్లో నీటి సమస్యను తీర్చడానికి దేశంలో చాలా చోట్ల మహిళలు పడే అవస్థల గురించి మనకు తెలిసిందే. అలాంటి ఊరందరి నీటి సమస్యను తీర్చాలంటే ఇంకెంత అవస్థ పడాలి. తమ గ్రామాలకు వచ్చిన నీటి కష్టం తీరాలంటే పూడుకుపోయిన చెరువును పునరుద్ధరించాలని, నదిని పునరుజ్జీవింపచేయాలని, కుళాయిలను ఏర్పాటు చేయాలనే ఆలోచనలు చేసి, దానిని అమలు చేస్తున్నారు గంగా రాజ్‌పుత్, గాయత్రీదేవి, శారదాదేవి, అనితా చౌదరి, కె.ఆశా. వీరిని కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ గుర్తించి ఈ యేడాది స్వచ్ఛ్ సుజల శక్తి సమ్మాన్ పురస్కారంతో సన్మానించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం ఢిల్లీలో వీరికి అవార్డులు అందజేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఈ మహిళలు పురుషాధిపత్యం పైనే కాదు, మూఢనమ్మకాల పైనా పోరాడుతూ తమ గ్రామాల్లో నీటి ఎద్దడి సమస్యను తీర్చడానికి నడుం కట్టారు.

గంగా ప్రవాహం...

మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్‌కు చెందిన 35 ఏళ్ల గంగా రాజ్‌పుత్ తన గ్రామంలో తీవ్ర నీటి కొరతను తీర్చడానికి ఒక చెరువును పునరుద్ధరించాలని ఆలోచన చేసింది. ఈ క్రమంలో అయితే, ఆమె ఆలోచనను అమలులో పెట్టడానికి పితృస్వామ్యం పైనే కాదు మూఢనమ్మకాలపై కూడా పోరాడాల్సి వచ్చింది. దశాబ్దాల క్రితం జరిగిన ఓ దుర్ఘటన కారణంగా గ్రామస్తులు చెరువును వదిలేశారు. దానిని పునరుద్ధరిస్తే ఎవరికైనా చెడు జరుగుతుందని స్థానికుల గట్టి నమ్మకం. దాంతో ఆ గ్రామంలో నీటి సంక్షోభం రోజు రోజుకూ తీవ్రతరం అవుతోంది. ఆ నీటి ఎద్దడిని తీర్చే ఏకైక ఆధారం ఆ చెరువే. 'మూఢనమ్మకాలతో కన్నా నీటి కోసం చనిపోవడం మేలు' అని అభ్యంతరం చెప్పిన ప్రతీసారి గ్రామస్తులకు పదే పదే చెబుతూ వచ్చింది గంగ. మెల్లగా ఓ పాతిక మంది మహిళలతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసింది. స్థానిక ఎన్జీవోల మద్దతుతో చెరువును శుభ్రం చేసి, పునరుద్ధరణ పనులు చేపట్టింది. ఊరికి నీటి ఎద్దడి తీరింది.

నదికి జీవకళ

గంగా రాజ్‌పుత్ మాదిరిగానే రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఉంటున్న గాయత్రీదేవి సంభార్ సరస్సు చుట్టూ ఉన్న 15 గ్రామాలకు చెందిన మహిళలకు వర్షపు నీటి సంరక్షణలో సహాయం చేయడానికి కృషి చేస్తోంది. అలాగే, ఉత్తరప్రదేశ్‌లోని లలిత్‌పూర్‌కు చెందిన శారదాదేవి కూడా తన గ్రామంలోని నీటి ఎద్దడిని పరిష్కరించడానికి స్థానిక బారువా నదిని పునరుజ్జీవింపజేయడానికి తోటివారిని కార్యోన్ముఖులను చేసి విజయం సాధించింది.

మధ్యప్రదేశ్‌లోని చింద్వార్ జిల్లాకు చెందిన అనితా చౌదరి తన గ్రామంలోని ఇతర మహిళలు నీటి కోసం పడే కష్టాలను చూసింది. ఈ సమస్యను పరిష్కరించే అవకాశం వచ్చినప్పుడు ఆమె వెనకడుగువేయలేదు. రెండేళ్లుగా తన గ్రామమైన గర్మోలో ప్రభుత్వ హర్ ఘర్ జల్ పథకాన్ని అమలు చేయడానికి కృషి చేసింది. మరో అవార్డు గ్రహీత తమిళనాడులోని తిరువళ్లూరుకు చెందిన కె.ఆశా, తన గ్రామంలో ఏ ఇంటి వద్ద కుళాయి నీటి సరఫరాలో చిన్న సమస్య వచ్చినా వెంటనే పరిష్కరిస్తుంది.

బ్యూటిప్స్

మృదువైన మేనికి..

ఆలివ్ ఆయిల్ రెండు టేబుల్ స్పూన్లు, సీ సాల్ట్ (రాతి ఉప్పు) టేబుల్ స్పూన్ చొప్పున తీసుకొని కలపాలి. ఈ మిశ్రమాన్ని శరీరానికి పట్టించి, మృదువుగా రాయాలి. ఇలా చేయడం వల్ల చర్మంపై మృతకణాలు సులువుగా తొలగిపోతాయి. ఆలివ్ ఆయిల్ చర్మకాంతిని పెంచుతుంది.



- బాడీ బ్రష్ మార్కెట్‌లో లభిస్తుంది. ఈ బ్రష్ కుచ్చులు చాలా మెత్తగా ఉంటాయి. స్నానం చేసే సమయంలో ఈ బ్రష్‌తో మృదువుగా చర్మంపై రబ్ చేస్తే మురికి, మృతకణాలు తొలగిపోతాయి.
- టేబుల్ స్పూన్ చొప్పున ఆరెంజ్ జ్యూస్, నిమ్మరసం తీసుకొని కప్పు పెరుగులో కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి, ఆరనివ్వాలి. తర్వాత తడి క్లాత్ లేదా టిష్యూతో తుడిచేస్తే మృతకణాలు తొలగి చర్మం కాంతిమంతంగా కనిపిస్తుంది.
- టీ స్పూన్ మినప్పప్పు, 6 బాదం పప్పులు కలిపి నీటిలో రాత్రంతా నాబెట్టాలి. ఉదయాన్నే ఈ రెండింటిని మెత్తగా రుబ్బి, ముఖానికి మాస్క్ వేసుకోవాలి. అరగంట తర్వాత శుభ్రపరుచుకుంటే చర్మం మృదువుగా, తాజాగా కనిపిస్తుంది.



ఇంటిప్

తెల్లని దుస్తుల మీద మరకలు పడితే...



తెల్లని దుస్తుల మీద మరకలు పడ్డ చోట నిమ్మరసం చిలకరించి ఒక గంట పాటు అలాగే ఉంచి తర్వాత శుభ్రమైన నీటిలో క్లీన్ చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.



- తెల్లటి దుస్తులను మరింత ప్రకాశవంతంగా మెరిపించడానికి తాజాగా తీసిన బంగాళదుంప రసాన్ని మరకల మీద అప్లై చేసి రబ్ చేసి, డిటర్జెంట్‌లో నానబెట్టి, 20 నిముషాల తర్వాత శుభ్రం చేస్తే సరి.

ఏ పని లేకుండా ఖాళీగా కూర్చుంటే బుర్ర దెయ్యాల ఫ్యాక్టరీ అవుతుందట! లాక్‌డౌన్ టైమ్‌లో సతిందర్‌కు బోలెడు ఖాళీ సమయం దొరికింది. ఆ ఖాళీ సమయంలో వృథా ఆలోచనలకు అవకాశం ఇవ్వకుండా సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ కెనడాలో లా డిగ్రీ ఉత్తీర్ణురాలై ప్రశంసలు అందుకుంటోంది సతిందర్...



● మల్టీ టాలెంట్

ఆర్టిస్ట్ టు బారిస్టర్

పంజాబ్‌లోని బటాలా పట్టణానికి చెందిన సతిందర్ సట్టి నటి, కవయిత్రి, డ్యాన్సర్, సింగర్, టెలివిజన్ యాంకర్‌గా బహుముఖ ప్రజ్ఞ చాటుకుంది. 'కవిత్వం అనేది విప్లవాత్మకమైన వేదిక' అని చెప్పే సతిందర్ కవిత్వంలో సామాజిక సమస్యలు ప్రధానంగా కనిపిస్తాయి. టీవీ యాంకర్‌గా ఎంతోమంది సామాన్యుల అద్భుతగాథలను 'బోల్ దే' కార్యక్రమంతో ప్రేక్షకులకు పరిచయం చేసింది.

'పంజాబ్ ఆర్ట్స్ కౌన్సిల్' ఛైర్‌పర్సన్‌గా సతిందర్ నియామకం అయినప్పుడు 'నలభై ఏళ్లు దాటని వ్యక్తికి ఈ పదవి ఎలా ఇస్తారు' అని కొందరు పనిగట్టుకొని విమర్శించారు.

అయితే తన పనితీరుతో విమర్శించిన వారే ప్రశంసించేలా చేసింది సతిందర్.

తాజా విషయానికి వస్తే....

'సతిందర్ ఇప్పుడు కెనడాలో బారిస్టర్' అంటూ వార్తల్లోకి వచ్చింది.

2020లో సతిందర్ కెనడాలో ఉంది. ఆ సమయంలో లాక్‌డౌన్ ప్రకటించడంతో ఇండియాకు రాలేని పరిస్థితి ఏర్పడింది.

'సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలి?' అనేదాని గురించి ఆలోచిస్తున్నప్పుడు ఆమె దృష్టి లా డిగ్రీపై పడింది. అమృత్‌సర్‌లోని 'గురునానక్ యూనివర్శిటీ'లో సతిందర్ 'లా' చేసింది. ఆ డిగ్రీని కెనడియన్ లా డిగ్రీతో అప్‌గ్రేడింగ్ చేసుకోవాలని నిర్ణయించుకుంది.

ఇండియాలో 'లా' చేసిన వారు కెనడాలో ప్రాక్టీస్ చేయాలంటే అక్కడి ఎన్‌సీఏ(నేషనల్ కమిటీ ఆన్ అక్రిడియేషన్) గుర్తింపు పొందాల్సి ఉంటుంది. దీని కోసం బారిస్టర్ ఎగ్జామ్స్‌కు హాజరు కావాలి. అయిదుకు పైగా ఎగ్జామ్స్ ఉంటాయి. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించకపోతే కెనడా లా స్కూల్‌లో సంవత్సరం పాటు చదవాల్సి ఉంటుంది.

పరీక్షలకు ప్రిపేర్ కావడానికి గుర్‌ప్రీత్, జస్వంత్ మంగత్‌లాంటి న్యాయవాదుల సలహాలు, సూచనలు తీసుకుంది.


చాలామంది కఠినంగా భావించే ఆ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి బారిస్టర్ లైసెన్స్ పొందింది సతిందర్.

లైసెన్స్ అవార్డింగ్ సమయంలో అక్కడి న్యాయ అధికారులు సతిందర్ బహుముఖ ప్రతిభ గురించి ప్రశంసించడం విశేషం.

హెల్త్

ప్రాణరక్షణకు ఉపయోగపడే సీపీఆర్

గుండెపోటు వచ్చిన వారిలో ప్రాణరక్షణకు సీపీఆర్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇది అందరూ తేలికగా నేర్చుకోవచ్చు. ఒక చేతి వేళ్లలో మరో చేతి వేళ్లు దూర్చి అరచేత్తో బాధితుడి ఛాతీ ఎముక పైభాగంలో లయబద్ధంగా నొక్కుతూ ఉండడమే సీపీఆర్.



చిన్న వయసులోనే గుండెపోటు సంఘటనలు ఎందుకు?

గుండెపోటు విషయంలో ఇటీవలి కొన్ని అధ్యయనాల్లో తెలిసి వచ్చిన అంశం ఏమిటంటే... ఇది పెద్దవారిలో మాత్రమే కాదు... టీనేజర్లలో... ఆ మాటకొస్తే చిన్నారుల్లో సైతం కనిపిస్తుందని తేలింది. క్రమబద్ధమైన రీతిలో వ్యాయామం చేస్తూ, శిక్షణ పొందే యువ అథ్లెట్లలో సైతం గుండెపోట్లు కనిపించాయి. ఫిఫా (ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్ ఫుట్‌బాల్) రిజిస్ట్రీలో సైతం 2014 నుంచి 2018 మధ్యకాలంలో 617 మంది యువ అథ్లెట్లు గుండెపోటుతో కుప్పకూలిన దాఖలాలున్నాయి.

అంతేకాదు... మనదేశంలో సైతం చాలా పెద్ద సెలబ్రిటీలు మొదలుకుని... మన వీధిలో మనకు తెలిసిన వారిలో అకస్మాత్తు గుండెపోట్లు కనిపించడం, వారు హఠాత్తుగా మరణించడం చాలా ఎక్కువగా కలవరపరిచే విషయాలే.

అతి చిన్న వయసులోనే ఎందుకిలా గుండెపోట్లు?

అతి చిన్నవయసులో గుండెపోట్లు కనిపించడానికి కొన్ని అండర్‌లైయింగ్ ఫ్యాక్టర్స్ దోహదపడుతున్నట్లు వెల్లడైంది.

- కుటుంబ చరిత్రలోనే చిన్నవయసులో గుండెపోటు సంఘటనలు ఉండటం. ● గుండె నిర్మాణంలోనే పుట్టుకతో తేడాలు ఉండటం. ● గుండెలో లయబద్ధంగా కొట్టుకోడానికి నిత్యం ఒకే రీతిలో విడుదలయ్యే ఎలక్ట్రిసిటీ కావాలి. అది సయనో ఏట్రియల్ నోడ్ అనే గుండెలోని ఓ కేంద్రం నుంచి వెలువడుతుంది. ఈ కరెంటు వెలువడటంలోని తేడాలు (అబ్‌నార్మాలిటీస్) కూడా ఇలా యువత అకస్మాత్తు మరణాలకు ఒక కారణమని అధ్యయనాల్లో తేలింది.

కోవిడ్ నష్టాలూ కొంతవరకు కారణం... ఎలాగంటే...?

కోవిడ్ అనంతరం వచ్చే కొన్ని సమస్యలు సైతం గుండెపోటుకు కారణమని కొన్ని అధ్యయనాల్లో తేలింది. గుండె కండరానికి ఇన్‌ఫ్లమేషన్ తెచ్చిపెట్టే 'మయోకార్డైటిస్' సమస్య ఇందుకు ఓ ఉదాహరణ. ఛాతీలో నొప్పి, శ్వాస తగినంతగా అందకపోవడం వంటి లక్షణాలతో కనిపించే మయోకార్డైటిస్ అన్నది అటు తర్వాత గుండె క్రమబద్ధంగా కొట్టుకునే లయను దెబ్బతీసేలా 'అరిథ్మియాస్', హార్ట్‌ఫెయిల్యూర్‌లతోపాటు మరికొన్ని ఇతర గుండె సంబంధిత సమస్యలకు దారితీసే అవకాశం ఉంది.

ఇదొక్కటే కాదు... కోవిడ్ తర్వాత చాలామందిని పరిశీలించినప్పుడు వారి రక్తప్రసరణ వ్యవస్థలో / రక్తనాళాల్లో రక్తపు ఉండలు (క్లాట్స్) పెరగడం మరో అంశం. ఈ క్లాట్స్ ప్రధాన ధమనుల్లో వచ్చినప్పుడు, గుండెకు తగినంతగా పోషకాలు, ఆక్సిజన్ అందకుండా అడ్డుపడతాయి. ఇవి కూడా యువతలో గుండెపోట్లకు కారణం.

- ఇటీవల యువతలో మానసిక ఒత్తిడి ఎక్కువగా పెరిగిపోయింది. ఆదుర్దా పడటం, ఆందోళన చెందడం వంటి అంశాలు యాంగ్జైటీకి దారితీస్తున్నాయి. దీనికి తోడు వైరస్ అనంతర పరిణామాల్లో సామాజిక సమస్యలుగా పరిగణించే ఉపాధి కోల్పోవడం, ఆర్థికంగా దెబ్బతినడం వంటి అంశాలూ యువతలో ఒత్తిడికి కారణమవుతున్నాయి. ఈ ఒత్తిడి అధిక రక్తపోటుకూ, గుండె వేగం పెరుగుదలకూ, గుండె లయ మార్పుచెందడానికి దోహదపడుతున్నాయి. ఇవన్నీ గుండె, రక్తప్రసరణ వ్యవస్థ ఆరోగ్యాన్ని దెబ్బతీయడం ద్వారా యువతలో చాలా చిన్నవయసులోనే గుండెపోట్లకు దారితీస్తున్నాయి.
- దీనికి తోడు అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడం వంటి అంశాలూ,ఇంకా కొనసాగుతున్న వర్క్‌ఫ్రమ్ హోమ్ వంటి పని అలవాట్లు యువతలో వ్యాయామలేమిని పెంచడంతో పాటు... రాత్రి తగినంతగా నిద్రలేకుండా పని చేయడాన్ని పెంపొందిస్తున్నాయి. ఈ నిద్రలేమి కూడా యువతలో గుండెపోట్లకు ఓ ప్రధాన కారణమే.
- వీటన్నింటికి తోడు మనలో ఒత్తిడినీ, యాంగ్జైటీని పెంచే మరో అంశం కూడా ఉంది. నిజానికి తగిన సమయానికి కోవిడ్ వ్యాక్సిన్ రావడం వల్ల చాలా మరణాలు నివారితమయ్యాయి. పెద్ద సంఖ్యలో జనం రక్షణ పొందారు. కానీ ఇటీవల పెరిగిన గుండెపోట్లను వ్యాక్సిన్‌తో ముడిపెడుతూ చాలా వదంతులు వెలువడుతున్నాయి. మానసిక ఒత్తిడిని పెంచడానికి ఇవీ కారణమవుతున్నాయి. నిజానికి ఈ గుండెపోట్లకూ, వ్యాక్సిన్‌కూ సంబంధం ఉన్నట్లుగా ఏ విధమైన ఆధారాలూ ఇప్పటివరకు వెలువడలేదు. వీటిపై ఇంకా పరిశోధనలు జరగాల్సి ఉంది. ● గుండెపోటుతో మృతి చెందినవారిలో నిర్దిష్ట కారణాలు కనుగొనేందుకు పోస్ట్‌మార్టమ్ అవసరం.

గుండెపోటు ముప్పును తెచ్చిపెట్టే అంశాలేమిటంటే?

మన దేశంలోని యువతలో ఇటీవల ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పులు, కొవ్వు పదార్థాల వినియోగంలో పెరుగుదల... ఫలితంగా బరువు పెరగడం ఓ ప్రధాన ముప్పు.

- చాలా తక్కువ వయసులోనే గుండెపోటు ముప్పునకు కారణమయ్యే స్థూలకాయం, హైబీపీ (హైపర్‌టెన్షన్), మధుమేహం (డయాబెటిస్) పెరుగుదల కూడా మరో కారణం. ఒకప్పుడు ఈ తరహా జీవనశైలి సమస్యలు చాలా పెద్ద వయసువారిలోనే కనిపించేవి. కానీ ఇటీవల ఇవి చిన్నవయసు వారిలోనూ వస్తున్నట్లే... దీని చిట్టచివరి ప్రమాదకరమైన ఫలితమైన గుండెపోట్లూ యువతలో పెరుగుతున్నాయి.
- ఇటీవల యువత చేపడుతున్న వృత్తులన్నింటిలోనూ కదలకుండా కూర్చుని చేసే పనులే ఎక్కువగా ఉంటున్నాయి. కనీస కదలికలు కూడా కొరవడటం (సెడెంటరీ) అనే జీవనశైలి వల్ల ఈ ముప్పు యువతలో మరింతగా పెరుగుతోంది. ● ఈ అంశాలన్నీ కలగలసి చాలా చిన్నవయసులోనే గుండెపోటు ముప్పును తెచ్చిపెడుతున్నాయి.



డా. ఎంఎస్ఎస్ ముఖర్జీ,
సీనియర్ కన్సల్టెంట్
కార్డియాలజిస్ట్

యుక్తవయసు గుండెపోట్లను నివారించాలంటే...?

- ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలి. క్రమంతప్పకుండా అలాగే శరీరానికి మితిమీరిన శ్రమకలిగించకుండా చేసే వ్యాయామాలు, మంచి ఆహారపు అలవాట్లు, పొగతాగడం, మద్యం వంటి అలవాట్ల నుంచి దూరంగా ఉండడంపై ప్రజల్లో అవగాహన పెంచాలి.

నష్టనివారణ కోసం ఎలాంటి పరీక్షలు అవసరమంటే...?

ఇటీవల హఠాత్తుగా గుండెపోట్ల పెరుగుదల అన్నది ఇటు డాక్టర్లను, అటు సామాజికవేత్తలనూ బెంబేలెత్తిస్తోంది. దేశ ఆర్థికాభివృద్ధి, పురోగతికి కారణమైన యువత ఇలా అకస్మాత్తుగా మృతి చెందడం కుటుంబాలకే కాదు, దేశానికీ నష్టమే. అందుకే గుండెపోటు మరణాల పట్ల తగినంత అవగాహన, విషయపరిజ్ఞానం, ముమ్ముందు రాబోయే ఇక్కట్ల నుంచి తమను రక్షించుకునేలా చేయించుకోవాల్సిన తగిన వైద్యపరీక్షల వంటి అంశాల్లో నివారణ ప్రణాళికలు రచించుకోవాల్సిన అవసరం ఉంది. చిన్న వయసువారైనప్పటికీ, తమలో రిస్క్ ఫ్యాక్టర్స్ ఉన్నవారు తప్పనిసరిగా గుండె పరీక్షలు అంటే... ఈసీజీ, 2డీ ఎకో, ట్రెడ్‌మిల్ టెస్ట్ వంటివి డాక్టర్లు చెప్పిన విధంగా తగిన ఇంటర్వెల్స్‌లో చేయించుకోవాలి. ఇవేగాక ప్రాథమిక పరీక్షలైన బీపీ చెక్ అప్, కొలెస్ట్రాల్ స్థాయుల్ని తెలిపే రక్త పరీక్షలు, చక్కెర మోతాదు పరీక్షలు చేయించుకుని, డాక్టర్లు చెప్పిన విధంగా మందులు, జాగ్రత్తలు తీసుకోవాలి.

- ప్రాణాలను కాపాడే సీపీఆర్ (కార్డియో పల్మునరీ రిససియేషన్)వంటివి అందరూ నేర్చుకోవాలి. దీనివల్ల అకస్మాత్తు గుండెపోటు మరణాలను చాలావరకు నివారించవచ్చు. ఈ సీపీఆర్‌పై సాధారణ ప్రజలందరికీ శిక్షణ ఇవ్వాలి.
- ఇక ప్రజలు ఎక్కువగా తిరగాడే కొన్ని కీలకమైన ప్రదేశాల్లో, కూడళ్లలో, సెంటర్లలో డీ-ఫిబ్రిలేటర్లను (ఆగిపోయిన గుండెను మళ్లీ స్పందించేలా చేసే ఉపకరణాలు) అమర్చాలి.

ఈనెల 9న వరల్డ్ కిడ్నీ డే

మూత్రపిండాలను కాపాడుకుందామిలా...



కిడ్నీలు 90 శాతం చెడిపోయేవరకు వాటి తాలూకు ఏ లక్షణాలూ కనిపించవు. కిడ్నీల ఆరోగ్యాన్ని కాపాడుకోడానికి, వాటికి ఇచ్చే సమస్యల నివారణకు పాటించాల్సిన జాగ్రత్తలివి... ● అందరూ రోజూ తగినన్ని నీళ్లు తాగుతుండాలి. మహిళలు కొన్నిసార్లు బయటకు వెళ్లాల్సివచ్చినప్పుడు మూత్రవిసర్జనకు అనువుగా ఉండదంటూ నీళ్లు తాగడం తగ్గిస్తారు. అలా చేయకూడదు. రోజూ తాగే నీళ్ల వల్ల దేహానికి హైడ్రేషన్ వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు కిడ్నీలో రాళ్లనూ నివారించుకోవచ్చు. ● తమ ఎత్తుకు తగిన బరువు ఉండాలి. ఉండాల్సిన బరువుకు మించి పెరగకుండా జాగ్రత్త పడాలి. ● ఆహారంలో పీచు పదార్థాలు ఎక్కువగానూ, చక్కెరలు, కొలెస్ట్రాల్ తక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. ● ఆహారం ఉప్పను బాగా నియంత్రించుకోవాలి. ● రక్తపోటు ఉన్నవారు తమ బీపీనీ, డయాబెటిస్ ఉన్నవారు తమ చక్కెర మోతాదులను ఎప్పుడూ నియంత్రణలో ఉంచుకోవాలి. ● పొగతాగే అలవాటు, మద్యం అలవాట్లను పూర్తిగా మానేయాలి ● డాక్టర్ సూచించినప్పుడు తప్ప... సొంతంగా నొప్పి నివారణ మాత్రలు తీసుకోవడం సరికాదు ● ఒత్తిడిని అదుపులో ఉంచుకోవాలి. ఒత్తిడి తగ్గించుకునేందుకు ఆరోగ్యకరమైన మంచి హాబీలను అలవరచుకోవాలి.

మగపిల్లలకు ప్రమాదం తెచ్చిపెట్టే అన్‌డిసెండెడ్ టెస్టిస్!

బిడ్డ పుట్టీ పుట్టగానే అందర్లో కలిగే మొట్టమొదటి ఉత్సుకత... పుట్టింది ఆడబిడ్డా... లేక మగపిల్లాడా అని. ఇక పుట్టింది అబ్బాయేనని నిర్ధారణ అయ్యాక... అతడి వృషణాల సంచిలోకి గోలీల్లా కనిపించే 'టెస్టిస్' దిగాయా లేదా అన్నది చూడాలి. ఇప్పుడంటే బిడ్డ పుట్టడం (ప్రసవాలు) చాలావరకు హాస్పిటల్స్‌లోనే (ఇన్‌స్టిట్యూషనల్ డెలివరీస్) జరుగుతున్నాయి. కాబట్టి అనుభవజ్ఞులైన గైనకాలజిస్టులు లేదా ఆబ్‌స్టెట్రీషియన్స్ అని పిలిచే స్పెషలైజ్‌డ్ డాక్టర్లు చూస్తుంటారు కాబట్టి... బిడ్డ పుట్టిన వెంటనే ఈ వృషణాల సంచిలోకి టెస్టిస్ జారాయా లేదా అన్నది తెలిసిపోతుంది. కానీ దాదాపు ఒకట్రెండు దశాబ్దాల కిందట పురుడు పోయడాలు ఇళ్లలోనే జరిగేవి కాబట్టి గతంలో పురుడు పోసే ఆయాలు, అనుభవం ఉన్న వృద్ధమహిళలు పుట్టిన బిడ్డను చూసేవారు. వాళ్లలో చాలామందికి... పుట్టింది ఆడబిడ్డా లేదా మగపిల్లాడా అనేవరకే తెలిసేది గానీ... టెస్టిస్ సంచిలోకి జారాయా లేదా అన్నది పెద్దగా తెలిసేది కాదు. అయితే పుట్టింది మగబిడ్డ అయినప్పుడు పుట్టినవెంటనే గోలీల్లా కనిపించే టెస్టిస్ సంచిలోకి జారకపోతే... ముమ్ముందు అది బిడ్డకు ప్రమాదమని తెలియదు. ఇప్పటికీ కొన్ని మారుమూల ప్రాంతాల్లో, ఆసుపత్రి సౌకర్యాలకు చాలా దూరంగా ఉన్న గ్రామాల్లో ఇంకా ఇళ్లలోనే కొంత మంది అనుభవజ్ఞులైన దాదీలు లేదా ఆయాలు పురుడుపోయడాలు జరుగుతున్న నేపథ్యంలో ఇలా టెస్టిస్ వృషణాల సంచిలోకి జారాయా లేదా అన్న విషయాలపై అవగాహన అవసరం. ఆ అవగాహన ఎందుకు అవసరమో తెలిపే కథనం ఇది.

మగ పిల్లల వృషణాల సంచిలోకి టెస్టిస్ జారాయా లేదా అన్నది ఎందుకు ప్రధానమైన అంశమో తెలియాలంటే మొదట... మానవ శరీర నిర్మాణం ఎంత అద్భుతమో తెలుసుకోవాలి. ఈ వృషణాల సంచిలో ఉండే గోలీల్లాంటి 'టెస్టిస్' నుంచే శుక్రకణాలు తయారవుతాయి. మన దేహపు ఉష్ణోగ్రత 98.4 ఫారెన్‌హీట్ ఉంటుందన్నది అందరికీ తెలిసిన విషయమే. అయితే మిగతా అన్ని జీవక్రియలకూ నార్మల్ అయిన ఆ ఉష్ణోగ్రత... వీర్యకణాలకు మాత్రం ప్రమాదం తెచ్చిపెడుతుంది. ఆ ఉష్ణోగ్రత వద్ద వీర్యకణాలు మృతిచెందుతాయి. అందుకే ప్రకృతి దేహం బయట ఓ సంచిని రూపొందించి, వీర్యకణాలను వృద్ధి చేసే టెస్టిస్‌ను అక్కడే ఉండేలా ఏర్పాటు చేసింది. దేహపు ఉష్ణోగ్రత కంటే అక్కడ కనీసం రెండు నుంచి మూడు డిగ్రీలు తక్కువ ఉష్ణోగ్రత ఉండటంతో... పునరుత్పత్తికి తోడ్పడే వీర్యకణాలు జీవించి ఉంటాయి.

మగబిడ్డ తల్లి కడుపులో ఉన్నప్పుడు ఈ టెస్టిస్... అతడి కడుపులో ఉండి... పుట్టగానే సంచిలోకి జారిపోతాయి. ఇలా జారకుండా ఉండే పిల్లలూ ఉంటారు. పుట్టిన పిల్లల్లో ఇలాంటి పిల్లలు పది శాతం వరకు ఉంటుంటారు. ఇలా టెస్టిస్ అన్నవి సంచిలోకి జారకుండా ఉండటం అనే కండిషన్‌ను సాధారణంగా 'అన్‌డిసెండెడ్ టెస్టిస్' అనీ, వైద్యపరిభాషలో 'క్రిప్టార్కిడిజమ్' అని అంటారు.

చికిత్స : చాలా చిన్నదిగా పరిగణించే ఓ శస్త్రచికిత్స (మైనర్ సర్జరీ)తో డాక్టర్లు (పీడియాట్రిక్ సర్జన్స్) ఈ పరిస్థితిని చక్కదిద్దుతారు. వారు ఓపెన్ సర్జరీ లేదా లాపరోస్కోపిక్ సర్జరీ అనే రెండు రకాల శస్త్రచికిత్స పద్ధతుల ద్వారా మగబిడ్డ కడుపులోనే ఉండిపోయిన టెస్టిస్‌ను సంచిలోకి జారేలా చూస్తారు. అటు తర్వాత ఈ బిడ్డ అన్ని విధాలుగా పూర్తిగా నార్మల్ యువకుడిలాగే పెరుగుతాడు.

ఏ మేరకు ప్రమాదం...

పుట్టిన వెంటనే టెస్టిస్ వృషణాల సంచిలోకి జారకపోతే తక్షణం వచ్చే ప్రమాదమేమీ ఉండదు. కనీసం ఆర్నెల్లు లేదా ఏడాది వరకు దాదాపుగా ప్రమాదమేమీ ఉండదు. కానీ ఆ తర్వాత కూడా అవి సంచిలోకి జారకపోతే మాత్రం రెండు రకాల ప్రమాదాలు వచ్చే అవకాశం ఉంది. మొదటిది... కడుపులోనే ఉండిపోయినందున ఆ టెస్టిస్ నుంచి ఆరోగ్యకరమైన వీర్యకణాల వృద్ధికి అవకాశం ఉండదు. ఇక... కడుపులోనే ఉన్నందున అవి పెరగాల్సిన సైజుకు పెరగకుండా... ఓ బఠాణీ గింజంత ఉండిపోతాయి. అదొక్కటే కాదు... ఒక్కోసారి కడుపులోని ఉండిపోయిన టెస్టిస్ అస్తవ్యస్తంగా పెరగడంతో అది క్యాన్సర్‌కు దారితీసే అవకాశాలూ లేకపోలేదు.



డాక్టర్ కొర్రపాటి శివ సత్య ప్రసూన్
కన్సల్టెంట్ పీడియాట్రిక్ సర్జన్,
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్, విజయవాడ
కాంటాక్ట్ నంబర్: 8882 593 593
www.rainbowhospitals.in

పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

లీగల్ సెల్‌ను బాగా వినియోగించుకుంటాం

- అందరూ దివాలా తీసినా కోర్టులు మాత్రం కళకళలాడుతున్నాయి
- లాయర్లు బాగుపడుతున్నారు
- టీడీపీ లీగల్ సెల్ సమావేశంలో చంద్రబాబు

సాక్షి, అమరావతి: పార్టీ లీగల్ సెల్‌ను ముందుముందు ఇంకా బాగా వినియోగించుకుంటామని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు చెప్పారు. పార్టీలోని అన్ని విభాగాలకంటే లీగల్ విభాగమే తనకు ఎంతో ముఖ్యమన్నారు. శనివారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన లీగల్ సెల్ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అందరూ దివాలా తీసినా కోర్టులు మాత్రం కళకళలాడుతున్నాయని చంద్రబాబు చెప్పారు. కేసులు భారీగా వస్తుండటంతో లాయర్లు బాగుపడుతున్నారని చెప్పారు. ఈ ఐదేళ్లు తనకు అండగా ఉన్న లాయర్లందరికీ అధికారంలోకి వచ్చాక న్యాయం చేస్తానన్నారు. రాష్ట్రంలో కోర్టుల వారీగా, నియోజకవర్గాలవారీగా టీడీపీ లీగల్ సెల్ కమిటీలు ఏర్పాటు చేసుకుని పార్టీ కోసం పని చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీపై పొలిటికల్ ఫైట్ కంటే లీగల్ ఫైట్ ఎక్కువ చేయాల్సి ఉందని అన్నారు. పార్టీలో తొలి నుంచి లాయర్లకు ప్రాధాన్యత ఉందని చెప్పారు. లీగల్ సెల్‌లో పనిచేసిన వారు ఉన్నత స్థానాలకు వెళ్లారని అన్నారు. నాలుగేళ్లలో ఒక్క రూపాయి పెట్టుబడి తేలేకపోయిన సీఎం జగన్ దశాబ్దాలు కష్టపడి ఆస్తులు సంపాదించుకున్న ప్రజలను బెదిరించి ఆస్తులు రాయించుకుంటున్నారని ఆరోపించారు. ఒక్క విశాఖలోనే రూ.40 వేల కోట్ల విలువైన ఆస్తులు రాయించుకున్నారన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు, ఇతర నేతలు పాల్గొన్నారు.

పేదలకు పనుల కల్పనలోనూ ఏపీ టాప్

'ఉపాధి'లో అడిగిన వారికల్లా సొంత గ్రామాల్లోనే పనులు

- ఎక్కువ మంది కూలీలకు పనులు కల్పించిన రాష్ట్రాల్లో మనదే అగ్రస్థానం
- రాష్ట్రంలోనే అత్యధికంగా 77.85 శాతం మందికి పనులు కల్పన
- అందులో దాదాపు 34 శాతం మంది ఎస్సీ, ఎస్టీలే



సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు పనుల కల్పనలోనూ ఆంధ్రప్రదేశ్ మిగతా అన్ని రాష్ట్రాలకన్నా ముందంజలో ఉంది. 2006లో ఉపాధి హామీ పథకం అమల్లోకి వచ్చిన నాటి నుంచి ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ పరిధిలో ఇప్పటివరకు 1,24,21,121 మంది కూలీలు ఈ పథకంలో పనిచేసేందుకు తమ పేర్లు నమోదు చేసుకోగా, అందులో 96,69,694 మంది కూలీలకు వాళ్ల సొంత ఊళ్లోనే కావాల్సిన పనులను వైఎస్ జగన్ ప్రభుత్వం కల్పించింది. గత నాలుగేళ్ల కాలంలో ఉపాధి హామీ పథకంలో కనీసం ఒక్కరోజైనా పనులు పొందిన వారిని కేంద్రం యాక్టివ్ వేతనదారులుగా గుర్తిస్తుంది. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ తన అధికారిక ఆన్‌లైన్ పోర్టల్ పేర్కొన్న వివరాల ప్రకారం.. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత నాలుగేళ్ల కాలంలో మొత్తం కూలీల్లో 77.85 శాతం మంది కూలీలకు పనులు కల్పించి దేశంలోనే ఎక్కువ శాతం మంది కూలీలకు పనులు కల్పించిన రాష్ట్రంగా నిలిచింది. కేవలం రెండు లక్షల మంది కూలీలు మాత్రమే నమోదు చేసుకున్న మిజోరం వంటి అతిచిన్న ఈశాన్య రాష్ట్రం లేదా మొత్తం పదివేల మందే కూలీలుగా నమోదు చేసుకున్న లద్దాఖ్ వంటి కేంద్రపాలిత ప్రాంతాలు 80 శాతం మేర పనులు కల్పించి మన రాష్ట్రం కన్నా ఎక్కువ శాతం మేర కూలీలకు పనులను కల్పించిన జాబితాలో ఉన్నప్పటికీ.. కోట్ల సంఖ్య లేదంటే పదుల లక్షల సంఖ్యలో కూలీలు నమోదు చేసుకున్న మిగతా రాష్ట్రాలతో వాటిని పోల్చుకోలేమని అధికారులు చెబుతున్నారు. మిగతా రాష్ట్రాల్లో మన రాష్ట్రమే 77.85 శాతం మందికి పనులు కల్పించి అగ్రస్థానంలో ఉండగా, తర్వాత స్థానంలో ఛత్తీస్‌గఢ్ గత నాలుగేళ్లలో 76 శాతం మంది కూలీలకు పనులు కల్పించింది. ఇక పెద్దపెద్ద రాష్ట్రాలుగా పిలవబడే ఉత్తరప్రదేశ్ (51 శాతం), పశ్చిమ బెంగాల్ (56 శాతం), రాజస్తాన్ (56 శాతం), తమిళనాడు (69 శాతం), కర్ణాటక (48 శాతం) చొప్పున కూలీలకు పనులు కల్పించాయి.

నాలుగేళ్లలో కూలీలకు రూ.19,884 కోట్లు..

ఇక 2019–20 ఆర్థిక సంవత్సరం నుంచి నాలుగేళ్ల కాలంలో రాష్ట్రంలో రూ.32,255 కోట్ల మేర ఉపాధి హామీ పథకం పనులు జరగగా, అందులో రూ.19,884 కోట్లు గ్రామీణ ప్రాంత పేద కూలీలే ప్రత్యక్షంగా ఉపాధి పొందారు. అలాగే, 2022 ఏప్రిల్ నుంచి ఇప్పటిదాకా 11 నెలల కాలంలో 44.77 లక్షల గ్రామీణ ప్రాంత కుటుంబాలు ఉపాధి హామీ ద్వారా సొంత ఊర్లోనే పనులు చేసుకుని రూ.4,571.38 కోట్ల మేర నేరుగా లబ్ధిపొందారు. ఇలా లబ్ధిపొందిన కూలీల్లో 24.06 శాతం ఎస్సీలు, 9.10 శాతం ఎస్టీలే ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు తెలియజేస్తున్నాయి. ఈ రెండు కేటగిరీల వారే దాదాపు 34 శాతం మంది ఉన్నారు.

చిత్తూరు జిల్లాలో స్పోర్ట్స్ వర్సిటీ పెడతాం

- టీడీపీ నేత నారా లోకేశ్



కల్లూరులో ప్రసంగిస్తున్న లోకేశ్

పుంగనూరు(చిత్తూరు జిల్లా): తాము అధికారంలోకి వస్తే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని టీడీపీ నేత నారా లోకేశ్ చెప్పారు. శనివారం పుంగనూరు నియోజకవర్గంలోని కల్లూరులో ఆయన ముస్లింలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. పుంగనూరులో ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ముస్లింల కోసం ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేసి.. 5 శాతం రిజర్వేషన్లు, రంజాన్ తోఫా అమలు చేస్తామన్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కుప్పం, పలమనేరు నియోజకవర్గాలను తాము ఎంతో అభివృద్ధి చేశామని.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వల్ల పుంగనూరులో అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. ఈసారి మంగళగిరిలో విజయం తనదేనన్నారు.

క్లుప్తంగా...

పులిచింతల ప్రాజెక్టు గేటుకు మరమ్మతులు

5 రోజుల పాటు రాకపోకల నిలిపివేత

అచ్చంపేట: పల్నాడు జిల్లా అచ్చంపేట మండల సరిహద్దు పులిచింతల ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల మరమ్మతులు చేపట్టినట్టు ప్రాజెక్టు ఏఈ విక్రమ్ చెప్పారు. 2021 ఆగస్టులో సంభవించిన వరదలకు ప్రాజెక్టు 16వ నంబర్ గేటు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. కాగా, కొత్త గేటును అమర్చేందుకు ఉన్నతాధికారుల నుంచి ఐదు రోజుల పాటు అనుమతులు తీసుకుని, శనివారం పనులు ప్రారంభించామని.. పదో తేదీ వరకు పడుతుందని చెప్పారు. ఈ ఐదు రోజులు ప్రాజెక్టుపై నుంచి రాకపోకలను పూర్తిగా నిలిపేసినట్టు చెప్పారు. ఆ గేటును పూర్తిగా బిగించేందుకు కొన్ని రోజుల తర్వాత మరికొన్ని రోజుల పాటు రాకపోకలు నిలిపివేయాల్సి వస్తుందని ఏఈ తెలిపారు.

• తెలంగాణ

నవీన్‌ను ఎలా చంపావ్?

- హత్య కేసు సీన్ రీ కన్‌స్ట్రక్షన్
- హత్య ముందు, తర్వాత పరిస్థితులపై పోలీసుల విచారణ

సాక్షి, హైదరాబాద్/నాగోలు: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఇంజనీరింగ్ విద్యార్థి నవీన్ హత్య కేసు విచారణలో భాగంగా రాచకొండ పోలీసులు సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేశారు. ప్రేమించిన ప్రియురాలు దూరం అవుతుందన్న సాకుతో ఫిబ్రవరి 17 న తోటి స్నేహితుడిని అత్యంత పాశవికంగా నిందితుడు హరిహరకృష్ణ హత్య చేసిన సంగతి తెలిసిందే. హత్య అనంతరం పోలీసులు గుర్తుపట్టకుండా మృతదేహాన్ని క్రూరంగా చేతి వ్రేళ్ళు, పెదాలు, గుండె, మర్మాంగాలను కోసి దహనం చేశాడు. అనంతరం దొరికిపోతాననే భయంతో తానే స్వయంగా అబ్దుల్లాపూర్ మెట్ పోలీసులు ఎదుట గత నెల 24న లొంగిపోయాడు. ఈ క్రమంలో పోలీసులు హత్యకు ముందు, తర్వాత పరిణామాలను సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేసి తెలుసుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి నిందితుడు హరిని హత్య జరిగిన ప్రదేశం అబ్దుల్లాపూర్ మెట్ కు తీసుకెళ్లి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేశారు. దానికంటే ముందు నిందితుడు హరిని చర్లపల్లి జైలు నుంచి తరలించి వనస్థలిపురం ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేసి కస్టడీ విచారణ ప్రారంభించారు. యువతితో పరిచయం, సేహితుడి మధ్య విబేధాలను ప్రశ్నల రూపంలో అడిగి తెలుసుకున్నారు. విచారణ అనంతరం నిందితుడు హరిని తిరిగి చర్లపల్లి జైలులో రిమాండుకు తరలించారు. హరి సోదరిని, అతడి స్నేహితుడు హసన్‌ను శనివారం మరోసారి పోలీసులు విచారించినట్టు తెలిసింది.

యువతికి సంబంధించిన ఆధారాలు దొరకలేదు- రాచకొండ సీపీ చౌహాన్

అబ్దుల్లాపూర్ మెట్ హత్య కేసులో యువతి కి సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ఆధారాలు పోలీసులకు దొరకలేదని రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ చెప్పారు. హరిని విచారిస్తున్నామని అన్ని ఆధారాలూ సేకరిస్తున్నామని తెలిపారు. దర్యాప్తులో ఉన్న కేసుపై ఇప్పుడే పూరిస్థాయిలో సమాచారం చెప్పలేమన్నారు.

కృష్ణా బోర్డులో అంత జీతాలా?

- 25 % అధిక వేతనాల చెల్లింపుపై కేంద్రం ఆగ్రహం
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నుంచి రికవరీకి ఆదేశం
- విభజన చట్టంలోని సెక్షన్ 85(3) ప్రయోగించిన కేంద్రం

సాక్షి, హైదరాబాద్: కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)లో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మూలవేతనంపై 25శాతం అధిక వేత నం చెల్లిస్తుండడంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆగ్ర హం వ్యక్తం చేసింది. తక్షణమే అధిక వేతనం చెల్లింపులను నిలుపుదల చేయాలని, ఇప్పటి వరకు అదనంగా చెల్లించిన వేతనాలను తిరిగి వసూలు చేయా లని కృష్ణా బోర్డును ఆదేశించింది. ఈ ఆదేశాలను అమలు చేయని పక్షంలో సంబంధిత అధికారులపై తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. కృష్ణా, గోదావరి బోర్డులు స్వయంప్రతిపత్తిని కలిగి ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వ పాలన నియంత్రణలో పని చేయాల్సి ఉంటుందని, కేంద్రం జారీ చేసే ఆదేశాలను పాటించాల్సి ఉంటుందని ఏపీ రాష్ట్ర పునర్విభజన చట్టంలోని సెక్షన్ 85(3) అదే పేర్కొంటోందని గుర్తు చేసింది.

☛తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖలోని అంతర్రాష్ట్ర విభాగం ఇంజనీర్లకు మూలవేతనంపై 25శాతం వేతనాన్ని అధికంగా చెల్లిస్తుండగా, వీరికి సమానంగా తమ ఉద్యోగులకు సైతం 25శాతం మూలవేతనాన్ని అధికంగా చెల్లించాలని 2020 అక్టోబర్ 20న కృష్ణా బోర్డు తీర్మానం చేసింది. దాదాపు రెండేళ్ల నుంచి అధిక వేతనాలు చెల్లిస్తూ వస్తోంది. గోదావరి బోర్డు సైతం తమ ఉద్యోగులకు ఇదే తరహాలో అధిక వేతనాలను చెల్లిస్తామని కేంద్ర జలశక్తి శాఖకు ప్రతిపాదనలు పంపగా, ఈ విషయం కేంద్రం దృష్టికి వచ్చింది. తక్షణమే అధిక వేతనాల చెల్లింపులను నిలుపుదల చేయాలని, ఇప్పటి వరకు చెల్లించిన వేతనాలను రికవరీ చేయాలని 2021 జూలైలో కృష్ణా బోర్డుకు కేంద్ర జలశక్తి శాఖ ఆదేశించింది. స్వయంప్రతిపత్తి కలిగి ఉన్న నేపథ్యంలో కేంద్రం ఆదేశాలను అమలు చేయాల్సిన అవసరం లేదని కృష్ణా బోర్డు కేంద్రానికి తెలియజేసింది. ఈ నేపథ్యంలో ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 85(3)ను ప్రయోగిస్తూ తక్షణమే అధిక వేతనాల చెల్లింపులను నిలుపుదల చేయాలని తాజాగా కేంద్ర జలశక్తి శాఖ కృష్ణా బోర్డును ఆదేశించింది.

ఆంధ్రా తీరమే అత్యంత సురక్షితం



వాయుగుండాలు, తుపానుల వల్ల దేశ సముద్రతీరంపై అలల ఉధృతి

దేశంలో 1,144.29 కి.మీ.ల పొడవునా కోతకు గురవుతున్న తీరరేఖ

- ఇప్పటికే తీర ప్రాంతంలో కోతకు గురైన 3,679.91 హెక్టార్ల భూమి
- అండమాన్-నికోబార్ దీవులు, కేరళ, ఒడిశా, తమిళనాడు, గుజరాత్‌పై అలల ఉధృతి అధికం
- వీటిలోనే అధికంగా కోతకు గురైన తీర రేఖ
- రాష్ట్రంలో కేవలం 15 కి.మీ.ల తీర రేఖపై మాత్రమే అలల ప్రభావం
- కేంద్ర జలసంఘం తాజా అధ్యయనంలో వెల్లడి

సాక్షి, అమరావతి: దేశంలోనే ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతం అత్యంత భద్రం, సురక్షితమని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) అధ్యయనం స్పష్టం చేసింది. అలల ఉధృతి అధికంగా ఉండటం వల్ల అండమాన్-నికోబార్ దీవులు, కేరళ, ఒడిశా, తమిళనాడు, గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్రల్లో తీర రేఖ అధికంగా కోతకు గురవుతోందని వెల్లడించింది. దేశంలో 1,144.29 కి.మీ.ల పొడవునా తీర రేఖ ఎక్కువగా కోతకు గురవుతోందని తెలిపింది. ఆ తీర ప్రాంతంలో 3,679.91 హెక్టార్ల భూమి తీవ్రంగా కోతకు గురైందని ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో 973.7 కి.మీ.ల పొడవైన తీర రేఖ ఉండగా.. కేవలం 15 కి.మీ.ల పొడవునా మాత్రమే సముద్రపు అలల ప్రభావం అధికంగా ఉందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో సీడబ్ల్యూసీ అధ్యయన నివేదికను విశ్లేషించిన పారిశ్రామికవేత్తలు.. పోర్టులు, హార్బర్ల నిర్మాణానికి, వాటి ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ అత్యంత అనువైన ప్రాంతమని చెబుతున్నారు.

దేశంలో రెండో అతి పొడవైన తీర ప్రాంతం మనదే..

మన దేశానికి తూర్పున బంగాళాఖాతం, పశ్చిమాన అరేబియా సముద్రం, దక్షిణాన హిందూ మహాసముద్రం సరిహద్దులుగా ఉన్నాయి. గుజరాత్, మహారాష్ట్ర, గోవా, డయ్యూ డామన్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, లక్షద్వీప్, అండమాన్-నికోబార్ దీవుల పొడవున 7,516.6 కి.మీ.ల పొడవైన సుదీర్ఘ తీర రేఖ ఉంది. దేశంలో అతి పొడవైన తీర రేఖ ఉన్న రాష్ట్రంగా గుజరాత్ (1,214.7 కి.మీ.లు) మొదటి స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ (973.7 కి.మీ.లు) రెండో స్థానంలో నిలిచింది.

దేశంలో తీర రేఖ కలిగిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఇవే..

రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతం	తీర రేఖ పొడవు (కి.మీ.)
1.గుజరాత్	1,214.7
2.మహారాష్ట్ర	652.6
3.గోవా, డయ్యు డామన్	160.5
4.కర్ణాటక	280
5.కేరళ	569.7
6.తమిళనాడు	906.9
7.పుదుచ్చేరి	30.6
8.ఆంధ్రప్రదేశ్	973.7
9.ఒడిశా	476.4
10.పశ్చిమ బెంగాల్	157.5
11.లక్షద్వీప్	132.0
12.అండమాన్-నికోబార్ దీవులు	1,962
మొత్తం	7,516.6

వాయుగుండాలు, తుపానుల వల్లే..

అతి పొడవైన తీర రేఖ, భారీ తీర ప్రాంతాన్ని పరిరక్షించేందుకు, అభివృద్ధి చేసేందుకు సీడబ్ల్యూసీ చైర్మన్ అధ్యక్షతన కోస్టల్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ అడ్వైజరీ కమిటీ (సీపీడీఏసీ)ని కేంద్రం ఏర్పాటు చేసింది. తీర రేఖపై సముద్రపు అలల ప్రభావాన్ని ఎప్పటికప్పుడు సీడబ్ల్యూసీ అధ్యయనం చేస్తోంది. కోతకు గురైన ప్రాంతాన్ని పరిరక్షించి, అభివృద్ధి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచనలు చేస్తూ వస్తోంది. తాజాగా దేశంలో తీర రేఖపై అలల ప్రభావం గురించి సీడబ్ల్యూసీ అధ్యయనం చేసింది.

కేంద్ర జల సంఘం అధ్యయనంలో వెల్లడైన ప్రధానాంశాలు ఇవీ..

☛బంగాళాఖాతం, అరేబియా సముద్రాల్లో ఏర్పడే వాయుగుండాలు, తుపాన్ల ప్రభావం వల్ల తీరం వైపు వీచే గాలుల వేగానికి రెట్టింపు ఉధృతిలో అలలు ఎగిసిపడటం వల్ల తీర ప్రాంతం కోతకు గురవుతోంది.


☛అరేబియా సముద్రంతో పోల్చితే బంగాళాఖాతంలోనే అధికంగా వాయుగుండాలు, తుపాన్‌లు ఏర్పడుతున్నాయి. దీని ప్రభావం వల్ల పశ్చిమ తీర రేఖతో పోల్చితే తూర్పు తీర రేఖ అధికంగా కోతకు గురవుతోంది.

☛బంగాళాఖాతంలో ఉండే అండమాన్-నికోబార్ దీవులకు 1,962 కి.మీ.ల పొడవునా తీర రేఖ ఉంటే.. అలల ఉధృతి, గాలి వేగానికి 360.1 కి.మీ.ల పొడవునా 987.68 హెక్టార్ల భూమి కోతకు గురైంది. అత్యధికంగా తీర ప్రాంతం కోతకు గురైన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అండమాన్-నికోబార్ దీవులు ప్రథమ స్థానంలో ఉన్నాయి.

☛అండమాన్ -నికోబార్ దీవుల తర్వాత అలల ఉధృతి ప్రభావం ఒడిశాపై అధికంగా పడుతోంది. ఒడిశాకు 476.4 కి.మీ.ల పొడవైన తీర రేఖ ఉంటే.. 143.6 కి.మీ.ల పొడవునా కోతకు గురవుతోంది.

☛569.7 కి.మీ.ల పొడవు తీర రేఖ ఉన్న కేరళలో 137.33 కి.మీ.ల తీర ప్రాంతానికి కోత తప్పడం లేదు. ఆ తర్వాత తమిళనాడులో 128.88 కి.మీ., గుజరాత్‌లో 109.76 కి.మీ., మహారాష్ట్రలో 75.16 కి.మీ., పశ్చిమ బెంగాల్‌లో 56.3 కి.మీ., కర్ణాటక 40.19 కి.మీ. పొడవునా తీర రేఖ కోతకు గురవుతోంది.

☛మడ అడవులను పెంచడం, తీర రేఖను పటిష్టంగా అభివృద్ధి చేయడం ద్వారా అలల ఉధృతి ప్రభావాన్ని తగ్గించవచ్చు.



ఈ సిటీలు చాలా కాస్ట్లీ గురూ..

ప్రపంచవ్యాప్తంగా ఎన్నో నగరాలు ఉన్నా.. వాటిల్లో కొన్నింటికి డిమాండ్ చాలా ఎక్కువ. స్థానిక పరిస్థితులతోనో, వ్యాపార, వాణిజ్య అవకాశాలతోనో అక్కడ ఇళ్ల ధరలు కూడా చాలా ఎక్కువ. ఈ క్రమంలో నైట్ ఫ్రాంక్ సంస్థ.. ఇళ్ల ధరల ఆధారంగా ప్రపంచంలో ఖరీదైన నగరాల జాబితాను 'వెల్త్ రిపోర్ట్-2023'లో వెల్లడించింది. ముఖ్యమైన నగరాల్లోని ప్రధాన ప్రాంతాల్లో.. రూ.8.2 కోట్లు ఖర్చుపెడితే ఎన్ని చదరపు మీటర్ల విస్తీర్ణమున్న ఇల్లు వస్తుందనే అంచనాలనూ పేర్కొంది.

క్యాన్సర్ నివారణకు ప్రత్యేక చర్యలు

- క్యాన్సర్ నియంత్రణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఆస్పత్రులు
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు



జీజీహెచ్‌లో వైద్య పరికరాలు పరిశీలిస్తున్న దత్తాత్రేయుడు

గుంటూరు (మెడికల్): క్యాన్సర్ నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ సలహాదారు, ప్రసిద్ధ క్యాన్సర్ వైద్యనిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు చెప్పారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రిలోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌ను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. క్యాన్సర్ బాధితులు చికిత్స కోసం ఇతర రాష్ట్రాల వైపు చూడకుండా ఏపీలోనే చికిత్స అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. ఇందులో భాగంగానే తిరుపతిలో టీటీడీ ట్రస్ట్, ప్రభుత్వ సంయుక్త ఆధ్వర్యంలో క్యాన్సర్ సెంటర్ రూపుదిద్దుకుంటోందని చెప్పారు. అక్టోబర్ నాటికి దీనిని ప్రారంభిస్తామన్నారు. కర్నూలు, విశాఖపట్నంలో కూడా ప్రత్యేక క్యాన్సర్ కేర్ సెంటర్లను నిర్మిస్తున్నట్టు వెల్లడించారు.

దేశానికి రోల్ మోడల్ ఏపీ

క్యాన్సర్ చికిత్సల్లో ఏపీ తీసుకుంటున్న చర్యలు దేశంలోని అన్ని రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలబెట్టిందని దత్తాత్రేయుడు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ హెల్త్ స్కీమ్‌లో చికిత్సలు అందించని వాటికి సైతం ఏపీ ప్రభుత్వం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత వైద్య సేవలు అందిస్తోందన్నారు. రూ. 16 కోట్లతో గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో వైద్య పరికరాలు అమర్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో గుంటూరు నాట్కో సెంటర్‌లో క్యాన్సర్ వైద్య సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చాగంటి పద్మావతిదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ నీలం ప్రభావతి, డెప్యూటీ సూపరింటెండెంట్ పద్మశ్రీ, క్యాన్సర్ వైద్య విభాగాధిపతి టీవీ శివరామకృష్ణ, నాట్కో క్యాన్సర్ సెంటర్ సమన్వయకర్త యడ్లపాటి అశోక్‌కుమార్, డీఎంహెచ్‌వో అమర్తలూరి శ్రావణ్‌బాబు పాల్గొన్నారు.

పోలవరంలో డీడీఆర్పీ బృందం పరిశీలన



డయాఫ్రమ్‌వాల్ పరిస్థితిని పరిశీలిస్తున్న నిపుణుల బృందం సభ్యులు



పోలవరం పనులను పరిశీలిస్తున్న నిపుణుల బృందం సభ్యులు

- 150–1,190 మీటర్ల మధ్య పలుచోట్ల డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్నట్లు తేల్చిన ఎన్‌హెచ్‌పీసీ
- తాము నిర్వహించిన పరీక్షల ఫలితాలను వివరించిన ఎన్‌హెచ్‌పీసీ అధికారులు
- నేడు రాజమహేంద్రవరంలో తుది నిర్ణయం వెల్లడించనున్న డీడీఆర్పీ
- దిగువ కాఫర్ డ్యామ్ పనుల నాణ్యతపై ప్రశంసలు
- స్పిల్ వే పనితీరుపైనా సంతృప్తి

సాక్షి, అమరావతి/పోలవరం రూరల్ :పోలవరం ప్రాజెక్టు పనులను కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) మాజీ చైర్మన్ ఏబీ పాండ్య నేతృత్వంలోని డీడీఆర్పీ (డ్యామ్ డిజైన్ రివ్యూ ప్యానల్) బృందం శనివారం పరిశీలించింది. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ సి. నారాయణరెడ్డి తదితరులు డీడీఆర్పీ బృందానికి క్షేత్రస్థాయిలో ప్రాజెక్టు పనులను చూపించారు. ప్రధాన డ్యామ్ గ్యాప్-2లో గోదావరి వరదల ఉధృతికి దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌ను తొలుత డీడీఆర్పీ పరిశీలించింది. క్షేత్రస్థాయిలో డయాఫ్రమ్ వాల్‌ను నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌పీసీ) అధికారులు డీడీఆర్పీ బృందానికి చూపిస్తూ.. తాము నిర్వహించిన పరీక్షల్లో వెల్లడైన ఫలితాలను వివరించారు. ప్రధాన డ్యామ్ గ్యాప్-2లో 1,750 మీటర్ల పొడవున నిర్మించిన డయాఫ్రమ్ వాల్‌లో గోదావరి వరదల ఉధృతికి 150 మీటర్ల నుంచి 1,190 మీటర్ల మధ్యన పలుచోట్ల దెబ్బతిన్నట్లు తాము నిర్వహించిన నాలుగు రకాల పరీక్షల్లో (ఎలక్ట్రికల్ రెసిస్టివిటీ టోమోగ్రఫీ-ఈఆర్‌టీ, సెస్మిక్ రీఫ్రాక్షన్ టోమోగ్రఫీ-ఎస్ఆర్‌టీ, క్రాస్‌హోల్-సెస్మిక్ టోమోగ్రఫీ-సీఎస్‌టీ, సెస్మిక్ టోమోగ్రఫీ) వెల్లడైందని డీడీఆర్పీ బృందానికి ఎన్‌హెచ్‌పీసీ అధికారులు వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం గోదావరి వరదను మళ్లించేలా అప్రోచ్ ఛానల్, స్పిల్ వే, స్పిల్ ఛానల్ పూర్తిచేయకుండా.. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు కట్టకుండా డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించడంవల్లే గోదావరి వరదల ఉధృతికి అది దెబ్బతిందని అధికార వర్గాలు తేల్చాయి. క్షేత్రస్థాయి పరిశీలన, ఎన్‌హెచ్‌పీసీ పరీక్షల నివేదికలలో వెల్లడైన అంశాలపై ఆదివారం రాజమహేంద్రవరంలో సీడబ్ల్యూసీ, పీపీఏ, రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులతో డీడీఆర్పీ బృందం సమావేశం నిర్వహించనుంది. డయాఫ్రమ్ వాల్‌పై తుది నిర్ణయాన్ని ఈ సమావేశంలో వెల్లడిస్తుందని అధికార వర్గాలు తెలిపాయి. దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌కు సమాంతరంగా కొత్తగా డయాఫ్రమ్ వాల్ నిర్మించాలా? లేదంటే పాత డయాఫ్రమ్ వాల్‌నే పటిష్టం చేయాలా? లేదా బాగా బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో మాత్రమే పాత దానికి సమాంతరంగా కొత్తగా డయాఫ్రమ్ వాల్ నిర్మించాలా? అనే అంశంపై డీడీఆర్పీ తుది నిర్ణయాన్ని ఆదివారం వెల్లడించనుంది.

దిగువ కాఫర్ డ్యామ్ భేష్..

ఇక గోదావరి వరదల ఉధృతికి కోతకు గురైన ప్రాంతంలో ఇటీవల పూర్తిచేసిన దిగువ కాఫర్ డ్యామ్ పనులను డీడీఆర్పీ బృందం పరిశీలించింది. తాము సూచించిన విధానం ప్రకారం నాణ్యంగా పనులు చేశారని అధికారులను అభినందించింది. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య.. ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో గోదావరి వరదల ఉధృతికి కోతకు గురైన ప్రాంతాన్ని ఇసుకతో నింపి, వైబ్రో కాంపాక్షన్ చేస్తూ సరిచేస్తున్న పనుల తీరునూ పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేసింది. గోదావరి వరదల ఉధృతికి ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఏర్పడిన అగాధాలను పూడ్చడానికి గతంలో డీడీఆర్పీ సూచించిన 11 రకాల పరీక్షలను పూర్తిచేశామని సీఈ సుధాకర్‌బాబు వివరించారు. ఆ పరీక్షల ఫలితాలు ఆధారంగా ఆదివారం నిర్వహించే సమావేశంలో అగాధాలను పూడ్చే విధానాన్ని డీడీఆర్పీ ఖరారు చేయనుంది.

అద్భుతంగా స్పిల్ వే పనితీరు:

అలాగే, పోలవరం స్పిల్ వే, స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్ గైడ్ బండ్‌లను కూడా డీడీఆర్పీ పరిశీలించింది. ప్రస్తుత నీటి సంవత్సరంలో గోదావరి చరిత్రలో రెండో అతిపెద్ద భారీ వరద ప్రవాహం (6,150.04 టీఎంసీలు) వచ్చినా.. పోలవరం స్పిల్ వే ద్వారా అద్భుతంగా నియంత్రించి, దిగువకు విడుదల చేశారని ప్రశంసించింది. స్పిల్‌వే గేట్ల పనితీరు, స్పిల్ వే గ్యాలరీలో కలయతిరిగి.. ఎలాంటి లీకేజీలు లేకపోవడంతో సంతృప్తి వ్యక్తంచేసింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.